Dwaraka

fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 21 | విజయవాడ, సోమవారం 22 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



భారత్ అంటే వాణిజ్యం

- దావోస్ పర్యటనకు ముందు ప్రధాని మోడీ
- నేటి నుండి ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాలు
- హాజరుకానున్న చంద్రబాబు

న్యూఢిల్లీ/అమరావతి బ్యూరో : 'భారత్ అంటే వాణిజ్యం' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాలకు బయలుదేరే ముందు ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఇదే హ్యాష్‌ట్యాగ్‌తో ట్విటర్లో వరుస సందేశాలనుంచిన ఆయన వాటిలో 'అంతర్జాతీయ సమాజంతో భారత్ భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నా' అని పేర్కొన్నారు. దావోస్‌లో సోమవారం నుండి ఐదు రోజుల పాటు జరగనున్న 48వ ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశంలో ప్రధాని మోడీతో భారత్ తరపున దాదాపు 130 మంది పాల్గొననున్నారు "భిన్నమైన ప్రపంచంలో భాగస్వామ్య భవిష్యత్ సృష్టించడం" అనే ఇతివృత్తంతో ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశం జరుగుతుందని ఛైర్మన్ క్లాస్ స్చ్వాబ్ ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం నాడు ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు, మంత్రులు యనమల, నారా లోకేశ్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, వ్యవసాయ సలహాదారు విజయకుమార్, ఇడిబి సిఇఒ కృష్ణకిషోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఆరోఖ్యరాజ్ ఇతర సిఎంఒ అధికారులు దావోస్ సమావేశాలకు హాజరవుతున్నారు. ప్రధానమంత్రి హోదాలో భారత నాయకుడు దావోస్ సమావేశాలకు హాజరుకావడం 20 ఏళ్ల తరువాత ఇదే మిగతా 9లో

కంపెనీ సాగుకు ఉరకలు



- రంగంలోకి 8 ఐటి కంపెనీలు
- జిల్లాలవారీ కాంట్రాక్టులు
- కార్పొరేట్ల గుప్పెట్లోకి రైతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

దేశంలో కార్పొరేట్ సాగును దూకుడుగా ప్రవేశపెట్టేందుకు నరేంద్ర మోడీ సర్కారు ఉవ్విళ్లూరుతుండగా అంతకంటే ముందే ఆంధ్రప్రదేశ్‌లో సదరు సేద్యంపై ప్రయోగాలు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం పరుగులు పెడుతోంది. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కురిపించే పంటలను మన రైతుల చేత పండించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రైతులను కార్పొరేట్ల గుప్పెట్లోకి నెట్టేందుకు పక్కా స్కెచ్ వేసింది. అందుకోసం సమాచార మార్పిడి, సర్వేలు నిర్వహించేందుకు పలు ప్రైవేటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) సంస్థలను రంగంలోకి దించేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. వ్యవసాయరంగంలో డిజిటలైజేషన్, ఆన్‌లైన్ సేవలు అనే ముద్దుపేరు పేరుపెట్టింది. ఇప్పటికే ఎనిమిది సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. పైలెట్ ప్రాజెక్టులను జిల్లాల వారీగా కేటాయించింది. జిల్లా కలెక్టర్లు సమర్ధవంతంగా అమలు చేయాలని మిగతా 9లో

బిజెపి ఓటమే లక్ష్యం

- కాంగ్రెస్‌తో పొత్తులుండవు
- సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి
- ముసాయిదా రాజకీయ తీర్మానానికి కేంద్రకమిటీ ఆమోదం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి, - కోల్‌కతా

రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల ఎత్తుగడలు ఉంటాయని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీతో ఎటువంటి రాజకీయ ఫ్రంట్ గానీ, పొత్తు కానీ ఉండదని చెప్పారు. ఈ మేరకు 22వ పార్టీ జాతీయ మహాసభల్లో చర్చించేందుకు కేంద్ర కమిటీ ఆమోదించిన ముసాయిదా రాజకీయ తీర్మానంలో పేర్కొనట్లు చెప్పారు. ఈనెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కోల్‌కతాలో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశ వివరాలను సీతారాం ఏచూరి వెల్లడించారు. 22వ జాతీయ మహాసభల కోసం పార్టీ పోలిట్‌బ్యూరో రూపొందించిన ముసాయిదా రాజకీయ తీర్మానంపై చర్చించిన కేంద్ర కమిటీ కొన్ని సరవణలతో దాన్ని ఆమోదించినట్లు తెలిపారు. మహాసభలకు రెండు నెలల ముందుగా కేంద్ర కమిటీ ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని పార్టీలో అంతర్గతంగా చర్చించేందుకు విడుదల చేస్తుందని చెప్పారు. నాలుగు నెలల చర్చల తర్వాత మూడో కేంద్ర కమిటీ సమావేశంలో ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించినట్లు చెప్పారు. ఆమోదం పొందిన విధానం పార్టీలో ఉన్నత స్థాయిలో ఉన్న అంతర్గత ప్రజాస్వామ్యానికి తార్కాణమని అన్నారు. పొలిట్‌బ్యూరో రూపొందించిన ముసాయిదాకు ఓటింగ్ జరిపి మెజార్టీ నిర్ణయం మేరకు సవరణలు చేసినట్లు చెప్పారు.

బిజెపిని, ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఓడించడమే ప్రధాన లక్ష్యమని ముసాయిదా పేర్కొన్నట్లు ఏచూరి చెప్పారు. భారత ప్రజలపై బిజెపి ప్రభుత్వం నాలుగు రకాలుగా దాడులు చేస్తోందని మిగతా 9లో





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనకు ఏడాదైన సందర్భంగా లక్షలాది మంది మహిళలు వివిధ నగరాలలో భారీయెత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చికాగోలో నిర్వహించిన ప్రదర్శనకు తరలివచ్చిన మహిళలను చిత్రంలో చూడవచ్చు. (వార్త 9వలో)

చివరి వరకూ చూద్దాం

- విభజన హామీలపై టిడిపి వర్క్‌షాపులోసిఎం చంద్రబాబు
- కేంద్రంపై విమర్శలు చేయొద్దు
- వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలవాల్సిందే
- భవిష్యత్‌లో రాజకీయ పునరేకీకరణ జరగాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన హామీలపై చివరి వరకూ చూద్దామని, లేకుంటే కేంద్రానికి దండం పెడదామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. తాను అన్ని ప్రయత్నాలూ చేస్తున్నానని, చివరిదాకా ప్రయత్నిస్తానని చెప్పారు. మిగతా వారిలా తాను కూడా తిరగబడితే ప్రజలు అసహనానికి గురై రెచ్చిపోతారని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంపై ఎవరూ విమర్శలు చేయవద్దని ఆయన సూచించారు. విభజన హామీలు నెవవేరుస్తామని ప్రధానితో ఇటీవల జరిగిన భేటీలో హామీ ఇచ్చినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఉండవల్లిలోని తన నివాసంలో టిడిపి ఒక్క రోజు వర్క్‌షాపు ఆదివారం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా 8 అంశాలపై నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి సిఎం మాట్లాడారు. ఇంటింటికి తెలుగుదేశం, జన్మభూమి కార్యక్రమం తీరు, నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, పోలవరం పనుల తీరు, విభజన చట్టం హామీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, కులాలు, ప్రాంతాల మధ్య ప్రతిపక్షం చేస్తున్న కుట్రలు తదితర అంశాలపై నేతలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని ఓడించే శక్తి ఏ పార్టీకి లేదన్నారు. నేతల పనితీరు బాగుంటే ప్రజలు నిరంతరం ఆదరిస్తారన్నారు. ఎన్నికలంటే గతంలో ప్రభుత్వ వ్యతిరేకత మీద ఆధారపడి ఉండేవని, ఇప్పుడు పనితీరు మీద ఆధారపడి ఉందని అన్నారు. హైదరాబాద్‌కు తాను చేసిందేమీ లేదని కొందరు అంటున్నారని, 1995కు ముందు హైదరాబాద్ ఎలా ఉందో, ఆ తర్వాత ఎలా ఉందో ఆలోచిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మూడేళ్లలో ప్రతి ఇంటికీ శుద్ధనీటిని అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, అన్న క్యాంటీన్లు, నిరుద్యోగ భృతికి త్వరలో శ్రీకారం చుడతామని సిఎం వెల్లడించారు. చిత్తూరు, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల మిగతా 9లో

కాల్‌మనీ లైంగిక వేధింపుల కేసులో
రెండేళ్ల తరువాత ఛార్జిషీట్

- పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు
- ఛార్జిషీట్‌లోనూ ఏడుగురు పేర్లే
- కాలయాపనతో నిందితులకు లబ్ధి
- ఆధారాల సేకరణలోనూ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విజయవాడ కాల్‌మనీ లైంగిక వేధింపుల కేసులో రెండేళ్లు దాటిన తరువాత ఎట్టకేలకు పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. 2015 డిసెంబర్ 11న నమోదైన కేసుకు సంబంధించి అప్పటి ఎఫ్ఐఆర్‌లో నమోదైన ఏడుగురు నిందితులు యలమంచిలి శ్రీరామమూర్తి, భవానీశంకర్, చెన్నుపాటి శ్రీను, సత్యానందం, వెనిగళ్ల శ్రీకాంత్, పెండ్యాల శ్రీకాంత్, దూడల రాజేష్‌లనే ప్రస్తుత ఛార్జిషీట్‌లో చూపారు. 90 రోజుల్లో ఛార్జిషీట్ నమోదు చేయాల్సి ఉన్నా రెండేళ్లు దర్యాప్తు చేసిన అనంతరం తూతూ మంత్రంగా ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు అందులో సరైన సైంటిఫిక్ ఆధారాల్ని కోర్టులో ప్రవేశ పెట్టలేదనే విమర్శలొస్తున్నాయి. ఛార్జిషీట్‌లో 20 మందిని సాక్షులుగా విచారించామని పోలీసులు పేర్కొన్నారు. సాక్షులందరూ నిందితులకు పరిచయస్తులు, బాగా తెలిసిన వారేనని మరోపక్క బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల వాంగ్మూలం నమోదు చేసినా అందుకు తగ్గ సైంటిఫిక్ ఆధారాల్ని ఛార్జిషీట్‌లో చూపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ ఒత్తిడితోనే నిందితులకు అనుకూలంగా పోలీసులు మిగతా 2లో



ప్రధానఎన్నికల కమిషనర్‌గా ఓంప్రకాశ్‌రావత్

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా ఓం ప్రకాశ్ రావత్‌ను నియమించారు. ఈనెల 23న ఆయన సీఈసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రస్తుతం చీఫ్ ఎన్నికల కమిషనర్‌గా ఉన్న అచల్ కుమార్ జోతి పదవీకాలం ఈ వారంతో ముగియనున్న నేపథ్యంలో తదుపరి సీఈసీగా రావత్‌ను నియమించారు. అలాగే మరో ఎన్నికల కమిషనర్‌గా ఆర్థిక మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసాను నియమించారు. ఆయన కూడా ఈ నెల 23నే బాధ్యతలు స్వీకరిస్తారు. 1980 బ్యాచ్‌కు చెందిన హరియాణా ఐఏఎస్ అధికారి లావాసా. మరో ఎన్నికల కమిషనర్‌గా సునీల్ ఆరోరా వున్నారు. 64 ఏళ్ల రావత్ 1977 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.

మొరిగే కుక్కలకు భయపడం



- దళితులపై కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే అనుచిత వ్యాఖ్యలు
- ఆగ్రహించిన దళితులు
- వ్యాఖ్యలను వక్రీకరించారన్న మంత్రి

బళ్ళారి (కర్ణాటక) : కేంద్ర నైపుణ్యాల అభివృద్ధి శాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే శనివారం దళితులనుద్దేశించిన చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి. వీధి కుక్కల మొరుగుళ్ళకు తాము భయపడమంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దళితులను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులు ఆందోళనకు దిగారు. బళ్ళారిలో శని వారం జరుగుతున్న ఒక జాబ్ మేళాను ప్రారంభించడానికి బయలుదేరినన మంత్రి మిగతా 9లో

షెడ్యూల్ ప్రకారమే టెట్


మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత షెడ్యూల్ ప్రకారమే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జరుగుతుందని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ షెడ్యూల్‌లో ఏలాంటి మార్పు ఉండదని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5 నుంచి 15 వరకు టెట్ నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల షెడ్యూల్ మారుతుందన్న వదంతుల్ని అభ్యర్థులు నమ్మొద్దని స్పష్టం చేశారు. కాగా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 4,36,311 మంది ఆన్‌లైన్ ద్వారా టెట్‌కు ఫీజు చెల్లించారు. 4,26,333 మంది అభ్యర్థులు దరఖాస్తుల్ని మిగతా 9లో

శాస్త్ర సమాజానికే అవమానం

కేంద్ర మంత్రి సత్యపాల్‌సింగ్ వ్యాఖ్యలపై శాస్త్రవేత్తల ధ్వజం



న్యూఢిల్లీ: ఛార్లెస్ డార్విన్ ఆవిష్కరించిన జీవ పరిణామ సిద్ధాంతంపై కేంద్ర మానవ వనరుల శాఖ ఉప మంత్రి సత్యపాల్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. జీవుల పరిణామ క్రమంపై డార్విన్ ఆవిష్కరించిన ఈ సిద్ధాంతం 'శాస్త్రీయంగా తప్పు' అని మంత్రి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మంత్రి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) మాజీ అధ్యక్షుడు రాఘవేంద్ర గడ్కర్‌తో సహా పలువురు శాస్త్రవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు శాస్త్ర సమాజాన్ని అవమానించటమేనని గడ్కర్ అన్నారు. శాస్త్రవిజ్ఞానాన్ని, శాస్త్రవేత్తలను రాజకీయంగా విడదీసే లక్ష్యంతోనే మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారని, అత్యంత ప్రమాదకరమైన ఈ ధోరణిని శాస్త్రసమాజం కలిసికట్టుగా మిగతా 9లో

పవన్‌ను కలిసిన పోలెండ్ అంబాసిడర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పవన్ కల్యాణ్ చాలా బ్రిలియంట్ అని పోలెండ్ అంబాసిడర్ ఆడమ్ బురాకోవస్కీ ప్రశంసించారు. భారతీయ జీవన శైలి, విద్యా విధానాన్ని అధ్యయనం చేయడానికి వచ్చిన విద్యార్థులతో కలిసి ఆదివారం ఉదయం జనసేన కార్యాలయంలో పవన్ కల్యాన్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆడమ్ బురాకోవస్కీ ఆయనతో వచ్చిన విద్యార్థులను పవన్ కల్యాణ్ సాదరంగా ఆహ్వానించారు. సాంప్రదాయ బద్ధంగా రెండు దేశాల జాతీయ పతకాలను ఇచ్చి పుచ్చుకున్నారు. పోలెండ్‌లో భారతీయ సినిమా చిత్రీకరణకు సహకరించాలని కోరారు.

దౌత్య ఆథిత్యం

పోలెండ్ దౌత్యవేత్త ఆడమ్ బురాకోవస్కీ దంపతులతో జనసేన అధినేత పవన్ కల్యాణ్



కేంద్ర మంత్రి ప్రకటన అశాస్త్రీయం

డార్వినిజమే శాస్త్రీయ సిద్ధాంతం : జన విజ్ఞాన వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డార్విన్ ప్రతిపాదించిన మానవ (జీవ) పరిణామ సిద్ధాంతం తప్పు అని కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ చేసిన అశాస్త్రీయ ప్రకటనను ఖండిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రవి కుమార్, ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుబట్టడం విజ్ఞాన శాస్త్ర దృక్పథాన్ని అవహేళన చేయడమేనన్నారు. డార్వినిజమే శాస్త్రీయ సిద్ధాంతమని పేర్కొన్నారు. దీవులు, ద్వీపకల్పాలలో అనేక జీవుల సారూప్యత, వైవిధ్యాల్ని జీవ శాస్త్రవేత్తగా డార్విన్ అధ్యయనం చేశారన్నారు. ఆయన పరిశీలన సుదీర్ఘకాలం సాగిందని తెలిపారు. వాటికి శాస్త్రీయమైన ఆధారాలు చూపించారన్నారు. డార్విన్ సిద్ధాంతమే ప్రమాణికంగా గుర్తించారని తెలిపారు. క్రైస్తవ మత పోప్ జాన్‌పాల్ కూడా ఈ సిద్ధాంతాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. ప్రాచీన పుస్తకాల్లో లేదనే సాకుతో పాఠ్యాంశాల్లో నుంచి ఈ సిద్ధాంతాన్ని తొలగించాలనే ధోరణి అవివేకమని తెలిపారు. ప్రపంచంలో ఇప్పటికే నిరూపించిన విజ్ఞాన శాస్త్ర దృక్పథాన్ని తిరస్కరించే తిరోగమన ధోరణి మరింత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అభిప్రాయం అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను దిగజార్చడమే కాకుండా సైన్స్‌పట్ల వ్యతిరేక భావాన్ని కలిగిస్తుందన్నారు. ఇలాంటి అశాస్త్రీయ భావాలతో పాత రాతియుగంలోకి, చీకటి యుగంలోకి తీసుకెళ్లే చర్యల్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడి నోబెల్ సాధించే విధంగా మన సైన్స్ కరికులం ఉండాలని జెవివి కోరుకుంటోందని పేర్కొన్నారు.



రాష్ట్రంలో ఈశాన్య గాలులు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంపైకి ఈశాన్యం, తూర్పు దిశ నుండి చలి గాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ ఆదివారం ప్రకటించింది. ఆకాశం నిర్మలంగా ఉండటంతో పగలు ఎండలు, రాత్రి వేళల్లో మంచు కురుస్తుందని తెలిపింది. నాలుగురోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొంది. దక్షిణ అండమాన్‌కు ఆనుకుని మలయ్ ద్వీపంలో ఆవర్తనం ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. భూమధ్య రేఖ ప్రాంతానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళా ఖాతంలో అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని వివరించింది.

ప్రజ్ఞ

1. మధ్యప్రదేశ్ నూతన గవర్నర్?
2. ఆగ్నేయ ఆసియా దేశాల రామణాయ ఉత్సవ్ ఎక్కడ జరుగుతుంది?
3. ఇటీవల మృతి చెందిన చాంది లాహిరి ఏ రంగానికి చెందినవారు?
4. అంధుల ప్రపంచకప్ 2018 విజేత?
5. జాకమ్ డ్యామ్ ఎక్కడ ఉంది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రంగనాధంకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన, మౌలిక సదుపాయాల కల్పన శాఖల సలహాదారు కె.రంగనాధంకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పురస్కారాన్ని గణతంత్ర వేడుకల్లో అందజేయనున్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు ఆదివారం ప్రకటించారు. 50 ఏళ్లుగా విద్యుత్తు శాఖకు, ఇంజనీరింగ్, విద్యుత్తు నియంత్రణ మండలికి సేవలందిస్తున్నారని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో సిఎండి కె.విజయానంద్ తదితరులు పేర్కొన్నారు.

కర్నూల్లో మరో 'దేవరపల్లి'

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నిర్మాణ కోసం అడ్డగోలు తవ్వకాలు

- నిలువునా దళితుల నోట్లో మట్టి
- పాలక పార్టీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోని యంత్రాంగం
- దిక్కుతోచని స్థితిలో బాధితులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మరో 'దేవరపల్లి'గా తయారైంది. ప్రకాశం జిల్లా దేవరపల్లిలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు.. దళితుల భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్న విషయమూ,. తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడి భూముల నుంచి పరాన్నభుక్కులను వైదొలిగేలా చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. అదే మాదిరిగా ఇప్పుడు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని దళితుల భూముల్లో మట్టిని యథేచ్ఛగా తవ్వకుంటున్నారు. మట్టి ఆ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి తరలిస్తున్నామని, ప్రశ్నించడానికి మీరెవరని ప్రశ్నించినవారిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు దౌర్జన్యానికి దిగుతున్నారు. దీనిపై దళిత రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పాలకపార్టీ ఎమ్మెల్యేలు కావడంతో వారేమీ చేయలేకపోతున్నారు. ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతుండటంతో రాళ్లు తేలి భూములు పనికిరాకుండా పోతున్నాయి.

ఓర్వకల్లు వద్ద చేపడుతున్న ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టు జిల్లాలోని ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు వచ్చింది. కన్నమడకల, పూడిచెర్ల గ్రామాల మధ్య పెద్దఎత్తున ఎర్రమట్టి(గ్రావెల్) అవసరమవుతోంది. దీంతో ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే దళితుల భూముల్లోనే దౌర్జన్యంగా మట్టిని తరలిస్తున్నారు. పూడిచెర్ల గ్రామం సర్వే నెంబర్ 372లో 36 ఎకరాల స్థలం ఉంది. ఇదే భూమిలో ఏళ్ల తరబడి సాగులో వున్న దళితులకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇందులో రైతు గొల్ల వెంకట్రామయ్యకు పూర్వీకుల నుంచి వచ్చిన నాలుగెకరాల ఆస్తే ఆయన జీవనాధారం. ప్రస్తుతం ఎకరం పొలం రూ. 10 లక్షలు పైనే ఉంది. కాంట్రాక్టర్లు రైతుకు ఎలాంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా, కనీసం వారికి చెప్పకుండా పొక్లెయిన్లతో మట్టినంతా తవ్వేశారు. ఐదేళ్ల క్రితం లారీ ప్రమాదంలో ముగ్గురు గ్రామసేవకులు మృతి చెందగా వారి భార్యలు ఈశ్వరమ్మ, రామలక్ష్మిలకు రెండు ఎకరాల చొప్పున ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ భూమిలో కూడా అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా మైనింగ్ చేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన 13 మంది దళితుల పొలాల్లో తవ్వకాలు చేపట్టడంతో అవి ఎందుకూ పనికిరాకుండా మారాయి.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా వున్న లారీలు



కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ఎయిర్‌పోర్టు కోసం మట్టిని తవ్వుతున్న పొక్లెయినర్లు

మామిడి తోటలు ధ్వంసం

దళిత మహిళలు దానమ్మ, లింగమ్మ, రత్నమ్మలకు ఎకరా చొప్పున ప్రభుత్వం భూమిని కేటాయించడంతో వారు ఉపాధి హామీ పథకం కింద మామిడి మొక్కలను పెంచుతున్నారు. వీరి పొలంలోనూ మామిడిచెట్లను ధ్వంసం చేస్తూ మొత్తం ఎర్రమట్టినంతా తరిలించుకుపోయారు. దీంతో వారి పొలం సాగుకు పనికి రాకుండా పోయింది.

దళిత రైతుల పట్ల నిర్లక్ష్యం



పేద దళిత రైతులకు ఎలాంటి పరిహారమూ ఇవ్వకుండా, వారి భూముల్లో మట్టిని ఎయిర్ పోర్టు నిర్మాణానికి అక్రమంగా తరలించడం అన్యాయం. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం కాంట్రాక్టర్లకు తగదు.

బి.నాగన్న, సిపిఎం ఓర్వకల్లు మండల కన్వీనర్

మా భూములకు నష్టపరిహారమివ్వాలి



గతంలో మేము అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు పొందాం. ఇప్పుడు మా భూములకు ఎలాంటి నష్ట పరిహారమివ్వ కుండానే మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఇంతవరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు వచ్చి సందర్శించిన పరిస్థితే లేదు.

బక్కన్న, రైతు, పూడిచెర్ల

పరిహారమిచ్చి ఆదుకోవాలి



ఎయిర్ పోర్టు నిర్మాణం పేరుతో దళితుల భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. భూములు సాగుకు పనికి రావు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

సువార్తమ్మ, మహిళా రైతు, పూడిచెర్ల

ఇబ్బందులకు గురి చేయడం తగదు



పేదల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి, కనీసం పరిహారమివ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

రాజన్న, రైతు, పూడిచెర్ల

ప్రజారోగ్యానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి

- మార్చి 4న విశాఖలో జాతీయ సదస్సు
- జెఎస్ఎ, ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ వచ్చే బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కేటాయింపులు పెంచాలని జన స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ) ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు జెఎస్ఎ, ప్రజారోగ్య వేదిక నాయకులు ఆదివారం ఎమ్‌బి విజ్ఞాన కేంద్రంలో ప్రాంతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. సురేష్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో వసతులపై సర్వే చేసి వాటి ఆధారంగా అవసరమైన వసతులు, సిబ్బంది, పరికరాలు, అందుకు కావాల్సిన బడ్జెట్ కేటాయింపులపై అంచనాలు రూపొందిస్తామన్నారు. మార్చి 4న విశాఖలో ' ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం - సవాళ్లు - అవకాశాలు ' అంశం పై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా కేంద్ర ప్రభుత్వ వైద్యఆరోగ్య శాఖ పూర్వ కార్యదర్శి సుజాతారావు, జెఎస్ఎ జాతీయ నాయకులు అమితవ గుహ హాజరవుతారని తెలిపారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎమ్‌వి. రమణయ్య, టి. కామేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జెఎస్ఎ ప్రతినిధులు వర్క్‌షాపులో పాల్గొన్నారు.

పోరాటం ఆగదు

విభజన హామీల సాధన సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీలను సాధించేంత వరకూ తమ పోరాటం ఆగదని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి స్పష్టం చేసింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడింది. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సినీ నటుడు శివాజీ, ఇతర సమితి సభ్యులతో కలిసి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విభజన హామీల అమలు కోసం అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు.

పలువురు నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా యాత్రలు చేస్తున్నారు తప్ప, విభజన హామీల గురించి ఎవరూ మాట్లాడటం లేదన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ ప్రయోజనాలు తప్ప, రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇద్దరు సభ్యులతో కేసీఆర్ తెలంగాణ తెచ్చుకుంటే, 36 మంది ఎంపీలు ఉండి కూడా ప్రత్యేక హోదా సాధించ లేకపోతున్నందుకు సిగ్గుపడాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు మోడీ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇస్తూ తెలుగు రాష్ట్రాలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

బాబు మళ్లీ మోసం చేస్తున్నారు : రామకృష్ణ

విభజన హామీలపై సుప్రీంకోర్టుకు వెళతామంటూ చంద్రబాబు నాయుడు మళ్లీ ప్రజల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. విభజన హామీల్ని సాధించడంలో చంద్రబాబు నాయుడు పూర్తిగా విఫలమయ్యారన్నారు. బిజెపి ఎంపీ హరిబాబు గవర్నర్‌ను మార్చాలని కాకుండా విశాఖ రైల్వే జోన్ గురించి మాట్లాడితే బాగుండేదన్నారు.

బిజెపి వల్లే ఏపీకి అన్యాయం : నటుడు శివాజీ

ఏపీకి బిజెపి ఏమిచ్చిందో పురంధేశ్వరి చెప్పాలని సినీనటుడు శివాజీ డిమాండ్ చేశారు. ఏపీని బిజెపి దారుణంగా మోసం చేసిందన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై మాట్లాడే నేతే లేకుండా పోయారని, సీఎం చంద్రబాబు నాయుడు కూడా మౌనంగా ఉండటం దారుణమన్నారు.

కాల్‌మనీ లైంగిక వేధింపుల కేసులో రెండేళ్ల తరువాత ఛార్జిషీట్

మొదటి పేజీ తరువాయి



యలమంచిలి శ్రీరాంమూర్తి

వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితులకు విజయవాడ ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ పూర్తి మద్దతు ఉందని చెబుతున్నారు. కేసు నమోదైన సందర్భంగా కొందరు బాధితులు బహిరంగంగానే పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌పై ఆరోపణలు చేశారు. నిందితులతో కలిసి ఎమ్మెల్యే బోడే చేసిన విదేశీ పర్యటనల ఫొటోలు, వీడియోలు కూడా బహిర్గతమయ్యాయి. ఇంత జరిగినా ఎమ్మెల్యేను విచారించడంగానీ, ఛార్జిషీట్‌లో అతని పేరును చేర్చడంగానీ చేయలేదు.

రౌడీ షీట్ కూడా లేదు

ఈ కేసులో ప్రధాన నిందితులకు పోలీసులు రాచమర్యాదలు చేశారు. 2015 డిసెంబర్ 11న విజయవాడ మాచవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన 694/2015 కాల్‌మనీ లైంగిక వేధింపుల కేసులో ఏడుగురు నిందితులపై 354, 367, 376, 386, 387, 480, 120బి, ఐపిసి 34 సెక్షన్లను నమోదు చేశారు. ఎ1 యలమంచిలి శ్రీరామచంద్రమూర్తిపై 11 కేసులు, విద్యుత్‌శాఖ డిఈ ఎ4 సత్యానందంపై 4 కేసులు నమోదయ్యాయి. చిన్న చిన్న నేరాలు చేసే వారిపైన కూడా రౌడీ షీట్, కేడీ షీట్ ప్రారంభించే పోలీసులు ప్రధాన నిందితులపై పదుల సంఖ్యలో కేసులున్నా ఎవరిపైనా రౌడీ షీట్ ఓపెన్ చేయక పోవడం గమనార్హం. కేసు నమోదు తరువాత నిందితుల ఇళ్లపై విజయవాడ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జరిపిన దాడిలో వందల సంఖ్యలో ప్రాంశరీ నోట్లు, ఖాళీ చెక్‌బుక్కులు, ఎటిఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిడితోనే పోలీసులు సంచలనాత్మక కేసును నీరుగార్చేందుకు కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై బాధితులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికార అండతో బెయిల్‌పై బయటకు వచ్చిన ప్రధాన నిందితులు మళ్లా అదే కాల్‌మనీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రధాన కేసుకు సంబంధించి బాధితులను నయానో, భయానో భయపెట్టి రాజీ చేసుకునే దిశగా నిందితులు పలు ఒత్తిళ్లు తెస్తున్నారు.

అసెంబ్లీలో చర్చించినా

లైంగిక వేధింపుల కేసులో అధికార పార్టీ నేతల హస్తం ఉందని బాధితులు బహిరంగంగా ఆరోపించడంతో అసెంబ్లీలోనూ చర్చనీయాంశమైంది. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీశాయి. పోలీసుల వైఖరిని అప్పుడే దుయ్యబట్టాయి. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి. మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. పోలీసులు కాలాతీతం చేయడంతో అందరిలోనూ నిర్లిప్తత ఏర్పడింది. విజయవాడలో మొదటి కేసు నమోదైన తరువాత సుమారు రెండు వేల ఫిర్యాదులందాయి. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఫిర్యాదులు, వందలాది కేసులు నమోదయ్యాయి. వీటిపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో నిందితుల్లో ఎక్కువ మంది మళ్లీ అదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

ఏపార్టీ వారైనా శిక్ష పడాల్సిందే : నన్నపనేని రాజకుమారి

కాల్‌మనీ లైంగిక వేధింపుల కేసులో నిందితులు ఏ పార్టీకి చెందిన వారైనా శిక్ష పడాల్సిందేనని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులూ పారదర్శంగా వ్యవహరించాలని సూచించారు. బాధితులు ఎటువంటి భయం లేకుండా సాక్షాలను బయటపెట్టాలన్నారు. ఎగ్గొట్టే వారికీ, పెద్దలకు మాత్రమే బ్యాంకులు రుణాలిస్తున్నాయని విమర్శించారు. అవసరమున్న వారికి బ్యాంకులు రుణాలిచ్చి సహాయం చేస్తే ఇటువంటి ఘటనలకు ఆస్కారం ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు.

బాధితులకు అన్యాయం : హైకోర్టు న్యాయవాది జెవిఎస్‌హెచ్ శాస్త్రి

పోలీసుల వ్యవహారశైలితో బాధితులకు అన్యాయం జరుగుతోందని హైకోర్టు న్యాయవాది డాక్టర్ జెవిఎస్‌హెచ్ శాస్త్రి అభిప్రాయపడ్డారు. ఛార్జిషీట్‌ను ఆలస్యంగా దాఖలు చేయడమే కాకుండా సరైన ఆధారాలు సమర్పించకపోతే కాల్‌మనీ లైంగిక వేధింపుల వంటి కీలక కేసులు నిలబడవన్నారు. నిందితులకు అనుకూలంగా ఉండే వారిని సాక్షులుగా పెట్టారనే ఆరోపణలొస్తున్నాయన్నారు. పారదర్శంగా దర్యాప్తు చేస్తేనే బాధితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

పర్యటన మొదలు

నేటి నుంచి తెలంగాణాలో పవన్ పర్యటన

తొలి విడతలో మూడు జిల్లాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన రాజకీయ యాత్రను తెలంగాణ నుంచే ప్రారంభించనున్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టులో సోమవారం ఆంజనేయస్వామిని దర్శించుకుని, అక్కడి నుంచే తన పర్యటన తొలి కార్యాచరణను ప్రకటించనున్నారు. 2009 ఎన్నికల సమయంలో కొండగట్టు వద్ద జరిగిన పెద్ద ప్రమాదం నుంచి బయటపడటం, తన కుటుంబ ఇలవేల్పు ఆంజనేయస్వామి కావడంతో అక్కడి నుంచే తన రాజకీయ యాత్రను ప్రాంభించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటలకు కొండగట్టు చేరుకుంటారు. అక్కడ షెడ్యూల్‌ను విడుదల చేస్తారు. సాయంత్రం కరీంనగర్‌లో జనసేన పార్టీ ముఖ్య నేతలతో భేటీ అవుతారు. 23న జగిత్యాల రోడ్‌లోని శుభం గార్డెన్స్‌లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కార్యకర్తలు, నాయకులతో సమావేశవుతారు. అక్కడి నుంచి కొత్తగూడెం బయలుదేరి వెళతారు. రాత్రి కొత్తగూడెంలోనే బస చేసి, 24న ఉదయం 9 గంటలకు కొత్తగూడెం నుంచి రోడ్‌షో చేపడతారు. మధ్యాహ్నం 1:30కు ఖమ్మం చేరుకుని, ఎంబి గార్డెన్‌లో జరిగే ఉమ్మడి, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌కు చేరుకుంటారు.



ప్రజా సమస్యల అధ్యయనం కోసమే : పవన్

ప్రజా సమస్యల అధ్యనం కోసమే యాత్ర చేపడుతున్నట్లు జనసేన అధినేత పవన్ కల్యాన్ తెలిపారు. ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో సతీమణి అన్నాతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ తెలంగాణలోని మూడు, నాలుగు జిల్లాల్లో రాజకీయ యాత్ర ఉంటుందన్నారు. ప్రస్తుతం యాత్ర ఎలా ఉంటుందనేది కచ్చింతగా చెప్పలేనని, కొండగట్టులోనే యాత్ర షెడ్యూల్‌ను ప్రకటిస్తానని తెలిపారు. అయితే పాదయాత్ర వల్ల ఎక్కువ మంది జనాల్ని కలిసే అవకాశం ఉండదన్నారు. తన యాత్రలో వీలైనంత ఎక్కువ మందిని కలవాలని అనుకుంటున్నానని తెలిపారు. రోడ్‌షోలతో పాటు అవసరాన్ని బట్టి నడవడం కూడా చేస్తానని స్పష్టం చేశారు. యాత్రలో ప్రజలతో పాటు ఎప్పటికప్పుడు కార్యకర్తలు, అభిమానుల్ని కలుస్తానన్నారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యల్ని తెలుసుకుని, వాటి పరిష్కారాలపై దృష్టి పెడతామన్నారు.

హైదరాబాద్‌లోనే పార్టీ ప్లీనరీ?

ఈ నేపథ్యంలో ఉదయం పవన్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పర్యటన షెడ్యూల్‌తో పాటు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పార్టీ ప్లీనరీ నిర్వహణ, సభ్యత్వ నమోదు కార్యక్రమం వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ మొదటి ప్లీనరీ సమావేశాన్ని హైదరాబాద్‌లోనే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. మార్చి మొదటి వారం లేదా రెండో వారంలో ప్లీనరీని నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెల చివరి వారంలో పార్టీ సమన్వయ కర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాలకు చెందిన నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు.

సంక్షిప్తం

జగన్ పాదయాత్రలో అపశృతి

స్టేజీ కూలడంతో నలుగురు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (చిత్తూరు)

జగన్ చేపట్టిన పాదయాత్రలో ఆదివారం అపశృతి చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అకస్మాత్తుగా స్టేజీ కూలిపోవడంతో నలుగురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వైసిపి అధినేత జగన్ కాసేపట్లో పట్టణంలోని స్థానిక పెళ్ళి మండపంలోని స్టేజీ వద్దకు వస్తున్నాడన్న సంగతి తెలుసుకున్న అభిమానులు ఆయన్ను చూడాలన్న తాపత్రయంలో ఒక్కసారిగా ముందుకు కదిలారు. ఈ క్రమంలో ఒత్తిడి పెరిగి ఒక్కసారిగా స్టేజీ మొత్తం కుప్పకూలిపోయింది. ఆ సమయంలో కింద ఉన్న మహిళలపై ఒక్కసారిగా పడటంతో తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో నలుగురు మహిళల చేతి ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. స్టేజీపై ఉన్న తొట్టంబేడు మండల వైసిపి అధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు కాలుకు రక్తస్రావమైంది. ఇంకొందరు మహిళలు ఊపిరి ఆడక అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు గుర్తించి వారిని 108 వాహనంలో శ్రీకాళహస్తికి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

27న అనంతలో గిరిజన శంఖారావం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న అనంతపురంలో గిరిజనుల శంఖారావంను నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజా సమాఖ్య (జిపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. గిరిజనులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బోయల్ని గిరిజనుల్లో చేర్చొద్దని ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సైక్లింగ్ ద్వారా ఆరోగ్య పరిరక్షణ

సిపి గౌతం సవాంగ్

ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్

సైకిల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి జరిగిన సైకిల్ దినోత్సవం ర్యాలీని నగర పోలీస్ కమిషనర్ డి.గౌతమ్ సవాంగ్ ప్రారంభించారు. ఆదివారం ఉదయం బందర్ రోడ్డు మీదుగా ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ ఇధన వాయువుల పరిరక్షణ సామాజిక చైతన్య కార్యక్రమాన్ని సైకిల్ దినోత్సవం నాడు ప్రతి ఒక్కరికీ గుర్తు చేసే విధంగా ర్యాలీని చేపట్టడం సంతోషకరమన్నారు. సైకిల్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు.



విజయవాడలోని కానూరు విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు పెప్స్‌కాన్ స్టాళ్లను పరిశీలిస్తున్న ఎపి ఎకనామిక్ బోర్డు వైస్ చైర్మన్ ఎస్.పి.టక్కర్, ఆర్.ఎం.జోన్స్ తదితరులు

భవన నిర్మాణ నిబంధనలు సులభతరం

ఎపి ఎకనామిక్ బోర్డు వైస్ చైర్మన్ ఎస్‌పి.టక్కర్

ప్రజాశక్తి - పెనమలూరు (కృష్ణా)

రాష్ట్రంలో భవన నిర్మాణ ప్రణాళికలను నిబంధనలను సులభతరం చేశామని, ఆన్‌లైన్ ద్వారానే ప్లానింగ్ పొందే అవకాశం కల్పించామని ఎపి ఎకనామిక్ బోర్డు వైస్ చైర్మన్ ఎస్.పి.టక్కర్ అన్నారు. విజయవాడ నగర శివారులోని కానూరు విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 'పెప్స్‌కాన్-2018 జాతీయ సదస్సు' ముగింపు సందర్భంగా ప్రదర్శన నిమిత్తం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టక్కర్ మాట్లాడుతూ రాజధాని అమరావతిలో భవన నిర్మాణాల విషయంలో ప్రీకాస్ట్ విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. మంచి నాణ్యతతో, త్వరగా, తక్కువ ఖర్చుతో భవన నిర్మాణాలు చేపట్టవచ్చని తెలిపారు. ప్రతీ ప్రాంతాన్ని రెసిడెన్షియల్, కమర్షియల్‌గా విభజించడం జరిగిందని, అన్ని ప్రాంతాలనూ ఏరియల్ సర్వే ద్వారా శాటిలైట్ ఇమేజ్ తీశామన్నారు. ప్రణాళికలకు వీటిని జతచేస్తే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అనుమతులు వస్తాయన్నారు. ఎల్‌అండ్‌టి, హెచ్‌బిఎల్, టాటా హౌసింగ్, బిర్లా, బాయ్, ఆర్‌అండ్‌బి, జెకెసిమెంట్, పి.సూర్యప్రకాష్, కార్యదర్శి సి.ఎ.ప్రసాద్, డిటిసి పి.డైరెక్టర్ రాముడు, సర్వశిక్ష అభియాన్ చీఫ్ ఇంజినీర్ ఎంఆర్‌ఒ నాయుడు, క్రెడాయ్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, సిద్ధార్థ కాలేజీ ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంశధార నీటి నిల్వ సామర్థ్యం కుదింపు



భామిని మండలం కాట్రగడ వద్ద జరుగుతున్న వంశధార ప్రాజెక్టు నిర్మాణ పనులు

8 టిఎంసిల నిల్వకు అనుగుణంగా పనులు

ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని ఆదేశం

రాజకీయ లబ్ధికి ప్రభుత్వ ఆరాటం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం రైతుల లాభం కంటే రాజకీయ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే ప్రారంభానికి సిద్ధమవుతోంది. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి 87, 88, హిరమండలం జలాశయ నిర్మాణం పనుల ప్రగతి 31 శాతం నుంచి 72 శాతం లోపే ఉన్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రాజెక్టు పనులు పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో ఏకంగా లక్ష్యాన్ని కుదించేసింది. 19.5 టిఎంసిల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించాల్సి ఉండగా, ఎనిమిది టిఎంసిల నీటిని నిల్వ చేసే విధంగా పనులు చేపట్టాలంటూ గత నెల చివరి వారంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2018 ఫిబ్రవరి 28లోగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలంటూ ఈ ఆదేశాల్లో పేర్కొంది. దీంతో, జిల్లా జలవనరుల శాఖ అధికారులు దీనికనుగుణంగా పనులు పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సకాలంలో పూర్తి కాని పనులు

వంశధార స్టేజ్-2 ఫేజ్ -2 ప్రాజెక్టును ప్రభుత్వం 87, 88, హిరమండలం జలాశయం నిర్మాణం పనులను మూడు ప్యాకేజీ పనులుగా విభజించింది. 87 ప్యాకేజీ పనులను రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్ సోదరుడు సిఎం రాజేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్టు ప్రయివేట్ లిమిటెడ్ నిర్మాణ సంస్థ చేపడుతోంది. ఒప్పందం ప్రకారం ఈ పనులు 2017 అక్టోబర్ నాటికి పూర్తి కావాలి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 31.19 శాతం మాత్రమే పూర్తయ్యాయి. 88 ప్యాకేజీ పనులను శ్రీ సాయి లక్ష్మి కనస్ట్రక్షన్స్ కంపెనీ దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం ఈ పనులు కూడా 2017 అక్టోబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 51.97 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. హిరమండలం వద్ద నిర్మించాల్సిన 19.5 టిఎంసిల సామర్థ్యంగల జలాశయ నిర్మాణ పనులను సోమా పటేల్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. ఈ పనుల పూర్తికి ఈ ఏడాది జూన్ వరకూ గడువు ఇచ్చింది. పనులు 72.81 శాతం జరిగాయి.

పనులు పూర్తి కాకుండానే ప్రారంభించేందుకు తహతహ

జలశయ నిర్మాణ పనులకు ప్రభుత్వం 2018 జూన్ వరకు గడువు ఇచ్చింది. అంటే అప్పటివరకూ పనులు పూర్తి కావని ప్రభుత్వానికి తెలుసు. అయినప్పటికీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రారంభించా లని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. జనవరి ఐదో తేదీన ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తొలుత ప్రకటిం చింది. పనులు అసంపూర్తిగా ఉండటంతో ఏకంగా జలా శయ సామర్థ్యాన్ని కుదించింది.

19.5 టిఎంసిల సామర్థ్యం ఉన్న జలాశయం నిర్మాణం స్థానంలో ఎనిమిది టిఎంసిల సామర్థ్యంతో జలాశయం నిర్మాణానికి చర్యలు ప్రారంభిం చింది. తద్వారా ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయి తన లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

నిర్వాసితులను హడావుడిగా వెళ్లగొట్టిన ప్రభుత్వం

వంశధార ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే నిర్వాసితుల ఇళ్లను ప్రభుత్వం నేలమట్టం చేసింది. నిర్వాసితులను దౌర్జన్యంగా గ్రామాల నుంచి వెళ్లగొట్టింది. విద్యా సంవత్సరం ముగింపు వరకు సమయమివ్వాలని వేడుకున్నా పట్టించుకోలేదు. కనీసం అద్దె ఇళ్లు చూసుకునే అవకాశం కూడా నిర్వాసితులకు ఇవ్వకుండా పోలీసు బలగాల సాయంతో బలవంతంగా గ్రామాల నుంచి నెట్టేసింది. మరోవైపు పనుల పూర్తికి ప్రాజెక్టు నిర్మాణ సంస్థలకు గడువును పొడిగించింది. ప్రభుత్వం కాంట్రాక్టర్లపై మోజుగానూ, నిర్వాసితులపై కాఠిన్యంగానూ వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.



గండికోట రిజర్వాయర్

గండికోట నిర్లక్ష్యఫలితం

12 టిఎంసిలకే పరిమితం

రూ.90 కోట్ల విడుదలలో నిర్లక్ష్యం

ఇంజినీర్ల తప్పిదంతో నీటి నిల్వకు బ్రేక్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గాలేరు-నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన గండికోట జలాశయం కనీస స్థాయి నిల్వకు గండి పడింది. గండికోట నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యానికి 12 టిఎంసిలు మూల్యం చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. గండికోటలో 19.5 టిఎంసిలను నిల్వ చేయాలని గత నవంబర్‌లో కేబినెట్ సమావేశం నిర్ణయించింది. కొండాపురం మండల కేంద్రం ముంపునకు గురయ్యే అంచనా విషయంలో అప్పటి ఇంజినీర్ల తప్పిదం వల్ల రూ.899 కోట్ల నిర్వాసితుల పరిహారం చెల్లింపుల్లో రూ.479 కోట్ల విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మొదటి విడతలో మిగిలిన మొత్తానికి మరో రూ.90 కోట్ల మొత్తాన్ని విడుదలకు ఆదేశాలివ్వడంలో నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా గండికోటలో 7.5 టిఎంసిల నీటి నిల్వకు పరిమితం కావాల్సి వచ్చింది. జనవరి ఒకటి నుంచి నీటి విడుదలను నిలిపేయడంతో కింది రిజర్వాయర్లకు నీటి తరలింపునకు కోత పడింది. ఫలితంగా జిల్లా రైతాంగం 12 టిఎంసిల నీటిని కోల్పోయింది. 1.23 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది.

ఇంజినీర్ల అంచనా తల్లకిందులు

పోతిరెడ్డిపాడు హెడ్‌ఫ్లో కెనాల్ ద్వారా కర్నూలు జిల్లా లోని గోరకల్లు, అవుకు రిజ ర్వాయర్ల నుంచి గండికోట జలాశయానికి ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. ఐదు టిఎంసిలు దాటిన తరువాత మండల కేంద్రమైన కొండాపురం ముంపునకు గురవుతోంది. అప్పటి ఇంజినీర్లు 22 టిఎంసిలు నిల్వ చేస్తేనే కొండాపురం ముంపునకు గురవుతుందనే అంచనా వేశారు. ఎనిమిది టిఎంసిలకే మండల కేంద్రం ముంపునకు గురవడంతో నీటిని నిల్వ చేయడం 7.5 టిఎంసిలకు తగ్గించేశారు. ఫలితంగా మండల కేంద్రంలోని 1800 నిర్వాసిత కుటుంబాలకు వన్‌టైమ్ కింద రూ.6.75 లక్షల చొప్పున రూ.150 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది.

1.23 లక్షల ఎకరాల సాగుకు ఎసరు

మండల కేంద్రమైన కొండాపురం ముంపునకు గురవుతుండటంతో గండికోట జలాశయంలో 7.5 టిఎంసిలకే నీటిని పరి మితం చేయడంతో 1.20 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా గండికోట ఆధారిత పైడిపాలెం ఎత్తిపోతల కింద 44 వేలు, సర్వరాయసాగర్ కింద 25 వేలు, వామికొండసాగర్ కింద 10 వేల ఎకరాలు, చిత్రావతి రిజర్వాయర్ పరిధిలో కాల్వల టెండర్లకు నోచుకోకపోవడంతో 44 వేల ఎకరాలు వెరసి 1.23 లక్షల ఎకరాలు సాగుకు నోచుకోకుండా పోనుంది.

పేదల వైద్యుడు రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - నెల్లూరు

పేద ప్రజల ఆరాధ్య వైద్యుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి 103వ జయంతి సందర్భంగా నెల్లూరులోని 30వ డివిజన్‌లోని గాంధీనగర్ సిపిఎం కార్యాలయంలో ఆదివారం సభ నిర్వహించారు. సిపిఎం రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రామచంద్రారెడ్డి పేదలకు చౌకగా వైద్యమందాలని, ఆధునిక వైద్యం వారికి అందుబాటులో ఉండాలని తపన పడేవారని కొనియాడారు. పేదలకు నాణ్యమైన వైద్యనందిస్తూ, నూతన వైద్య విద్యార్థులకు వృత్తిలో తర్ఫీదు ఇచ్చేవారన్నారు. అక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న డాక్టర్లు రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలందిస్తున్నారన్నారు. యువజన సంఘ కార్యకర్తలకు ప్రాథమిక చికిత్సలో మెళకువలు నేర్పించి, గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించమని ప్రోత్సహించేవారని గుర్తు చేశారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసేవారని చెప్పారు. ఆయన తనకున్న ఆస్తిని పార్టీకి, ఆస్పత్రి ట్రస్టుకు అందజేసిన గొప్ప మానవతా వాది అని కొనియాడారు. నేటితరం వైద్యులకు, యువకులకు రామ్ స్ఫూర్తిప్రదాత అని తెలిపారు. గాంధీనగర్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎస్‌డి రఫీ అహ్మద్ మాట్లాడుతూ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో నేటికీ నామమాత్రపు ఫీజులతో పేదలకు అత్యంత ఆధునిక వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. నమ్మిన మార్క్సిస్టు సిద్ధాంతం కోసం చివరి వరకూ కృషి చేసిన గొప్ప నిబద్ధత కలిగిన వ్యక్తి రామ్ అని కొనియాడారు. రామ్ ఆశయ సాధన కోసం కార్యకర్తలందరూ కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఎంఆర్ నగర్ శాఖ కార్యదర్శి కోటేశ్వరరావు, 31వ డివిజన్ కార్యదర్శి ఎన్. శీనయ్య, ఆవాజ్ రూరల్ కార్యదర్శి ఎస్‌కె జిలానీ, డివైఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్‌కె అన్సర్, నాయకులు ఎస్‌కె మమూసా, డాక్టర్ షరీఫ్, సికిందర్, గౌస్‌బాషా, గణపతి, ఈశ్వరయ్య, సయ్యద్‌బాబు, దావూద్, సుబహని, పాల్గొన్నారు.



నెల్లూరులో డాక్టర్ రామ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సిపిఎం రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, తదితరులు

అద్దేపల్లి రచనల ముద్రణకు కృషి

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

సృజనశీలి డాక్టర్ అద్దేపల్లి రామ్మోహన్‌రావు రచనల్ని ప్రభుత్వ సహకారంతో ముద్రించేందుకు కృషి చేస్తానని తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్ చైర్మన్ పొట్లూరి హరికృష్ణ అన్నారు. సాంస్కృతీ సమాఖ్య 46వ వార్షిక సాహిత్య మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ ఎంబి.విజ్ఞాన కేంద్రంలో 'ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహన్‌రావు జీవన సదస్సు' అనే అంశంపై ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక, సాంస్కృతిక రంగాలపై సాహిత్య ప్రభావాన్ని అద్దేపల్లి విశ్లేషించారని పేర్కొన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన యువ కవులను ప్రోత్సహించారని వివరించారు. ఈ సందర్భంగా పలువురు కవులను సన్మానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కవులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొట్లూరి హరికృష్ణ

న్యాయవ్యవస్థలో రాజకీయాల ప్రమేయం తగదు

ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

న్యాయ వ్యవస్థలో రాజకీయాల ప్రమేయం నానాటికీ పెరిగిపోతోందని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు తెలిపారు. ప్రజాశక్తి నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో ఆదివారం 'న్యాయవ్యవస్థ - ప్రస్తుత పరిణామాలు'పై అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహార శైలి న్యాయ వ్యవస్థకే కాకుండా దేశ ప్రజాస్వామిక వ్యవస్థకే పెద్ద ముప్పని చెప్తూ నలుగు న్యాయమూర్తులు అరోపణలు చేశారన్నారు. న్యాయవ్యవస్థ తన స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకుంటూ, ప్రభుత్వ నిరంకుశ పోకడల నుండి ప్రజల హక్కులను రక్షిస్తూ, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం లేదని ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో ప్రజలకు జవాబుదారీతనాన్ని పెంచడానికి ప్రగతిశీల శక్తులు, మేథావులు, విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పి.కోటిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేమన కాంస్య విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-అనంతపురం కల్చరల్

దేశంలోనే తొలి సంఘ సంస్కర్త విశ్వకవి యోగివేమనని ఆయా సంఘాల నేతలు కొనియాడారు. ఆదివారం అనంతపురం లలితకళాపరిషత్ నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్లాక్ టవర్ వద్ద యోగివేమన కాంస్య విగ్రహాన్ని కటారుపల్లి విశ్వవేమనకొండ శ్రీనారాయణరెడ్డి స్వామీజీ ఆవిష్కరించారు. అనంతరం లలితకళాపరిషత్‌లో రూట్స్ పబ్లిక్ స్కూల్ అధినేత గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. అఖిల భారత రెడ్ల సంక్షేమ సంఘం తాతిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బాల బ్రహ్మానందరెడ్డి, బళ్లారి జిల్లా రెడ్డి సంఘం గునపల ఐనాథరెడ్డి, రెడ్డిసేవాసమితి నాగిరెడ్డి, కడప రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, యోగివేమన మాసపత్రిక గండి ఆంజనేయ క్షేత్రం బైరెడ్డి అంజన్‌రెడ్డి, రెడ్డినాడు మాసపత్రిక మదనపల్లి కోఆర్డినేటర్ రామమోహన్‌రెడ్డి, అనంతరెడ్డి పరివార్ తాటిగొట్ల సుధాకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది విశ్వనాథరెడ్డి మాట్లాడారు. పామరులకు సైతం అర్థమయ్యే భాషలో పద్యాలను వల్లించి ప్రజలను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తి వేమన అన్నారు. అలాంటి వ్యక్తికి తగిన గుర్తింపు లేకపోవటం సిగ్గుచేటన్నారు. కర్నాటక ప్రభుత్వం వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తోందని, మన ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యోగివేమన రెడ్డి సేవాసంఘం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా కటారుపల్లి విశ్వవేమనకొండ శ్రీనారాయణరెడ్డిస్వామిజీని రెడ్డి సేవాసంఘం అధ్యక్షులు నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు.

విషగుళికలు తిని చిన్నారి మృతి

మరో ముగ్గురికి అస్వస్థత

ప్రజాశక్తి-అమరావతి/గుంటూరు అర్బన్



మృతి చెందిన చిన్నారి అణు

వలస కూలీలు పొలంలో పని చేస్తుండగా చెట్టు కింద ఉన్న గుళికలు తిని ఓ చిన్నారి మృతి చెందింది. ముగ్గురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ సంఘటన గుంటూరు జిల్లా అమరావతి మండలం నరుకుళ్లపాడులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. కర్నూలు జిల్లా కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన సుమారు 100 మంది కూలీలు అమరావతి మండలం నరుకుళ్లపాడుకు కొద్దిరోజుల క్రితం వలసొచ్చారు. రోజు మాదిరే అందరూ ట్రాక్టర్‌లో పిల్లలతో కలిసి పనికి వెళ్లారు. పెద్దలు పని చేస్తుండగా చిన్నారులు మాత్రం ట్రాక్టర్ వద్ద ఆడుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడ ఓ గుళికల ప్యాకెట్‌ను చూసిన కమల్‌దిన్ అను (2), యర్నతోట సురేఖ, యర్నతోట లక్షీకాంత్‌రెడ్డి తిన్నారు. కొద్దిసేపటికి వారు పెద్దపెట్టున ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు అక్కడికొచ్చారు. అప్పటికే ముగ్గురు అపరస్మారక స్థితిలోకి వెళ్లారు. వారిని ట్రాక్టర్‌లో అమరావతి కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చేరుకున్న కాసేపటికే అను మృతిచెందింది. సురేఖ, లక్షీకాంత్‌రెడ్డిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. వీరితో పాటు ఉన్న కృష్ణవేణి అనే బాలికనూ వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తెచ్చారు.

ప్రత్యేకం

జిజిహెచ్‌లో ఐదు నెలలుగా జీతాల్లేవ్

అప్పులతో పారిశుద్ధ్య కార్మికుల బతుకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిజిహెచ్ పారిశుధ్య కార్మికులు పస్తులతో గడపాల్సి వస్తోంది. ఐదు నెలలుగా వారికి జీతాలు లేవు, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో 217 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. 18 ఏళ్లుగా వీరు కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్నారు. ఆల్ సర్వీస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టు పారిశుధ్య పనుల కాంట్రాక్టు పొందింది. 2017 జులై నెలతో ఈ కంపెనీ కాంట్రాక్టు ముగిసింది. ప్రతి మూడేళ్లకూ పాత కాంట్రాక్టరు మారడం కొత్త వారు రావడం జరుగుతుంటుంది. ఆ సమయంలో పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్లు నరకం చూపిస్తున్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారు. కొత్త కాంట్రాక్టరు వచ్చి పరిస్థితిని అవగతం చేసుకుని కొత్త జీతాలు ఇవ్వాలి. బకాయిలు పాత కాంట్రాక్టరే ఇవ్వాలి. ఇలాంటి పరిస్థితికి ఆసుపత్రి అధికారులే కారణంగా నిలుస్తున్నారు. పాత కాంట్రాక్టరుకు ఇవ్వాల్సిన బిల్లులు ఇచ్చే సమయంలోనే కార్మికుల జీతాలు ఇప్పించకుండా నిర్లక్ష్యం చేయడంతో కార్మికులు జీతాలు లేక ఎదురుచూపులు చూడాల్సివస్తోంది. ఏడు నెలల క్రితం పాత కాంట్రాక్టరు వెళ్లిపోయారు. అప్పటినుంచి నేటివరకూ ఐదు నెలల జీతాల బకాయిలు ఉన్నాయి. వీటి కోసం కార్మికులు ఆందోళన చేయడం, అధికారులు హామీ ఇచ్చి పనులు చేయించుకోవడం జరుగుతున్నా జీతాలు అందడం లేదు. జిజిహెచ్ అధికారులను కలిసి జీతాల గురించి విన్నవించుకోవడం, కాంట్రాక్టరు కాలం ముగిసిందని చెప్పడం, కార్మికులు సమ్మె బాట పట్టడంతో అధికారులు దిగి వచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చి కాలయాపన చేయడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. గత కాంట్రాక్టరు గడువు ముగిసి ఇప్పటికి ఏడు నెలలు కావస్తున్నా నేటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. మరోవైపు కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కొంతమందికే అమలు చేస్తున్నారు. కార్మికుల జీతాల నుంచి కోత విధిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు అమలయ్యే జిఒలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో అనేక ఇబ్బందులు పడాల్సివస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాల్సి ఉన్నా, రూ.7,500 నుంచి రూ.8 వేల జీతంతో ఇక్కడి కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటికే కాంట్రాక్టరు మారడంతో కొత్త కాంట్రాక్టరుతోనైనా బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కొద్ది రోజుల్లో పరిష్కారం
డాక్టర్ రాఘవేంద్రరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్

పారిశుధ్య కార్మికుల సమస్య వారం రోజుల్లో పరిష్కారం అవుతుంది. ఇప్పటికే కొన్ని నెలల జీతాల బకాయిలు ఇచ్చాం. ఇంకా ఐదు నెలల జీతాల బకాయిలతోపాటు ఇతర సదుపాయాలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశాం. పూర్తి బకాయిలు చెల్లించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

సమస్య పరిష్కరించకుంటే సమ్మె
కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్

పారిశుధ్య కార్మికుల సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలి. సూపరింటెండెంట్ దీనిపై ప్రత్యేకదృష్టి పెట్టి జీతాలు విడుదల చేయాలి. జిఒ 151 ప్రకారం జీతాలు చెల్లించాలి. జిఒ 60 ప్రకారం రూ.12 వేలు జీతం ఇవ్వాల్సి ఉండగా, రూ.8 వేలు, రూ.7,500 ఇస్తున్నారు. కొత్త జిఒ అమలు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిజిహెచ్ సూపరింటెండెంట్ స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలి. లేనిపక్షంలో మరోమారు సమ్మె బాట పట్టనున్నాం.

సంక్షిప్తం

గండికోట ఉత్సవాల్లో భాగంగా శోభాయాత్ర

జమ్మలమడుగు : గండికోట ఉత్సవాల ప్రారంభములో భాగంగా కడప జిల్లా జమ్మలమడుగులోని ఆర్‌డిఓ ఆఫీస్ నుంచి సంజాముల మోటు వరకు కళాకారులతో గండికోట ఉత్సవ శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శోభ యాత్రలో ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. గండికోట ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. రండి.. రారండి... గండికోట సాంస్కృతిక ఉత్సవాలను తిలకిద్దాం అంటూ యాత్ర సాగింది.

కొల్లేరు పరిసరాల్లో అనధికారికంగా చేపల సాగు

విజయవాడ : కృష్ణా జిల్లా కొల్లేరు పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా చేపట్టిన చేపల సాగును అధికారులు గుర్తించారు. ఆదివారం జిల్లాలోని కైకలూరు మండల పరిధిలో అధికారుల దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అనధికారికంగా చేపల సాగు చేస్తున్న చెరువులను అధికారులు ధ్వంసం చేశారు. మొత్తం 120 ఎకరాల అనధికార చేపల చెరువులను గుర్తించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

విశాఖ : విశాఖ జిల్లా కశింకోట మండలం ఏఎస్ పేట వద్ద ఆగి ఉన్న లారీని ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి విశాఖ వైపుగా ప్రైవేటు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో పదిమంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని తల్లిపై దాడి

కృష్ణా : మద్యానికి డబ్బులివ్వలేదని కొడుకు తల్లిపై దాడి చేసిన ఘటన కృష్ణా జిల్లా మైలవరం మండలం వెల్వడంలో ఆదివారం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన కొడుకు తన తల్లిని డబ్బులు అడిగాడు. తల్లి ఇవ్వకపోవడంతో కోపంతో దాడి చేసి గాయపరిచాడు.

సత్యవేడులో అగ్నిప్రమాదం

రూ.30 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

చిత్తూరు జిల్లా సత్యవేడు మండలం దాసుకుప్పంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.30 లక్షల ఆస్తినష్టం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన దాసుకుప్పంలో మూడేళ్లుగా రాము అనే వ్యక్తి ఇండియన్ మెటల్స్ పేరిట స్క్రాప్ గోడౌన్ నిర్వహిస్తున్నారు. అందులో కాగితాలు, కొయ్యలు, టేకు ఉడ్, ఇతర మెటల్ పరికరాలు ఉన్నాయి. ఆదివారం వేకువజామున ఆ గోడౌన్‌లో నుంచి మంటలు పెద్దఎత్తున చేలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. అటు ఆంధ్రా, ఇటు తమిళనాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వారు వచ్చేసరికే దాదాపు 90 శాతం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 30 లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు రాము వాపోయారు. గుర్తు తెలియని దుండగులు షాపు వెనుక భాగం వైపులో నిప్పుపెట్టి ఉండవచ్చుని సత్యవేడు ఎస్సై మల్లేష్‌యాదవ్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti



'రచన మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను.

– రావిశాస్త్రి



అనుభవం

కవి సమ్మేళనం ముగిసింది
ఎవరి గూటికి వాళ్ళు
ఎగిరిపోయారు కవులు
నేనూ నా శాలువా కప్పుకుని
విమానం ఎక్కాను

నాలోకి నేనే ఎక్కి కూర్చుని రెక్కలు విప్పుకున్నట్టు
ఎన్ని జ్ఞాపకాల చక్రాలతో టేకాఫ్ అయ్యానో!
అద్దాల్లోంచే మబ్బులకు పద్యాలు పంచి పెట్టాను
ఊరి నుంచి తిరిగి వచ్చేప్పుడు
అమ్మ కళ్ళలో చూపుల దీపాల్లా
నేను పైకెగిరే కొద్దీ
నగరం మిణుకు మిణుకుమంటూ ముడుచుకుపోయింది!

నా లోపల కొమ్ములు మొలిచిన చాంచల్యాల శిఖరాలు
దారిలో ఎదురైన నిశ్చల పర్వతాల మీద రాలి ముక్కలయ్యాయి
నాలోని సందిగ్ధాల సముద్రం
తలకిందులై నేల మీది కడలిలోకి దూకి మాయమైంది!

గాలిలో పూచిన పువ్వులా ఎయిర్ హోస్టెస్ నవ్వినప్పుడు
నాలో మిగిలిన 'నేను' కూడా విముక్తమైంది

ఎంత ఎత్తుకి ఎగిరానో
అంత ఖాళీ అయ్యాను
ఇంటికి రాగానే ప్రేమగా తలుపు తీసిన ఆమెను
శూన్యమై చుట్టుకుపోయాను!

– ప్రసాదమూర్తి
84998 66699


(ఇండోర్‌లో ఆకాశవాణి ఆధ్వర్యంలో జరిగిన సర్వభాషా కవి సమ్మేళనంలో పాల్గొని తిరిగి వచ్చాక)

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది.
సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. సంక్షిప్త పరిచయాలు ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో, వివరణాత్మక సమీక్షలు అక్షరం పేజీలో ప్రచురిస్తాం.
పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.

అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ – 2.
prajasavvadi@gmail.com

బుద్ధ మార్గంలో యశోధర కథ

పుస్తకం



సమాజానికి బుద్ధుడు చూపించిన మార్గం సరికొత్తది. కొన్ని శక్తుల పెత్తనం కింద నలుగుతున్న సమాజ చిత్రాన్ని, అస్తవ్యస్త వ్యవస్థనీ కాదని; దాని స్థానే కొత్త ఆలోచనలను చిగురింపచేసిన దారి అది. అలాంటి మార్గంలో నడవటానికి ముందూ వెనకా సిద్ధార్థుడు ఎలాంటి సంఘర్షణ చెందుతూ వచ్చాడు? దానిని అర్థం చేసుకోవటంలో, ఆ దారిని మరింత సుస్పష్టం చేయటంలో అతడి సహచరి యశోధర పాత్ర ఎలాంటిది? ఇలాంటి ప్రశ్నలన్నీ ఆసక్తిదాయకంగా ఉంటాయి. వాటికి సరైన సమాధానాలూ, సంఘర్షణా భరిత సన్నివేశాలూ ప్రముఖ రచయిత్రి ఓల్గా ఇటీవల వెలువరించిన 'యశోబుద్ధ' నవలలో కళ్లకు కడతాయి. గౌతమీమాతను, యశోధరను నిలువెత్తు ఆదర్శమూర్తులుగా మనముందు నిలుపుతాయి.

అనుకూలవతులైన భార్యలు చాలామందే ఉంటారు. కానీ, భర్తను మానవాళి బాధలను, దు:ఖాలను దూరం చేయటానికి మార్గం అన్వేషించమని, ఇంటి బాధ్యత తనకు వదిలేయమని చెప్పి మహాభినిష్క్రమణ చేయటానికి ప్రోత్సహించేవాళ్ళు ఎవరు ఉంటారు? అలా ఒప్పుకొందంటే యశోధర కచ్చితంగా గొప్ప ఆదర్శమూర్తి అని అర్థమవుతుంది. ఆమెకు సిద్ధార్థుని జీవిత గమ్యం ఏమిటో తెలుసు. అతడు గమ్యం చేరుకొనే దారిని తాను దగ్గరుండి చూపించింది. అదే ఆమె గొప్పతనం. ఈ నవల కళ్లకు కట్టించే ఔన్నత్యం.

సిద్ధార్థుడు చిన్నతనం నుంచి సున్నిత మనస్కుడే. హంసనే ఎంతో ప్రేమగా చూసుకున్నవాడు– భార్యని, బిడ్డని ఇంకెంత ప్రేమించి ఉంటాడు. తల్లితండ్రులను ఇంకెంత గౌరవిస్తాడు... ప్రచారంలో ఉండే కథలో– సిద్ధార్థుడు మనుషులు పడే బాధ, శారీరకంగా, మానసికంగా ఉండే కష్టాలు చూసి వైరాగ్యం చెందాడు అంటారు. కానీ, గౌతముడు చూసింది మానవుల్లోని ఈర్ష్య, అసూయ, ద్వేషం. సాటి ప్రాణులపైన నిర్దయ, వాటి బాధ పట్ల విజయ గర్వం. ఇవేమి నచ్చేవి కావు తనకు. యశోధర కూడా తండ్రి చేసే యజ్ఞ యాగాదుల్లో జంతు బలులను చూసి తట్టుకోలేకపోయేది. వారిద్దరి మనస్తత్వాల్లోనూ సారూప్యత ఉంది. సిద్ధార్థుడి ఆలోచనలు కార్యరూపం దాల్చటానికి చేసిన మొదటి ప్రయత్నం యశోధర ప్రోద్బలంతోనే జరిగింది. స్త్రీని స్వయంవరంలో గెలుచుకోవాలని, అదే వీరత్వం అని భావించిన వారికి రచయిత్రి యశోధరచే మంచి సమాధానం చెప్పిస్తుంది. స్త్రీని వివాహం చేసుకోవడానికి కావాల్సింది వీరత్వం ఒక్కటే కాదు, ఆమెను సాటి మనిషిగా గుర్తించటం, ఆమె ఆలోచనలకు విలువనివ్వటం. కాలమునితో జరిగిన చర్చల్లో స్త్రీలను కించపరచడాన్ని సిద్ధార్థుడు ఎంతమాత్రం ఆమోదించలేదు. అంటే అతని మనసు సత్యాన్ని అన్వేషిస్తుందని అర్థమవుతుంది. సిద్ధార్థుని వంటి ఆలోచనా శక్తి, విశాలమైన మనస్సు ఉంటే తప్ప ఒక స్త్రీ గొప్పదనాన్ని అర్థం చేసుకోవటం కష్టం అంటారు రచయిత్రి. కాలముని చెప్పినట్లు స్త్రీలు మూర్ఖులు, ఆలోచనహీనులైతే కళ్ళముందు ఉన్న తన తల్లి విషయంలో అతను చెప్పిన వేవీ నిజంకాదు అని రచయిత్రి పరోక్షంగా చెప్పిన విధానం చక్కగా ఉంది. స్త్రీలు బంధాల్లోకి లాగుతారు అని చెప్పేకంటే పురుషులకు బాధ్యతలను గుర్తుచేస్తారు అని చెప్పటం కూడా బాగుంది. చాలా సూక్ష్మమైనవి, ఎవరూ పట్టించుకోని అంశాలను, ఆలోచనలను ఓల్గా నిశితంగా పరిశీలించి, ప్రస్తావిస్తారు. ఈ నవల నిండా అలాంటి దృష్టిని మనం గమనిస్తాం.

ఈ నవలలో ముగ్గురు స్త్రీలను గురించిన ప్రస్తావన ఉంది. గౌతమి, యశోధర, యశోధర తల్లి విశిష్ట. విశిష్ట ఒక సామాన్యమైన గృహిణి. భర్త అదుపాజ్ఞల్లో, ఏ ఆలోచన లేకుండా నాలుగు గోడల మధ్య, సంప్రదాయాలు, కట్టుబాట్లు, మూఢ నమ్మకాల మీద బతికేసే ఆనాటి సామాన్య స్త్రీకి ప్రతిబింబం. గౌతమి– విశిష్టమైన వ్యక్తిత్వం కలది. సిద్ధార్థునికి పెంపుడు తల్లి అయినా ఆమె అతనికందించిన ప్రేమ, వాత్సల్యం వెలకట్టలేనివి. కుమారుడు ఎంత సున్నితమనస్కుడో, గంభీరమైన వ్యక్తిత్వం కలవాడో ఆమెకు తెలుసు. యశోధర వంటి తెలివైన అమ్మాయి తన కుమారుని ఆలోచనలను మార్చగలదని ఆశ పడుతుంది. కోడలు, కొడుకు తమ ఇష్టాలకు వ్యతిరేకంగా ఆలోచిస్తున్నారని తెలిసినా చాలా సౌమ్యతతో, ప్రేమతో నచ్చచెప్పాలని చూస్తుంది. యశోధర సిద్ధార్థుడు చాలా గొప్పవాడు అవుతాడని, మానవాళిని ఉద్ధరిస్తాడని, చరిత్ర సృష్టిస్తాడని చెప్పిన మాటలు నిజమనిపిస్తాయి గౌతమికి. చివరికి కోడలి ప్రోద్బలంతో బౌద్ధాన్ని స్వీకరిస్తుంది. ఆమె మొట్టమొదటి స్త్రీ భిక్కు.

యశోధర చిన్నతనం నుంచి చాలా విభిన్నమైన మనస్తత్వం కలది. యజ్ఞయాగాదుల్లో జంతుబలులను వ్యతిరేకించేది, కాని ఏనాడు ధైర్యం చేసి తండ్రికి చెప్పలేదు. ఆమె మొట్టమొదట తండ్రిని వ్యతిరేకించింది మాత్రం సిద్ధార్థుని ప్రోద్బలంతోనే. ఆమె స్వయంవరం తండ్రి ప్రస్తావించగానే సిద్ధార్థునితో చర్చించింది. చివరికి ఆమె తండ్రిని ప్రశ్నించడానికే నిర్ణయించు కుంటుంది. తండ్రిని సూటిగా ప్రశ్నించటంలో ఆమె ఆత్మాభిమానం, స్పష్టమైన ఆలోచన తెలుస్తుంది. స్వయంవరం వీరత్వానికి గుర్తు. అందులో గెలిచినవాడు ఊరునీ, జనాన్ని రక్షించగలుగుతాడు అంటాడు తండ్రి బింబానసుడు. దానికి ఆమె 'ఏ మూర్ఖుడో, పిచ్చివాడో స్వయంవరంలో గెలిస్తే నేను అతన్ని పెళ్ళాడటానికి సిద్ధంగా లేనం'టుంది. జీవితం పట్ల ఆమెకు స్పష్టత ఉంది. సిద్ధార్థుడు తనకిచ్చే గౌరవాన్ని యశోధర ఎప్పుడూ నిలుపుకుంటూ వస్తుంది. వారిద్దరి ఆలోచనలు, మనసులు ఒకటౌతాయి. సిద్ధార్థుడు బయట శ్రమణులు, కాలమునితో జరిపిన చర్చలను ఇంటి వద్ద ఈమెతో చర్చించేవాడు. వివాహానికి ముందే సిద్ధార్థుడు తన ఆలోచనలను యశోధరతో పంచుకుంటాడు. మీరు తెలుసుకునేవి నేను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాను అంటుంది. అంటే ఆమె జ్ఞాన జిజ్ఞాస తెలుస్తుంది. సాధారణ స్త్రీకి ఉండే వ్యామోహాలు యశోధరలో కనిపించవు. సిద్ధార్థుడిని అర్థం చేసుకోవటంలో నిమగ్నమైపోతుంది.

కోలీయులు, శాక్యులు నీటికోసం యుద్ధానికి దిగుతున్నారనే వార్త విన్న సిద్ధార్థుడు చాలా మధనపడతాడు. యశోధరా మధనపడుతుంది. సిద్ధార్థుడి గంభీరమైన మాటలు, హేతుపూర్వకమైన ఆలోచనల మీద నమ్మకంతో భర్తని తట్టిలేపి మీరు యుద్ధాన్ని ఆపగలరు, ఆపండి! అని చెప్పి యుద్ధరంగానికి పంపిస్తుంది. సిద్ధార్థుడు యుద్ధభూమిలో ఇరువర్గాల మధ్య నిలబడి వారిని కొన్ని ప్రశ్నలు వేస్తాడు. వారి ఆలోచనలకు పదును పెడతాడు. వారు జ్ఞానోదయులై యుద్ధం ఆపి వెళ్ళిపోతారు. సిద్ధార్థుడు అగ్ని అయితే, యశోధర ఆజ్యం. ఆమె అతడి జ్ఞానాగ్నిని ప్రజ్వలింపచేసింది.

తండ్రి చేస్తున్న యాగాన్ని ఆపటానికి వెళ్ళినపుడు ఆమె– ప్రజలు తినే ఆహారాన్ని, వారి జీవనాధారమైన పశువులను వృధా చేయవద్దని, లేనివారికి పెడితే వారు సంతోషిస్తారని, ఆ దీవెనలు పురోహితుల దీవెనల కంటే ఎంతో విలువైనవని తండ్రికి నచ్చజెప్తుంది. ఇది ఆమెలోని మానవత్వానికి, హేతువాదానికి తార్కాణం. సిద్ధార్థుడు నిమ్నజాతీయుడైన ఒక మనిషికి సపర్యలు చేయటానికి వెళ్ళాడని తెలిసిన జనం గౌతమీ మాత వద్దకు వచ్చి గొడవపెట్టుకుంటే యశోధర వారిని ధైర్యంగా సమాధానపరుస్తుంది. సమాజానికి అంగీకారం కాకపోతే మంచి పనులు మానుకోవాలా? అని ప్రశ్నిస్తుంది. ఎవరో ఒకరు కొత్త దోవ వేస్తేనే కదా, పాతది మారుతుంది అని సమాధానపరుస్తుంది.

సేవ యొక్క విలువ ఎంత అమూల్యమైనదో సిద్ధార్థుడు చెప్తుంటే విని చాలా ఆలోచిస్తుంది. బిడ్డ పుట్టిన ఏడు రోజులకు మహాభినిష్క్రమణం చేయమని చెప్తుంది. అయితే సిద్ధార్థుడు బిడ్డ పుట్టాక పుత్రస్పర్శలోని ఆనందాన్ని వైరాగ్యంతో ముడిపెట్టడం ఎంత కష్టమో ఆలోచించాడు. తల్లితండ్రుల పరిస్థితి సమాలోచనం చేసుకున్నాడు. యశోధర తనను బంధ విముక్తుడిని చేయటాన్ని సమీక్షించు కున్నాడు. యశోధర వంటి స్త్రీ మరొకరు ఉండరని, సందేహం లేదనుకున్నాడు. సిద్ధార్థుడు ఇల్లు వదిలివెళ్ళాడని తెలిసి గౌతమి మాత, శుద్ధోదనుడు కన్నీటి పర్యంతం అయ్యారు. గౌతముడు అలా చేయటానికి యశోధర కారణమని, ఆమె ఆపి ఉంటే ఆగేవాడని గౌతమి భ్రమిస్తుంది. కోడలిని నిలదీస్తుంది. ఇలాంటి పరిస్థితులను ముందుగానే ఊహించిన యశోధర ఎంతో మనోధైర్యంతో ఆ పరిస్థితిని చక్కదిద్దుతుంది. మీ కుమారుడి గురించి అంతా మీకు ముందే తెలుసు కదా అని నచ్చజెప్పి మనువడిని అక్కున జేరుస్తుంది. మామగారి మరణానంతరం అత్తగారికి జీవిత పరమార్థాన్ని గుర్తుచేసి బుద్ధుని దగ్గరకు పంపిస్తుంది. బౌద్ధాన్ని స్వీకరించమంటుంది. తర్వాత కుమారుడిని కూడా బౌద్ధం స్వీకరించమని పంపిస్తుంది. మానవ సేవ చేసుకుంటూ, ధ్యాన నిమగ్నురాలౌతూ కాలం గడుపుతుంది. బుద్ధుడిగా మారిన గౌతముడు తమ ఊరు వచ్చాడని తెలిసినా చలించదు. బుద్ధుడు వ్యక్తి కాదు, ఒక మార్గం అంటుంది. ఆ మార్గంలోనే తాను ఉన్నానంటుంది.

యశోధర 78 సంవత్సరాలు జీవించింది. ఆమె భిక్కునిగా మారి సాటి మానవులకు సేవజేస్తూ, ఏకాంతంలో జ్ఞాన సముపార్జన చేస్తూ నాలుగు గోడల మధ్యే యశోబుద్ధగా మారింది. ఈ కథను చాలా హృద్యంగా, సరళంగా నడిపించారు ఓల్గా. బుద్ధుడి వెనక ఉన్న ఒక గొప్ప ప్రేరణనూ, భాగస్వామ్యాన్ని బలంగా చెప్పారు. ఇది అందరూ చదవాల్సిన నవల. చదివితే మనసును బలంగా హత్తుకొనే నవల.

– జె.దీక్ష
86398 43194

సమాచారం

'అమోహం'కు ఉమ్మడిశెట్టి పురస్కారం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు త్రిదశాబ్ది పురస్కారం – 2017 కోసం యువ కవయిత్రి సుధా మోదుగు కవితా సంపుటి 'అమోహం' ఎంపికైంది. ఈ అవార్డు న్యాయనిర్ణేతలుగా కొప్పర్తి వెంకట రమణమూర్తి, ఆచార్య మేడిపల్లి రవికుమార్, డాక్టర్ ఆర్.సీతారాం వ్యవహరించారు. 'సౌకుమార్యంతో, సౌందర్యంతో, పరవశంతో, వివశత్వంతో, వేదనతో, విచికిత్సతో, తత్త్వాన్వేషణతో మానవ జీవన మార్మికతను కవిత్వమై పలవరించిన కవయిత్రి సుధా మోదుగు 'అమోహం' వారి తొలి కవితా సంపుటి కావడం ఓ విశేషం. త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు త్రిదశాబ్ది ఉత్సవంలో కవయిత్రికి అవార్డు ప్రదానం జరుగుతుంది.

– రాధేయ, వ్యవస్థాపకులు
ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

ఫిబ్రవరిలో అంతర్జాతీయ కవి సమ్మేళనం

తెలుగు కవిత్వానికి పట్టాభిషేకం చేయాలన్న సంకల్పంతో తెలుగుగడ్డ అవనిగడ్డలో తెలుగు లోగిలి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు పిఎస్ రావు ఆధ్వర్యంలో ప్రముఖ కవి బిక్కి సారథ్యంలో 2018 ఫిబ్రవరి 25, 26, 27 తేదీల్లో వెయ్యి మంది కవులతో 'అంతర్జాతీయ సహస్ర కవి సమ్మేళనం – వెయ్యి కవితల పండుగ'ను జరపాలని సంకల్పించాం. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మంత్రులు, ప్రఖ్యాత రచయితలు, సామాజికవేత్తలు, అతిథులుగా హాజరవుతారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కవులు తమ పేర్లను 83329 03156 నెంబరులో ఫిబ్రవరి 5వ తేదీలోపు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని పూర్తి వివరాలకు 92464 15150, 83744 39053 నెంబర్లలో సంప్రదించవచ్చు.

– కలిమిశ్రీ
సహస్ర కవి సమ్మేళనం ఆహ్వాన కమిటీ కన్వీనర్

వాసాల నరసయ్య బాలసాహిత్య పురస్కారాలు

వాసాల నరసయ్య బాలసాహిత్య పురస్కారాలను 2017 సంవత్సరానికిగానూ ఐదుగురు బాలసాహిత్య వేత్తలకు ప్రకటించాం. వారు : 1. ఎన్నవల్లి రాజమౌళి, 2. డాక్టర్ కందేపి రాణీప్రసాద్, 3. డాక్టర్ ఎం.ఉమాగాంధీ, 4. బెహరా ఉమామహేశ్వరరావు, 5. బెలగాం భీమేశ్వరరావు. ఫిబ్రవరి 4వ తేదీన వరంగల్‌లో జరిగే సభలో పురస్కారాల ప్రదానం జరుగుతుంది.

– డాక్టర్ వి వరప్రసాద్
9490189847

జనహితమే కవిత్వ పరమార్థం



కవులంటే ఎవరు? ఎవరి పక్షం వహించాలి. ఎప్పుడెప్పుడు స్పందించాలి? సమాజంలో ఏ పాత్ర నిర్వహించాలి? ఈ ప్రశ్నలకు సమాధానమే సృజనకారుల క్షేత్రస్థాయిని నిర్ణయిస్తుంది. వాస్తవానికి ఈ అన్వేషణ ఎప్పుడో జరిగింది. మనకన్నా ముందు తరాల్లో అక్షరాన్ని ప్రజాపక్షంగా నిలిపి, సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా నడిపిన సాహితీ యోధులు మనముందు ఎందరో ఉన్నారు. ఒక్కో కాలానికి ఒక్కో ప్రాధాన్యం ఉంటుంది. ఒక్కో సామాజిక, చారిత్రిక అవసరం ఉంటుంది. దానిని మనం సరిగ్గా అర్థం చేసుకొని, నడుస్తున్నామా లేదా అన్నదే కవులకీ, రచయితలకీ కొలమానం, గీటురాయి, ఆత్మశోధన.

ఇప్పుడొస్తున్న కవిత్వాన్ని తీక్షణంగా పరిశీలిస్తే కవుల్లో వర్తమాన సమాజ అధ్యయనలోపం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. శిల్పంలోను, అంశంలోను, రూపంలోను సమకాలీన సమాజ విశ్లేషణలో స్పందించే విధానంలోను, ఎవరి తోవ, ధోరణి వారిదే. రచనా వ్యాసంగా సరదాగా కాకుండా నిబద్ధత, నిమగ్నతతో సజన చేయవలసిన అవసరం అనివార్యంగా ఉంది. ఇప్పటి పరిస్థితులను సరిగా బేరీజు వేసుకుంటే. భావ కవిత్వ దశ నుంచి అభ్యుదయ మార్గం పట్టిన దశలో వచ్చిన పరిణామ దశలను, ఆయా కవుల శైలి, సమాజం పట్ల వారి ధ కోణాన్ని అవలోకనం చేయటంలో నేటి కవులు ఎందుకు విస్మరిస్తున్నారో తెలియదు. అప్పటి సాహిత్యంలో ఉన్న సాంద్రత, సూటితనం కొంత కొరవడినా మంచి కవితలు వస్తున్నాయి సందేహంలేదు. కాని ఇంకా రావలసివుంది. కవిత్వం ఎవరి ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నది, ఎవరి గురించి రాస్తున్నావు, సర్వజనీయత ఉన్నదా లేదా, ప్రజల పక్షమా, పాలకవర్గ బోయీలమా అనే ఊగిసలాటనుంచి స్థిరమైన బాటలో రచనలు రావాలి. కులాధిక్యత, మతోన్మాదం, ఉగ్రవాదం చాపకింద నీరులా నరనరాల్లో జీర్ణించుకున్న తరం నుంచి కవిత్వం బయటపడి సంకెళ్ళను తెగకొట్టుకుని, ముందుకు వస్తున్న తరుణంలో ఇంకా కొంత వెనుకబాటుతనం వదిలించుకోవల్సి ఉంది. అనివార్యంగా గత కాలపు సామాజిక వైరుధ్యాలను పెంచి పోషించిన, ధర్మ శాస్త్రాల పేరనో, కొన్ని సూత్రాల పేరనో సంస్కృతులపేరనో, కల్పిత కావ్యాల ఝరిలోంచి, తడిలోంచి, పుక్కిట పురాణాల కబంధ హస్తాల పరిష్వంగంలోంచి భాషని, పడికట్టు పదాలని విడిపించి, ఆ కల్మషాలను కడిగి, ఎండగట్టే విధంగాను, మూలాలతోసహ రూపుమాపే దిశగా అట్టి భావాల వ్యాప్తిని సహేతుకంగా ఎదుర్కొనగలిగే సత్తా పొందేందుకు అధ్యయనం ఎంతో అవసరం. సహేతుకమైన రచనా పటిమ అలవడాలనేది నిర్వివాదాంశం. గురజాడ, త్రిపురనేని, కొడవటిగంటి, శ్రీశ్రీ, ఆరుద్ర, ఉన్నవ, అడివి బాపిరాజు, జాషువా, గరిమెళ్ళ, మంగిపూడి భరతశర్మ, కుసుమ ధర్మన్న, తాపీ ధర్మారావు లాంటివారెందరో మనకు ఒక కొత్త బాట అందించారు. ఆ వారసత్వం అందుకోవాలి. ఇప్పటి అవసరాలకు అనుగుణంగా కొనసాగించాలి. రాజా రామ్మోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, పెరియార్ రామస్వామి, సుబ్రహ్మణ్య భారతి వంటి వారు సమాజాన్ని ఎంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక స్పష్టమైన అవగాహనతో అప్పటి ప్రజాపక్షంగా స్పందించారు. వారి రచనలను చదవడం ద్వారా సమాజంలో ఇంకా జడలు విప్పి గంతులేస్తూ అమాయక జనాలపై పడుతున్న మూఢనమ్మకాలపై కవులు కలం ఆయుధంగా వాడాల్సిందే, కులాల మధ్య తంపులాటలు కాకుండా, ఆధిపత్య కులాల అణిచివేతపై స్పందించాలి. అన్యాయం ఎక్కడ ఏ రూపంలో జరిగినా అక్కడ కవిత్వం నిలబడాలి. కొన్ని సందర్భాల్లో కవులు క్షేత్ర పర్యటన ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చు. కథలైనా, కవిత్వం అయినా పరిశీలనా సంవేదనల్లోంచి రాస్తే జీవంతో తొణికిసలాడతాయి. సృజనకారులు సమైక్యంగా స్పందించాలి. బాధితుల పక్షాన నిలబడాలి. కావాలి. ఒకప్పటి భూస్వామ్య వ్యవస్థ తాలూకు అవశేషాలు అప్పుడప్పుడు పడగ విప్పుతున్న తరుణంలో ఉపేక్షించకూడదు. అణిచివేత, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు, జులుం పెచ్చరిల్లుతున్న సంఘటనలు రోజూ ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి. పాలకవర్గాలు తమదైన తరహాలో స్పందిస్తున్నాయే తప్ప, న్యాయం జరగటం లేదు. అలాంటి సమయాల్లోనూ కవులు, రచయితలు స్పందించాల్సి ఉంది.

'కవులేం చేస్తారంటే/ కలాలకు కళ్ళిచ్చి, అక్షరాలకు ప్రాణమిచ్చి/ సొంత గొంతుకనిచ్చి ఆవేశానికి ఆలోచనను దట్టించడమే' కవులు చేసే పని, అంతే కాదు 'ఆచార సంప్రదాయాల పట్టువస్త్రాల ముసుగులోని లొసుగులు తొలిగించి/ జాతులననగతొక్కే మంత్ర తంత్ర కుతంత్రాలను మట్టుబెడతారు/ స్వచ్ఛమైన నేత్రాలిచ్చి నిప్పులు కక్కే ధిక్కార స్వరమిచ్చి/ కలాలను కలకాలమెగిరే నిత్యారుణ కేతనాలు చేస్తారు.'

కవులు పాలకులపరంగా, కులాల పరంగానో ఆలోచిస్తే– విశాల జనపక్షాన నిలవలేరు. ప్రభుత్వ ప్రలోభాలకే పరిమితం అయితే– రాజకీయ నాయకులకు ఉపయోగపడతారు తప్ప ప్రజల ఆకాంక్షలకు కాదు. ఇప్పుడు నిర్బంధాలు, అణిచివేతలు పెరిగాయి. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు, ప్రజాధనం అనవసర హంగు ఆర్భాటాలకు ప్రవహిస్తోంది. ప్రజావసరాలను పక్కకు తోసి, కార్పొరేట్ వ్యవస్థలకు ధారాదత్తం చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టు ఉండలేము. ఇలాంటప్పుడు కవులు కలాలు దూయకపోతే, సృజన క్షేత్రానికి ప్రయోజనం ఏముంటుంది ఇక? కవులు మందిరాలలో కాక, జన సమూహంలో తమ గొంతుక వినిపించాలి. కొత్త వొరవడి సష్టించాలి. జనం దగ్గరకే వారి సమస్యలపై తమ కవిత్వం వినిపించాలి, పాటలు పాడి, వీధినాటకాల ద్వారా చైతన్యం కలిగించాలి. నూటికి ఎనభై శాతంగా వున్న జనసమూహానికి ప్రతినిధులుగా కవులుండాలి. వారిని సమీకరించడంలో కవులు ప్రధాన ప్రతిపక్ష భూమిక నిర్వహించాలి. ఎందుకంటే కవులే అనధికార శాసన కర్తలు కాబట్టి. ఆ దిశగా మన మాట, పాట, బాట ఎల్లప్పుడూ సాగాలి.

సర్కారు ఏదైనా సాంస్కృతిక విధానంతో ముందుకుపోతోందా లేక పలుకుబడిని పెంచుకో చూస్తోందా అనే కోణం పరిశీలించాలి. 'మా తాతలు నేతులు తాగారు...' అన్న చందంగా గాక సమరశీల ఉద్యమ ఘోష నిరంతరం వినిపించకపోతే సర్కారు ఆటలకు అడ్డూ అదుపూ ఉండదని గ్రహించాలి. సాహితీ ప్రయాణంలో ప్రధాన విరోధి ఎవరో వారిపై మన గళం విప్పటానికి సమైక్యం కాకపోతే, రానున్న ప్రమాదం నివారించడం కష్టమౌతుంది. విశాల వేదికగా కవులందరూ తమ గళాన్ని వినిపించాల్సిన అగత్యం ఇవాళ అనివార్యమని గ్రహించాలి. అణచివేతకు, అన్యాయానికి వ్యతిరేకంగా గళం వినిపిస్తేనే కవిత్వానికి, ప్రజా కళలకు మనుగడ. కవిత్వం ద్వారా, ప్రజాకళల ద్వారా మనం సమైక్య శంఖారావం వినిపించాలి. సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామిక విలువలూ పరిఢవిల్లేలా అక్షర ప్రయాణం సాగించాలి.

– కపిల రామ్‌కుమార్
98495 35033

అలజడి

సహచరుడా! గమనించు
కాలంలో ఓ అలజడి!
తరతరాల జాతిగీతి
గానంలో ఓ అపశృతి!

వేకువ ఝాముల్లోనే
వికృత తీతువు కూతలు!
పగలే నక్కల ఊళలు
తుళ్లిపడిన పనివేళలు!
సహచరుడా! గమనించు

చెమటపూల పరిమళాలు,
చెరిపేసే ప్రయత్నాలు!
నీ జీవన సౌందర్యం
దగ్ధం చేసే వ్యూహం!
చిత్రంగా పూర్వీకుల
వేల గొంతులోని జీర!
కాళ్లకు తడి అంటకుండ
కదులుతున్న ద్రోహధార!
సహచరుడా! గమనించు

నిర్మించిన పరిశ్రమన
అర్పించిన నీ శ్రమనూ..
పెద్దనోట్ల రద్దీలో
పలికే వేలం పాట!
సహచరుడా! గమనించు


కమ్ముతోంది 'పగ'మబ్బు,
చూడూ! కార్మికవాడను..
కుటుంబాల నెత్తిమీద,
కాలిపోతోంది నీడ!
సహచరుడా! గమనించు..

ఇంటిముందు రుణమేదో
దారుణ సంభాషణ!
వంటగదిలో శవమేదో
కాలుతున్న వాసన!
సహచరుడా! గమనించు

పరాధీన అవుతున్న
పబ్లిక్ సెక్టారు తల్లి!
కన్నీటితో రాస్తున్నది
కడసారిగా ఒక లేఖ!
సహచరుడా! గమనించు

నగదు రహిత చెల్లింపులు!
నల్లడబ్బు మళ్లింపులు!
షేర్ల మార్కెట్లలోన
బార్లా తెరిచిరి తలుపులు!
సహచరుడా! గమనించు

యంత్రాల గొంతుల్లో
ఏవేవో, వెక్కిళ్లు!
సైరన్ మోగకముందే
బిగిస్తున్న పిడికిళ్లు!
సహచరుడా! గమనించు



– నల్లి ధర్మారావు
73968 16430

jeevanapageps@gmail.com



భాగల్‌పురితో బంధం.. చెదరని అందం..

మొగల్ కాలంలో మొగ్గ తొడగిన భాగల్‌పురి చీరలు నేడు మార్కెట్లో కనువిందు చేస్తున్నాయి. కాటన్ సిల్క్‌తో పెనవేసుకుని తయారయ్యే ఈ చీరలు ఏ కాలానికైనా.. ఏ ప్రాంతానికైనా చక్కగా నప్పేవి. సామాన్యులకూ అందుబాటులో ఉండే ధరలతో ఈ చీరలు మగువల మనసులను దోచుకుంటున్నాయి. గంజి పెట్టకుండా స్టిఫ్‌నెస్‌గా ఉండే ఈ భాగల్‌పురి కాటన్‌సిల్క్ చీరలు చెక్కుచెదరని అందంతో ఆకట్టుకుంటున్నాయి. చక్కని నిండైన రంగులతో సరికొత్త డిజైన్లతో ఎప్పటికప్పుడు కొంగ్రొత్త అందాలతో మార్కెట్లో కనువిందు చేస్తుంటాయి. మరింకెందుకు ఆలస్యం మీరూ ప్రయత్నించండి!

జలుబును దూరం చేయండిలా!

శీతాకాలంలో చల్లదనానికి ఎవరికైనా జలుబు, దగ్గు సర్వసాధారణం. వీటి బారిన పడినప్పుడల్లా వైద్యుడి దగ్గరకు పరిగెత్తలేం. అందుకే ఇంట్లో లభించే వాటితోనే ఎలా తగ్గించుకోవాలో నిపుణుల సూచనలివి.

- జలుబు, దగ్గు వంటివాటితో బాధపడుతున్నప్పుడు చాలామంది పెరుగు తినడం మానేస్తారు. కానీ దానిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందులో మేలు చేసే బ్యాక్టీరియా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- గొంతులో ఇబ్బందిగా ఉన్నప్పుడు గోరువెచ్చటి నీటిలో చెంచా తేనె, కాస్తంత నిమ్మరసం కలిపి తాగాలి. వెంటనే ఉపశమనం లభిస్తుంది. తేనెను నేరుగా తీసుకున్నా మంచిదే.



- పైనాపిల్ తినడంవల్లా దగ్గు తగ్గుతుంది. దీనిలోని బ్రొమిలిన్ అనే ఎంజైమ్ దగ్గు నుంచి ఉపశమనాన్ని కలిగించి, గొంతు గరగరను తగ్గిస్తుంది.
- గ్లాసు గోరువెచ్చని నీటిలో పావు చెంచా ఉప్పు వేసి, బాగా కలిపి ఆ నీటితో పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా చేసిన వెంటనే ఎంతో మార్పు కనిపిస్తుంది.
- దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు ఎక్కువ నీటిని తాగాలి. అల్లం టీని తరచూ తీసుకోవడంవల్లా ఉపశమనం లభిస్తుంది.
- పుదీనా ఆకుల్లా ఉండే పిప్పర్‌మెంట్ ఆకులూ దగ్గుని తగ్గిస్తాయి. వేడినీటిలో కొన్ని చుక్కల పిప్పరమెంట్ నూనె వేసి, ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల దగ్గు తగ్గుతుంది.

★

సరికొత్త హీరో హెచ్‌ఎఫ్ డాన్

న్యూస్



మనదేశపు అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ మార్కెట్లోకి 2018 హెచ్‌ఎఫ్ డాన్ కమ్యూటర్ మోటార్ సైకిల్‌ను విడుదల చేసింది. బిఎస్-IV ఉద్గార నియమాలను పాటించే ఇంజన్ లేదనే కారణంతో హీరో తమ హెచ్‌ఎఫ్ డాన్ బైకును మే 2017లో మార్కెట్ నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన హెచ్‌ఎఫ్ డాన్ బైకులో బిఎస్-IV ఇంజన్‌తో పాటు బాడీ మీద కొన్ని కాస్మొటిక్ అప్‌డేట్స్‌నూ అందించింది. హీరో హెచ్‌ఎఫ్ డాన్ రెడ్, బ్లాక్ రెండు విభిన్న రంగుల్లో లభిస్తోంది. ఈ కొత్తతరం హెచ్‌ఎఫ్ డాన్ బైకులో బ్లాక్ పెయింట్ స్కీమ్‌లో ఉన్న ఇంజన్, టెయిల్ సెక్షన్, హెడ్‌లైట్ బెజెల్, షాక్ అబ్జార్వర్, వీల్స్ ఉన్నాయి. ఫ్రంట్ సస్పెన్షన్‌లోని అప్పర్ ట్యూబ్స్ బాడీ కలర్‌లో, లోయర్ ట్యూబ్స్ బ్లాక్ కలర్‌లో వచ్చాయి. ఈ కాంబినేషన్ బైకు మొత్తానికి మరింత ఆకర్షణీయమైన లుక్ తీసుకొచ్చింది. సిల్వర్ లేదా క్రోమ్ బాడీ పార్ట్స్ అన్నింటినీ బ్లాక్ కలర్‌లో ఆకర్షణీయంగా ఉందనే చెప్పాలి. అందులో బ్రేక్ డ్రమ్, ఎగ్జాస్ట్ పైప్, లెగ్ గార్డ్స్, ఇతరత్రా విడిభాగాలు ఉన్నాయి. బైకులో సాంకేతికంగా 97.2 సీసీ సామర్థ్యం ఉన్న గాలితో చల్లబడే బిఎస్-IV ఉద్గార నియమాలను పాటించే ఫోర్‌స్ట్రోక్ సింగిల్ సిలిండర్ ఇంజన్ కలదు. 4-స్పీడ్ గేర్‌బాక్స్ అనుసంధానంగల ఇది 8.2 బిహెచ్‌పి పవర్, 8.05 ఎన్‌ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ బైక్ కేవలం ఒడిశాలో మాత్రమే లభ్యమవుతోంది. వివిధ రాష్ట్రాల్లో విడతలవారీగా దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది ఆ సంస్థ. సరికొత్త 2018 హీరో హెచ్‌ఎఫ్ డాన్ బైక్ ప్రారంభ ధర రూ.37,400 లు ఎక్స్-షోరూమ్ (ఒడిశా)గా ఉంది.

★



జీవన సౌరభం

పనిలో ప్రతిసారీ సంతోషం కలగకపోవచ్చు. కానీ పని అన్నది లేకపోతే అసలు సంతోషమనేదే ఉండదు.

మీ కోసం



దోసె, పకోడి, చక్రాలు వంటివి చేసేటప్పుడు కొద్దిగా పాలుపోసి పిండి కలుపుకుంటే.. కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

పొడి చర్మానికి చెక్


శీతాకాలంలో వచ్చే సమస్యలు చర్మం పొడిబారటం, పెదాల పగుళ్లు, ఒళ్లంతా బద్ధకంగా ఉండటం, పాదాల పగుళ్లు వంటి ఇబ్బందులతో సతమతమవుతుంటాం. అయితే చిన్నచిన్న చిట్కాలతో వీటన్నింటికి చెక్ పెట్టొచ్చు.

శరీరపు అంతర్భాగం నుంచే పోషకాలు అందించ గలిగితే చర్మంలో తేమ శాతం మెరుగవుతుంది. ఇలా కాకుండా బహిర్గతంగా వాడే ఉత్పత్తుల్లో కొకోవా బటర్ ఉంటే శరీరం తాజాగా కనిపిస్తుంది. ఎందుకంటే కొకోవాలో ఉన్న యాంటీఆక్సిడెంట్‌లు శ్వేదగ్రంథుల్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడతాయి.

మనల్ని మనం హైడ్రేట్ చేసుకోగలిగితే శరీరానికి కావాల్సిన మినరల్స్, విటమిన్స్ అందుతాయి. దీని కోసం తప్పనిసరిగా తగినన్ని నీరు తాగాలి. దేహాన్ని హైడ్రేట్ చేసుకోవడానికి ఇదే మార్గం. శీతాకాలంలో కాచిన నీటిని గోరువెచ్చగా తాగడం మరింత శ్రేయస్కరం. వేడినీటిని తాగడం వల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు పోయి, రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. అందుకే రోజులో కనీసం మూడు లీటర్లు నీటిని తాగడం చాలా ఉత్తమం.

వాతావరణం పొడిగా ఉంటే పెదాలు బాగా తడారిపోయి, పగుళ్లు ఏర్పడటం సహజం. అందుకే పెదాలను ఎప్పటికప్పుడు తేమగా ఉంచుకోవాలి. దీనికోసం 100 శాతం ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులను వాడటం మంచిది. సహజమైన రంగు కలిగి, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-ఇ ఉన్న ఉత్పత్తులు మేలు చేస్తాయి.

చలి వాతావరణంలో చాలా మందికి బద్ధకం పెరుగుతుంది. దీన్ని ఎదుర్కోవడానికి సరైన వ్యాయామం అవసరం. ప్రతిరోజూ ఎంతో కొంత సమయాన్ని వ్యాయామానికి వెచ్చించాలి. తోటపనులు, ఇంటిపనుల్లో శరీరం అలసినా సరిపోతుంది. దీనివల్ల శరీరం దృఢంగా ఉంటుంది. శక్తి సామర్థ్యాలు మెరుగుపడి, శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ★



బ్యాంకింగ్ అవేర్‌నెస్ (ఐబిపిఎస్-పిఓ'స్, క్లర్క్స్)

The PCA framework is applicable only to

MODEL QUESTIONS

1. The parameters that invite Prompt Corrective Action from the central bank are-
(a) Capital to Risk weighted Asset Ratio
(b) Net Non-Performing Assets (NPA)
(c) Return on Assets (RoA)
(d) Leverage ratio
(e) All of the Above

2. The PCA framework is applicable only to ____________.
(a) Non-Banking Financial Companies
(b) Financial Management Institutions
(c) Commercial banks
(d) Co-operative Banks
(e) None of the given options is true

3. In recent PCA framework, how many Risk Threshold categories are there?
(a) 2 (b) 3 (c) 4 (d) 5 (e) 6

4. The Banks with a net Non-Performing Asset (NPA) ratio of 6-9 percent will fall under risk category ____________.
(a) 3 (b) 5 (c) 4 (d) 1 (e) 2

5. Once PCA is triggered by the regulator, the bank faces restrictions on spending money on ______________.
(a) opening branches
(b) recruiting staff
(c) giving increments to employees
(d) Only (a) and (b)
(e) Only (a) (b), and (c)

6. Which among the following PSBs is not under PCA?
(a) UCO Bank
(b) Oriental Bank of Commerce
(c) Syndicate Bank
(d) Dena Bank
(e) Indian Overseas Bank

7. Which among the following were the two banks on which initially restrictions were imposed.
(a) SBI and BOB
(b) Indian Overseas Bank and PNB
(c) Dena Bank and UCO Bank
(d) IDBI Bank and UCO Bank
(e) Vijaya Bank and Bank of India

8. This year has been a season of putting banks under PCA category. What is the meaning of "P" in PCA?
(a) Prompt (b) Prove
(c) Public (d) Price
(e) Personal

9. Till date there are how many banks on which PCA has been triggered?
(a) 8 (b) 10
(c) 11 (d) 9 (e) 13

10. The Banks with a net NPA ratio above 12 per-cent fall into the category ________.
(a) 1 (b) 2
(c) 5 (d) 4 (e) 3



11. A book containing selected writings by late journalist Gauri Lankesh was launched, recently. The book has been titled as ______.
(a) The Indian Lankesh
(b) The Way I See It - a Gauri Lankesh Reader
(c) The Ultimate Journalism- by Gauri Lankesh
(d) Fear and Loathing on the Campaign
(e) None of the given options is true

12. The Union Minister of State (I/C) of the Ministry of Development of North Eastern Region (DoNER), Dr Jitendra Singh had launched the e-HRMS in New Delhi. The HRMS stands for ________________.
(a) Human Resource Mainstream System
(b) Human Resource Mainstream Services
(c) Human Resource Management System
(d) Human Resource Management Services
(e) None of the Given options is true

13. Prime Minister Narendra Modi will become the first PM in 20 years to attend the World Economic Forum's (WEF) annual jamboree of the global elite. The meeting will be held in ____________.
(a) Germany (b) USA
(c) The Netherlands (d) Switzerland
(e) France

14. Who is the Present Governor of Gujarat?
(a) Om Prakash Kohli
(b) Jagdish Mukhi
(c) Satya Pal Malik
(d) Vajubhai Vala
(e) Ganga Prasad

15. Indian boxers have claimed three gold, a silver, and a bronze medal at the Galym Zharylgapov Boxing Tournament. The Championship was held in ____________.
(a) Indonesia
(b) Kazakhstan
(c) Azerbaijan
(d) Kuwait
(e) Oman

16. Smartphone manufacturer Samsung launched its 'Bill Payments' on its flagship payments service, Samsung Pay in partnership with ____________.
(a) HDFC Bank
(b) ICICI Bank
(c) Axis Bank
(d) IDBI Bank
(e) South Indian Bank

17. Amazon has bought an Andover, Massachusetts-based company named ____________ that makes Internet-connected doorbells and security cameras.
(a) Dream Eye (b) Watch-U
(c) Live-U (d) Blink
(e) Click In

18. Agriculture service solutions provider Sohan Lal Commodity Management (SLCM) has tied up with ________________ to provide collateral management services.
(a) IndusInd Bank
(b) HDFC Bank
(c) Axis Bank
(d) Both (a) and (b)
(e) Both (a) and (c)

19. Famed Bengali personality Partha Mukhopadhyay had passed away recently. He was ___________.
(a) Footballer (b) Film Actor
(c) Playback Singer (d) Flute Player
(e) Dancer

20. What is the capital of Kazakhstan?
(a) Tashkent (b) Bishkek
(c) Baku (d) Astana
(e) Nomura

★

answers :

1.e,	2.c,	3.b,	4.d,	5.e,
6.c,	7.d,	8.a,	9.b,	10.e,
11.b,	12.c,	13.d,	14.a,	15.b,
16.c,	17.d,	18.d,	19.b,	20.d.



Important Bits

1. Name the country that has defeated Pakistan by a massive 185 runs to clinch Under-19 Asia Cup title, in Kuala Lumpur, Malaysia.
Answer: Afghanistan
2. Name the city which will host Women's Youth World Boxing Championship 2017.
Answer: Guwahati
3. Based on the per capita income of its people which country has been named the world's richest country as per the recent International Monetary Fund (IMF) report?
Answer: Qatar
4. Private sector RBL Bank has set up an all women branch in Chennai, Tamil Nadu. Who is the present MD & CEO of RBL Bank?
Answer: Vishwavir Ahuja
5. According to the Markets regulator SEBI, who has taken charge as an executive director.
Answer: Anand Rajeshwar Baiwar
6. The United Nations Universal Children's Day is celebrated every year on ____________
Answer: November 20
7. A Guarantee Agreement for IBRD loan of USD 98 million and Grant Agreement for USD 2 million for the _______________ was signed with the World Bank.
Answer: Shared Infrastructure for Solar Parks Project
8. On the 2nd Anniversary of which scheme, the Government of India signed four MoUs under with the State of Nagaland and with four Union Territories (UTs) for operational improvements.
Answer: Ujwal DISCOM Assurance Yojana (UDAY)
9. Name the India's nominee to the International Court of Justice (ICJ) who was re-elected to the fifth and the last seat of the world court.
Answer: Dalveer Bhandari
10. Name the Union Minister for Agriculture & Farmers Welfare who has recently inaugurated the World Fisheries Day Celebrations.
Answer: Radha Mohan Singh
11. Which country has become the second largest fish producing country in the world?
Answer: India
12. Who has resigned as president of Zimbabwe with immediate effect after 37 years in power, ushering in a new era for a country as uncertain as it is hopeful recently?
Answer: Robert Mugabe
13. A two-day conference of all Commanders of Eastern Air Command commenced ____________, where issues pertaining to security are being discussed.
Answer: Shillong
14. Name the Revolution, which has the vision to achieve economic prosperity of the country and the fishers and fish farmers as well as contribute towards food and nutritional security through full potential utilization of water resources for fisheries development in a sustainable manner, keeping in view the bio-security and environmental concerns.
Answer: Blue Revolution
15. What is the capital city of Zimbabwe?
Answer: Harare

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్‌చ్ఛక్తి - ఉత్పత్తి కేంద్రాలు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

ఆధునిక ఆర్థిక వ్యవస్థలు ప్రధానంగా విద్యుత్‌పై ఆధారపడి ఉన్నాయి. అభివృద్ధికి విద్యుత్ కీలకమైన అవస్థాపన సౌకర్యం. వ్యవసాయ రంగంలో, పారిశ్రామిక రంగంలో, సేవారంగంలోనూ విద్యుత్ ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక విద్యుచ్ఛక్తిని బొగ్గుద్వారానే ఉత్పత్తి చేస్తుండగా కొద్ది మొత్తంలో వాయు, జల విద్యుత్‌శక్తులను ఉత్పత్తి చేస్తున్నారు.

థర్మల్ విద్యుత్ కేంద్రాలు

బొగ్గులభించే ప్రాంతాల సమీపంలో వీటిని నెలకొల్పుతారు. సామర్థ్యాన్ని అనుసరించి వీటిని వివిధ రకాలుగా వర్గీకరిస్తారు.

1. థర్మల్ విద్యుత్ కేంద్రాలు

వెయ్యి మెగావాట్ల కంటే తక్కువ విద్యుచ్ఛక్తి సామర్థ్యంగల విద్యుత్ కేంద్రాలు.. ఉదాహరణకు విజయవాడ థర్మల విద్యుత్ కేంద్రం.

2. సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాలు

వెయ్యి మెగావాట్ల నుంచి నాలుగువేల మెగావాట్ల మధ్యలో విద్యుదుత్పత్తి చేసే కేంద్రాలు.
ఉదా : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం.

3. అల్ట్రా మెగా థర్మల్ విద్యుత్ కేంద్రం

నాలుగు వేల మెగావాట్లు అంతకన్నా ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల కేంద్రాలు. ఉదా : నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద రిలయన్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటుంది.

✧ 1979లో విజయవాడ సమీపంలో విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని స్థాపించారు. 2007లో దీనిని నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రంగా మార్చారు.

✧ వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో 2002 సంవత్సరంలో సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని స్థాపించారు. ఈ విద్యుత్ కేంద్రానికి ఒరిస్సాలోని తాల్చేరు బొగ్గుగనుల నుంచి బొగ్గును సమీకరిస్తున్నారు.

✧ కడప జిల్లాలోని ముద్దనూర్ వద్ద ఆసియా అభివృద్ధి బ్యాంకు సహకారంతో రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రాలు ప్రారంభించారు.

✧ నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో దామోదర్ సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం 2007లో ప్రారంభించారు.

సహజవాయు ఆధారిత విద్యుత్ కేంద్రాలు

మన రాష్ట్రంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో సహజవాయు నిక్షేపాలు విస్తారంగా లభ్యమవుతున్నాయి. ప్రధానంగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల్లో ఈ వనరు అపారంగా విస్తరించి ఉంది. ఈ నిక్షేపాల ఆధారంగా సహజ వాయు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతున్నారు.



✧ పశ్చిమగోదావరి జిల్లాలో 230 మెగావాట్ల సామర్థ్యంలో విద్యుదుత్పాదక కేంద్రాన్ని 1990వ సంవత్సరంలో ప్రారంభించారు. ప్రభుత్వరంగంలో సహజ వాయువు ఆధారంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కేంద్రం దక్షిణ భారత దేశంలోకెల్లా ఇది ఒక్కటే కావడం ప్రత్యేకం.

✧ తూర్పుగోదావరి జిల్లా జేగురుపాడులో ప్రయివేటురంగంలో సహజవాయువు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పవన విద్యుత్

పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పునరుత్పత్తి అయ్యే వనరుల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి గాలి నుంచి మరొక శక్తివనరుగా వినియోగంలోకి తీసుకువచ్చారు. పవనవిద్యుత్‌ను ఉత్పత్తి చేయాలంటే గంటకు 18 నుంచి 25 కిలోమీటర్ల వేగంతో గాలి వీయాలి. అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో పవన విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

✧ తిరుమల తిరుపతి దేవస్థానం వారి అవసరాలను తీర్చే భాగంగా ఒక మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యంతో 1996 సంవత్సరంలో పలు గాలిమరలను స్థాపించి, తిరుమల పవన విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పారు.

✧ అనంతపురంలోని రామగిరి ప్రాంతం పవన విద్యుత్‌కు ప్రసిద్ధిగాంచింది. ఈ ప్రాంతంలో రెండు మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో రామగిరి పవన విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించాయి.

సౌర విద్యుత్

ఆంధ్రప్రదేశ్‌లో సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే సంస్థ మన రాష్ట్రంలో నాలుగు సోలార్ పవర్ పార్కులను నెలకొల్పుతున్నాయి.

✧ కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్కును నెలకొల్పుతున్నారు.

✧ అనంతపురం జిల్లా కదిరి సమీపంలో 1500 మెగావాట్ల సామర్థ్యంతో అనంతపురం అల్ట్రా మెగా సోలార్ పార్కును నిర్మిస్తున్నారు.

✧ కడప జిల్లా గాలివీడు మండలం వల్ల 1000 మెగావాట్ల సామర్థ్యంతో కడప అల్ట్రా మెగా సోలార్ పవర్ పార్కును నిర్మిస్తున్నారు.

★

శిశువికాస అధ్యయన పద్ధతులు



కేస్‌స్టడీ ఉపయోగాలు: సమస్యకు గల కారణాలు సమగ్రంగా తెలుసుకొని, పరిష్కారమార్గాన్ని సూచించవచ్చు.సఫలత సాధించినవారిపైనా అధ్యయనం చేస్తుంది కాబట్టి ఇతరులు వారిని అనుసరించేలా చేయవచ్చు. విద్యార్థి సమస్యలను అర్థంచేసుకొని పరిష్కారం కనుగొనవచ్చు.

కేస్‌స్టడీ పరిమితులు: ఇది ఎక్కువ సమయాన్ని తీసుకొంటుంది. సుశిక్షితుడైన నిపుణుడు మాత్రమే చేయగల పద్ధతి. సమస్యకు పరిష్కారం కనుగొన్నప్పటికీ అది అవ్యక్తికి మాత్రమేతప్ప, ఇతరులకు అన్వయించలేము లేదా సాధారణీకరించలేము.

సంఘటన రచనా పద్ధతి: ఒకవ్యక్తి జీవితంలో జరిగిన ప్రత్యేక సంఘటనను ఉన్నది ఉన్నట్లుగా పరిశీలించి, నమోదు చేయడాన్ని సంఘటన రచన అని అంటారు.యథార్థ సన్నివేశాలలో వ్యక్తి ప్రవర్తనను పరిశీలించి, నమోదు చేసి మూర్తిమత్వాన్ని లేదా ప్రవర్తనను నిర్ధారించడం వలన విషయనిష్ఠత అధికంగా ఉంటుంది.వ్యక్తి వివిధ సమయాల్లో వివిధ సంఘటనలలో ప్రవర్తించిన పద్ధతిని బట్టి అతని మూర్తిమత్వాన్ని లేదా ప్రవర్తనను కచ్చితంగా నిర్ధారించవచ్చు. దీనివలన అభ్యసనంలోని ఇబ్బందులను తెలుసుకొని, వాటిని తొలగించవచ్చును. వివిధ సామాజిక పరిస్థితులలో విద్యార్థి ఎలా మెలుగుతాడో తెలుసుకోవచ్చును. సంఘటన రచన ద్వారా సాంఘీకీకరణంతోపాటు, మూర్తిమత్వ, ప్రవర్తనలను కచ్చితంగా నిర్ధారించవచ్చు.

ప్రశ్నావళి పద్ధతి: ఏదైనా ఒక అంశానికి సంబంధించి అనేక ప్రశ్నలు ఇవ్వడం జరుగుతుంది. ప్రశ్నకు ఎదురుగా ఉన్న అవును/కాదు/ కచ్చితత్వం లేదు అనే ఐచ్ఛికాలను ఎంపిక చేసి జవాబుగా ఇవ్వడం జరుగుతుంది. ఇచ్చిన సమాధానాల ఆధారంగా వ్యక్తి మూర్తిమత్వాన్ని అంచనా వేయడం జరుగుతుంది.
ఉదా : కాటిల్ అభివృద్ధిపరిచిన 16 వ్యక్తిగత అంశాల ప్రశ్నావళి. ★

మాదిరి ప్రశ్నలు

1. సైకాలజీ అనే పదానికి మూలమైన 'సైకీ' మరియు 'లాగోస్ ' అనే పదాలు ఏ భాషకు చెందినవి? **- గ్రీకు**
2. ఒక వ్యక్తి తనను తాను పరీక్షించుకోవడం అనేది? **- అంతఃపరీక్షణా పద్ధతి**
3. ఇంట్రోస్పియర్ అనే పదంలో 'ఇంట్రో' అనగా? **- లోపలకు**
4. స్పియర్ అనగా? **- తొంగిచూచుట**
5. అగస్టీన్ అంతఃపరీక్షణా పద్ధతి ద్వారా గుర్తించినవి? **- మానసిక ప్రాకార్యాలు**
6. స్వీయపరిశీలన అని దేనిని అంటారు? **- అంతఃపరీక్షణా పద్ధతి**
7. అంతఃపరిశీలనను వ్యతిరేకించిన శాస్త్రవేత్త? **- విలియం జేమ్స్**
8. దీపం వెలిగించిన తర్వాత చీకటిని వర్ణించడం లాంటిది అంతఃపరీక్షణ ' అన్న వారు? **- విలియం జేమ్స్**
9. ఆటోబయోగ్రఫీ రాయటంలో ఉపయోగించిన అధ్యయన పద్ధతి? **- అంతఃపరీక్షణా పద్ధతి**
10. ఉపాధ్యాయుడు తన బోధనలోని లోపాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే పద్ధతి? **-అంతఃపరీక్షణా పద్ధతి**
11. ఒక సన్నివేశంలో జీవి యొక్క ప్రవర్తనను పరిశీలించే పద్ధతి? **- పరిశీలనా పద్ధతి**
12. విద్యార్థులు ఆడుకుంటున్నప్పుడు వారి ప్రవర్తనన పరిశీలించుట? **- సహజపరిశీలనా పద్ధతి**
13. విప్లవాలు, యుద్ధాలలో వ్యక్తుల ప్రవర్తనన పరిశీలించుట? **- సహజపరిశీలనా పద్ధతి**
14. పావ్‌లోవ్, స్కిన్నర్, థారన్‌డైక్, కొహ్లర్ ప్రయోగాలలో పరిశీలనలన్నీ? **- నియంత్రిత పరిశీలనలు**
15. తరగతిగదిలో పాఠం చెబుతూనే వెనుకబెంచీ విద్యార్థి ప్రవర్తనను పరిశీలించుట ? **- సహభాగీ పరిశీలన**
16. గిరిజనుల జీవనశైలిని రహస్యంగా పరిశీలించిన రాసిన జర్నలిస్టు పరిశీలన? **- సహభాగేతర పరిశీలన**
17. ఇంటర్వ్యూపద్ధతిలో అతి ముఖ్యమైనవి? **-సామరస్యము, స్వేచ్ఛాపూరిత వాతావరణం**
18. కౌన్సెలింగ్‌లో అనిర్దేశక పరిపృచ్ఛను ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త? **- కార్ల్ రోజర్స్**
19. వాస్తవాలను దాచిపెట్టి, గొప్పలు చెప్పుకొనే అవకాశం ఈ పద్ధతిలో ఉంటుంది? **- ఇంటర్వ్యూ పద్ధతి**
20. వ్యక్తి అధ్యయన పద్ధతికి మరోపేరు? **-క్లినికల్‌పద్ధతి లేదా చికిత్సా పద్ధతి**
21. సమగ్ర వ్యక్తిగత పరిశీలనే? **- కేస్‌స్టడీ**
22. కేస్‌స్టడీ విధానాన్ని ఏరంగం నుంచి విద్యారంగంలోకి అన్వయించారు? **-వైద్యరంగం**
23. సమస్య యొక్క కారణాలను ఊహించుటను? **- పరికల్పన చేయుట**
24. అధ్యయన పద్ధతులన్నింటిలో అత్యంత శాస్త్రీయమైనది? **- ప్రయోగపద్ధతి**
25. కార్యాకారక (కారణం, ఫలితం)సంబంధాలను ప్రత్యక్షంగా గుర్తించగలిగే అధ్యయన పద్ధతి?**- ప్రయోగ పద్ధతి**
26. జీవిలో ప్రవర్తనా మార్పుకు కారణం అయ్యేది? **- ఉద్దీపన**
27. మనోవిజ్ఞాన శాస్త్రంలో మొట్టమొదటి మనోవిజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను స్థాపించి సైకాలజీ ఒక ప్రత్యేక శాస్త్రంగా ఎదగడానికి కృషిచేసిన జర్మనీశాస్త్రవేత్త ? **-విల్ హెల్మ్ ఊంట్**
28. పాఠశాలకు గృహానికి మధ్య సంబంధాల వారధిగా పనిచేసే అధ్యయన పద్ధతి? **- కేస్ స్టడీ**
29. ఏవిధానంలో ఫలితాలను మళ్ళీ మళ్ళీ సరిచూసుకోవచ్చు? **- ప్రయోగపద్ధతి**
30. ఇగో ఇనావాల్వ్‌మెంట్ ఏ పద్ధతిలో ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది? **- పరిశీలన పద్ధతి**

కర్ర కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే

సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డివి.కృష్ణ

ప్రజాశక్తి - నందిగామ(కృష్ణా)

సుబాబుల్ రైతుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాడటం మాని, వ్యవసాయ మార్కెట్ కమిటీల డంపింగ్ యార్డుల ద్వారా కర్ర కొనుగోలు చేయించాలని సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా నందిగామలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబాబుల్ టన్ను ధర రూ.4,400గా నిర్ణయించినా కర్ర కొనుగోలు చేయకుండా కంపెనీలు రైతులను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. మరోవైపు రూ.10 కోట్లు బకాయిలు ఇంత వరకూ చెల్లించలేదన్నారు. బకాయిలు చెల్లిస్తామంటూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నా ఇంతవరకూ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు.



శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు

నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక బృందం

సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. నిర్వాసితుల ఇళ్లను కూల్చిన ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వంశధార నిర్వాసితులు శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన రిలేనిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. హిరమండలం కేంద్రంగా ఈ బృందం పారదర్శకంగా పనిచేసే విధంగా ఉంటే నిర్వాసితులు తమ బాధలు, సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా, పునరావాస కాలనీల్లో రోడ్లు, మంచినీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిర్వాసితుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేయడం దారుణమన్నారు. నిర్వాసితులకు ఐదు సెంట్ల స్థలం ఇవ్వాల్సి ఉండగా, కొందరికి రెండు, మరికొందరికి మూడు సెంట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. యూత్ ప్యాకేజీ చెల్లింపులు కూడా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. డి-పట్టా భూములకు పరిహారం ఇప్పటివరకూ ఇవ్వలేదని తెలిపారు. రెండోరోజు దీక్షలో హిరమండలం మండలం గదబపేటకు చెందిన నిర్వాసిత యువత కూర్చొంది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నారాయణరావు, జిల్లా కమిటీ సభ్యులు గంగరాపు సింహాచలం పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్రలు

- బెదిరింపులు కాదు చర్చలు జరపండి
- స్కీమ్‌వర్కర్ల సమ్మె జయప్రదం చేయాలి
- కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక



దాసరి భవన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు చలసానిరామారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 23న స్కీం వర్కర్లు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక విమర్శించింది. అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొంటే తొలగిస్తామని స్పెషల్ కమిషనర్ ఆదేశాలివ్వడం ముఖ్యమంత్రి ద్వంద నీతికి నిదర్శనమని మండిపడింది. బెదిరింపు చర్యలు మాని కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేసింది. కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం జరిగింది. దేశ వ్యాప్తంగ వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఆశా తదితర కార్మికుల సంక్షేమం పట్ల కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 23న జరిగే రాష్ట్రవ్యాప్త స్కీం వర్కర్ల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం తక్షణం స్కీం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యల్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు చలసాని రామారావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణాలో స్కీం వర్కర్ల సమ్మెను బలపర్చిన తెలుగుదేశం పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సమ్మె విచ్ఛిన్నానికి పూనుకుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రప్రభుత్వం తక్షణం స్కీం కార్మికుల సంఘాలతో చర్చలు జరిపి సమస్యల్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమ్మెకు వైఎస్సార్‌టియు వంటి రాష్ట్రసంఘాలు కూడా మద్దతిస్తున్నాయన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్, కె స్వరూపరాణి మాట్లాడుతూ కార్మికుల సమ్మెను అణిచివేసే ప్రయత్నాల్ని సహించేది లేదన్నారు.

కార్మిక సంఘాల ఐక్యపోరాటం ద్వారా ఈ ప్రయత్నాల్ని ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్కీం కార్మికుల సమస్యల తక్షణ పరిష్కారానికి సిఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని కోరారు. కార్మికులకు పనిభద్రత కల్పించలేకపోతే ప్రభుత్వ పథకాల్ని జయప్రదం చేయలేమన్నారు. కనీస వేతనంగా రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు అనుబంధం) అధ్యక్షులు జి బేబీరాణి, శ్రామికా మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె శైలజ మాట్లాడుతూ స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదని, కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు పనిభారాన్ని పెంచడమే కాకుండా దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికుల్ని తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు పనిభద్రత కూడా లేదన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా సమ్మె ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె పోలారి, కె రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ముగిసిన జాతా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పలు పథకాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన జీపుజాతా ఆదివారంతో ముగిసింది. చివరి రోజు పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని, బూర్జ, ఆమదాలవలస, సరుబుజ్జిలి, టెక్కలి, పాతపట్నం తదితర మండలాల్లో సాగింది.

స్కీమ్‌వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలి

ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని 23 న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు పి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమ్మెలో ఫీల్డ్ అసిస్టెంట్స్ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనంగా రూ. 18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.అశోక్‌బాబు

విఆర్‌ఒల సమస్యల పరిష్కారానికి కృషి

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్‌బాబు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్‌బాబు అన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజయనగరం జిల్లా సమావేశం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సింహాచలం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఇందులో పాల్గొన్న అశోక్‌బాబు మాట్లాడుతూ విఆర్‌ఒలకు సర్వీసు రూల్స్ లేకపోవడంతో తమ అసోసియేషన్‌లో ఇటీవల వరకూ భాగస్వాములు కాలేకపోయారన్నారు. గతేడాది శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఎన్‌జిఒ అసోసియేషన్ బైలాలో కొన్ని మార్పులు చేసి విఆర్‌ఒలను కూడా అసోసియేషన్‌లో చేర్చుకోవాలని నిర్ణయించామన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గుంటూరు జిల్లాలోని విఆర్‌ఒలు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. విఆర్‌ఒల సమస్యలను ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని తెలిపారు. విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. విజయనగరంలోని విఆర్‌ఒలకు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్లో సభ్యత్వం కల్పించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఐహేట్ మై లైఫ్, ఐ హేట్ మనీ అంటూ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని ఓ త్రీస్టార్ హోటల్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా నరసరావుపేట ప్రాంతానికి చెందిన మోతుకూరు సాయి వెంకట వంశీకష్ణ(20) ఏలూరు సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్‌ఇ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడైన ధనుంజయ్‌కు రూ.15 వేలు బాకీ పడ్డాడు. దీంతో నగదుకు బదులుగా తన ఫోన్ అతనికి ఇచ్చేశాడు. అనంతరం నగరంలోని ఓ త్రీస్టార్ హోటల్లో ఈ నెల 17వ తేదీ రాత్రి గదిని అద్దెకు తీసుకున్నాడు. అయితే అతను అద్దెకు తీసుకున్న తర్వాత రెండు రోజుల నుంచి గది తలుపులు తెరవడం లేదు. దీంతో అతను రిసెప్షన్‌లో ఇచ్చిన ఫోన్ నంబరుకు హోటల్ సిబ్బంది ఫోన్ చేశారు. ఆ ఫోన్‌ను ధనుంజయ్ ఎత్తి మాట్లాడాడు. దీంతో అతనికి అనుమానం వచ్చి ఆ హోటల్‌కు చేరుకున్నాడు. గది వద్దకు వెళ్లి ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఈ విషయాన్ని హోటల్ సిబ్బందికి తెలిపాడు. దీంతో వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తాళాలను తెరిచి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకని మృతి చెంది కనిపించాడు. అతని బ్యాగులో పోలీసులకు ఆత్మహత్య లేఖ కనిపించింది. అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని రాశాడు. ఐహేట్ మై లైఫ్, ఐ హేట్ మనీ అంటూ రాసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

వైసిపి ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి విమర్శించారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ హక్కులను కాలరాస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నోరు మెదపలేని స్థితిలో ఉన్నాయన్నారు. పదో పిఆర్‌సి నియామక విషయంలో సంఘాలు ప్రభుత్వానికి నోటీసైనా ఇవ్వలేని స్థితిలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎన్‌జిఒ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితిలో లేవన్నారు. ప్రశ్నించే వారిని వేధించడం వల్ల ఎవ్వరూ నోరెత్తడం లేదని తెలిపారు. డిఎ పెంచాలని, బకాయిలు ఇవ్వాలని, కొత్త పే కమిషన్ నియమించాలని కూడా సిఎంను అడిగే స్థితిలో ఉద్యోగల సంఘాలు లేకపోవడం విచారకరమన్నారు. ఆర్థిక లోటు పేరుతో ఉద్యోగులకు రావాల్సిన సొమ్మును ఎగ్గొడుతూ సిఎం, మంత్రులు మాత్రం విలాసాలతో విలసిల్లుతూ భారీగా దుబారా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. 2010లో అప్పటి సిఎం రోశయ్య 39 శాతం పిఆర్‌సి ఇస్తే ఐదేళ్ల తర్వాత నాలుగు శాతం పెంచి 43 శాతం ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-నూజివీడు

పెరిగిన పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం కృష్ణాజిల్లా నూజివీడు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో పల్లెర్లమూడిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సిహెచ్. రామారావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని, పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి సిహెచ్.అనూర్ భాషా, నాయకులు పాలేటి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఆనంది బెన్ పటేల్
2. న్యూఢిల్లీ (ఈ నెల 20 నుంచి 5 రోజులు)
3. కార్టునిస్టు (పశ్చిమ బెంగాల్)
4. భారత్
5. రాజస్థాన్

బందరు పోర్టుతోనే కృష్ణా సమగ్రాభివృద్ధి

- సిపిఎం కృష్ణా జిల్లా (తూర్పు) మహాసభ తీర్మానం



మహాసభలో మాట్లాడుతున్న వైవి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, గుడివాడ

బందరుపోర్టు నిర్మాణం ద్వారా కృష్ణాజిల్లా సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం కృష్ణా జిల్లా (తూర్పు) మహాసభ తీర్మానించింది. కృష్ణాజిల్లా గుడివాడలోని పిన్నమనేని కళ్యాణ మండపం (అమరజీవి పోలాబత్తిన చిన్నప్పనగర్)లో మహిళా ఉద్యమనేత నాగళ్ల రాజేశ్వరమ్మ వేదికపై రెండు రోజుల నుంచి ఉత్సాహపూరిత వాతావరణంలో మహాసభ జరిగింది. మహాసభ పలు తీర్మానాలు చేసింది. కౌలు రైతులకు పంట రుణాలు, సబ్సిడీపై పరికరాలివ్వాలనీ, ప్రభుత్వ తమ ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలనీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనీ, చుక్కల భూముల రిజిస్ట్రేషన్ కొనసాగించాలనీ, పామర్రు సమీపంలో రోషిణి విద్యుత్ ఉత్పత్తి కర్మాగారం, హనుమాన్ జంక్షన్ డెల్టాషుగర్స్ ఫ్యాక్టరీ, కానూరు, ఎనికేపాడు, ఆవుటపల్లి, సూరంపల్లి క్లస్టర్లలోని పరిశ్రమలన్నీ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నందున వాటిని బతికించే ఏర్పాట్లు చేసి కార్మికుల ఉపాధి అవకాశాలు కల్పించాలని తీర్మానించింది. సంక్షోభంలో ఉన్న రవాణారంగం పునరుద్ధరించాలని, నష్టాల్లో ఉన్న బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమను బతికించే చర్యలు తీసుకోవాలని కోరింది. ఆక్వా పీడిత మండలాలకు కృష్ణానది నుంచి పైపుల ద్వారా మంచినీటిని అందించే పథకాన్ని చేపట్టాలనీ, డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలనీ, 100 కిలోమీటర్ల సముద్ర తీర అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని మహాసభ కోరింది. వ్యవసాయానికి రైతులకు రుణాలు మంజూరు చేయాలనీ, కౌలు రైతులందరికీ పంట రుణాలు, గుర్తింపుకార్డులు ఇవ్వాలనీ, విద్యార్థి, యువత, మహిళలు, చేతివృత్తుల, ఇతర అన్ని సామాజిక తరగతుల సంక్షేమానికి పథకాలు అమలు చేయాలని మహాసభ తీర్మానించింది.

ప్రజా సమస్యలపై రాజీలేనిపోరు : వైవి

కష్టజీవులకు అండగా, బాధితుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మహాసభలో ఆయన ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల కాలంలో పోరాటాల ఉధృతి బాగా పెరిగిందన్నారు. నందివాడ మండలం ఇలపర్రు, నాగాయలంక మండలం గుల్లలమోద, బందరులో పోర్టు తదితర అంశాలపై చేసిన పోరాటాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ లోపాలను సరిచేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సిపిఎం కృష్ణా జిల్లా (తూర్పు) కమిటీ కార్యదర్శి ఆర్.రఘు కూడా మాట్లాడారు. మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.బాబూరావు, ఎంబి అధ్యయన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, సీనియర్ నాయకులు వై.కేశవరావు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఖగేన్‌దాస్ మృతికి వై.వెంకటేశ్వర రావు, సిహెచ్.బాబూరావు, ఆర్.రఘు తదితరులు నివాళులర్పించారు.

సిపిఎం కృష్ణా జిల్లా (తూర్పు) కమిటీ కార్యదర్శిగా ఆర్.రఘు



ఈ మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. కార్యదర్శిగా ఆర్.రఘు మరోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా వై.నరసింహారావు, ఎం. హరిబాబు, సిహెచ్. రవి, కె.వెంకటేశ్వరరావు, ఆర్‌సిపి రెడ్డి ఎన్నికయ్యారు. మొత్తం 23 మందితో కమిటీ ఎన్నికైంది.

నిరాహార దీక్షలు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి విస్తృత మద్దతు



విజయవాడలో రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

- రెండోరోజూ కొనసాగిన రిలేనిరాహార దీక్షలు
- దీక్షా శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపిన పలు యూనియన్లు, పార్టీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రిలేనిరాహార దీక్షలు రెండో రోజు ఆదివారమూ కొనసాగాయి. విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తోన్న ఈ దీక్షలకు విస్తృత మద్దతు లభిస్తోంది. కర్నూలు జిల్లా కేంద్రంలోని కృష్ణదేవరాయ సర్కిల్‌లో నిర్వహిస్తోన్న దీక్షా శిబిరంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు పాల్గొని ప్రసంగించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద కొనసాగిన రిలే నిరాహార దీక్షలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రామచంద్రపురం, జగ్గంపేట, విలీన మండలాల విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. జనసేన పార్టీ జిల్లా మహిళా నాయకులు గంటా స్వరూపాదేవి సంఘీభావం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగాయి. నరసాపురంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. విజయవాడలోని గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు రిలే దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన సిఐటియు రాష్ట్ర నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టిడిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. దీక్షలకు వైసిపి నాయకులు వెల్లంపల్లి శ్రీనివాస్, సిఐటియు నగర కార్యదర్శి ఎం.వి.సుధాకర్ మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు కొనసాగాయి.

ఈ నెల 27 నుంచి కాంట్రాక్ట్ వర్కర్లు తలపెట్టిన సమ్మెకు మద్దతుగా పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఎల్‌ఐసి తదితర యూనియన్ల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. విశాఖ నగరంలోని జగదాంబ సమీపంలోగల సిఐటియు కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ నెల 27 నుంచి తలపెట్టిన సమ్మె, ఈ నెల 24 నుంచి విజయవాడలో నిర్వహించనున్న నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు జిఎస్.రాజేశ్వరరావు కోరారు. కడప కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, పిసిసి జిల్లా అధ్యక్షులు నజీర్ అహమ్మద్ సందర్శించి మద్దతు తెలిపారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ వద్ద రెండో రోజు దీక్ష శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ప్రారంభించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, ఐఎన్‌టియుసి, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్, ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తోన్న దీక్షా శిబిరాన్ని ఎపి కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్, ఎఐటియుసి నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగాయి. విజయనగరంలో దీక్షా శిబిరాన్ని వైసిపి విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.వి.కె.ప్రసాద్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి ప్రారంభించారు. దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ సంఘీభావం తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న రైతులు, వైసిపి నాయకులు

భూ పంపిణీ వివాదాస్పదం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం కోనంకిలో పేదలకు భూ పంపిణీ కార్యక్రమం వివాదాస్పదమైంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఇతర పేదలకు ఇళ్ల స్థలాల కోసం గతంలోనే కొంత భూమిని కొనుగోలు చేసిన అధికారులు వాటికి పొజిషన్ చూపేందుకు పోలీసుల సాయంతో ఆదివారం వెళ్లారు. కొలతలు కొలవడానికి వీల్లేదని గ్రామానికి చెందిన అన్నపురెడ్డి హనుమాయమ్మ మరికొంత మంది వైసిపి నేతలతో కలిసి అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూ యజమానులైన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని, దీనిపై కోర్టులో కేసు నడుస్తోందని, ఈ క్రమంలో ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ గురజాల ఆర్‌డిఒ మురళి మాట్లాడుతూ భూమిని 2007లోనే కొనుగోలు చేసి పరిహారం ఇచ్చామని, లబ్ధిదార్లకు పట్టాలను సైతం గతేడాది జనవరిలోనే ఇచ్చామని చెప్పారు. కోర్టు స్టే ఈనెల 19తో ముగిసిందని, అభ్యంతరాలుంటే కోర్టుకెళ్లాలని సూచించారు. అనంతరం సర్వే పనులు పూర్తి చేశారు.

26వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 26వ రోజుకు చేరాయి. హిందుస్థాన్ షిప్‌యార్డ్ మత్స్యకారుల ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆదివారం దీక్షలు సాగాయి. ఈ దీక్షలో తాటితూరు, నేతాజీ వాడ బలిజ సంక్షేమ సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని మారా వెంకటరమణ, మోజు ప్రసాద్ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు.



కర్నూలులో దీక్షలు చేస్తున్న న్యాయవాదులు

కర్నూలుకు హైకోర్టు ఇవ్వాల్సిందే

న్యాయవాదుల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. శ్రీభాగ్ ఒప్పందంలో భాగంగా రాజధాని కోస్తా ప్రాంతానికి వెళ్లినందున హైకోర్టును కర్నూలుకు ఇవ్వాలని కర్నూలు కృష్ణదేవరాయ సర్కిల్‌లో ఆదివారం న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ దీక్షలను సీనియర్ అడ్వకేటు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగలక్ష్మిదేవి ప్రారంభించారు. రాయలసీమ తాగునీటి సాధన సంఘం అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, సీనియర్ అడ్వకేట్లు ఓంకార్, పి.నిర్మల, మురళీమనోహర్‌లు దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాయలసీమ జిల్లాల పట్ల పాలకులు మొదటి నుంచి వివక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులందరూ రాయలసీమ ప్రాంతం వారైనప్పటికీ ప్రయోజనాలు మాత్రం కోస్తా ప్రాంతానికే పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు న్యాయవాదుల దీక్షలకు సంఘీభావం తెలిపారు. తొలిరోజు నిరాహార దీక్షల్లో 12 మంది న్యాయవాదులు కూర్చున్నారు.

జమ్మూకాశ్మీర్‌ను స్నేహ వారధిగా ఉపయోగించండి

భారత్, పాక్‌లకు ముఫ్తి సూచన

జమ్మూ : జమ్మూకాశ్మీర్‌ను ఒక యుద్ధ భూమిలా కాకుండా, స్నేహవారధిగా ఉపయోగించుకోవాలని భారత్, పాకిస్తాన్‌లకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మొహ బూబా ముఫ్తి సూచించారు. సరిహద్దులో రక్తపుటేరులు పారుతున్నాయని, రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని ప్రధాని మోడీ చెబుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా వున్నాయని ముఫ్తి తెలిపారు. 'రాష్ట్రాన్ని యుద్ధభూమిలా కాకుండా, స్నేహవారిధిలా ఉపయోగించుకోవాలి' అని అన్నారు.

కృతజ్ఞతలు

తన ఆరురోజుల భారత పర్యటన విజయవంతమైందని , ఈ పర్యటన చిరకాలం గుర్తుండిపోతుందం టూ మోడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు




కేసుల కేటాయింపుపై విధి విధానాలు

బహిరంగ ప్రకటన చేయటంపై సుప్రీం పరిశీలన

న్యూఢిల్లీ : అత్యంత సున్నితమైన కేసుల విచారణ బాధ్యతలను ఆయా ధర్మాసనాలకు కేటాయించటానికి సంబంధించిన విధి విధానాలను త్వరలోనే బహిర్గతం చేసే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలిస్తోంది. ఇప్పటికే ఈ అంశంపై వివిధ వర్గాల నుండి సలహాలు, సూచనలు స్వీకరించిన ప్రధాన న్యాయమూర్తి కేసుల కేటాయింపులో పారదర్శకతను పాటించే అంశంపై త్వరలోనే ఒక విధానాన్ని ప్రకటించనున్నారని ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా సన్నిహిత వర్గాలు చెప్పాయి. సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తుతోపాటు, వివిధ కేసుల కేటాయింపునకు సంబంధించి నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ప్రస్తావించిన అంశాలను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలిస్తోందని ఈ వర్గాలు వివరించాయి. లోయా మృతి కేసు సోమవారం ధర్మాసనం ముందు విచారణకు రానున్న విషయం తెలిసిందే. కేసుల విచారణ బాధ్యతల కేటాయింపును సంబంధించి స్పష్టమైన విధానాన్ని అనుసరించటంతో పాటు దీనిపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సహచర న్యాయమూర్తులు చేసిన సూచనలను ప్రధాన న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకున్నారని ఈ వర్గాలు చెలిపాయి. ఈ అంశాలన్నింటిపై ప్రధాన న్యాయమూర్తి నిర్ణయాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ త్వరలోనే అప్‌లోడ్ చేసే అవకాశం వుందని, తద్వారా ఈ వ్యవస్థను ప్రజలందరికీ తెలిసే విధంగా అందుబాటులోకి తెస్తామని సుప్రీంకోర్టుకు చెందిన ఉన్నత స్థాయి వర్గాలు వివరించాయి.

ఇసి సిఫార్సుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: లాభదాయక పదవులు కలిగి వున్నారన్న ఆరోపణలపై ఆమాద్మీ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ పంపిన సిఫార్సును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం ఆమోదించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఆదివారం ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎన్నికల కమిషన్ వ్యక్తం చేసిన అభిప్రాయం మేరకు ఢిల్లీ శాసనసభకు చెందిన 20 సభ్యులను అనర్హులుగా ప్రకటిస్తు న్నట్లు రాష్ట్రపతి తన ఆదేశా లలో పేర్కొన్నట్లు ఈ నోటిఫికేషన్‌లో వివరించారు. అనర్హులైన వారిలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సన్నిహితుడు, నజాఫ్‌గఢ్ ఎమ్మెల్యే, రవాణా మంత్రి కైలాష్ గెహ్లాట్, చాందినీ చౌక్ ఎమ్మెల్యే ఆదర్శ్ శాస్త్రి, లక్ష్మీనగర్ ఎమ్మెల్యే నితిన్ త్యాగి, పూర్వాంచల్‌కు చెందిన ప్రముఖ నేత సం జీవ్ ఝా తదితరుల పేర్లు ఈ జాబితాలోచోటు చేసుకున్నాయి.



రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్యానికి ముప్పు

ఎమ్మెల్యేల అనర్హతపై ఆప్ ఆగ్రహం

న్యూఢిల్లీ: తమ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులను శాసనసభ్యత్వానికి అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి చేటు అని ఆమాద్మీపార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆప్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్నికల కమిషన్ చేసిన సిఫార్సును రాష్ట్రపతి ఆదివారం ఆమోదించిన విషయం తెలిసిందే. తమకు న్యాయవ్యవస్థపై విశ్వాసం వుందని, సోమవారం నాడు కోర్టు నుండి కొంతమేర సాంత్వన లభించవచ్చని భావిస్తున్నామని అనర్హ ఎమ్మెల్యేలలో ఒకరైన మదన్‌లాల్ చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులపై తీవ్రంగా స్పందించిన ఆప్ సీనియర్ నేత అశుతోష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి చేటు అని విమర్శించారు. తమకు వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్ తీసుకున్న 'బాధాకరమైన' నిర్ణయంపె తుది నిర్ణయానికి వచ్చే ముందు తమ వాదనను వినిపించుకునేందుకు రాష్ట్రపతి అవకాశం ఇచ్చి వుంటే బాగుండేదని 20 మందిలో ఒకరైన ఆల్కాలంబా ఆవేదన వ్యక్తం చేశారు. ఇసి నిర్ణయంపై విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసిన నేపథ్యంలో తమకు కొంత ఊరట లభించవచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రాష్ట్రపతిది నిర్హేతుకమైన చర్య

ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై యశ్వంత్ సిన్హా



ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ చేసిన సిపార్సును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిర్హేతుకంగా ఆమోదించారని సీనియర్ బిజెపి నేత యశ్వంత్ సిన్హా ఆదివారం పేర్కొన్నారు. ఆప్ ఎమ్మెల్యేలు 20 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయడం సహజ న్యాయాన్ని వక్రీకరించడమేనన్నారు. విచారణ లేకుండా, హై కోర్టు ఉత్తర్వుల కోసం ఆగింది లేదని, రాష్ట్రపతివి నిర్హేతుకమైన ఉత్తర్వులు అని యశ్వంత్ ట్వీట్ చేశారు. ఎన్నికల కమిషన్ సిఫార్సులకు రాష్ట్రపతి కోవింద్ ఆమోదం తెలిపిన తరువాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ (జిఎన్‌సిటిడి) చట్టంలోని 15(1)(ఎ) కింద ఢిల్లీ లెజిస్లేటివ్ అసెంబ్లీకి చెందిన 20 మంది సభ్యులను అనర్హులుగా రాష్ట్రపతి పేర్కొన్నారని నోటిఫికేషన్ వెల్లడించింది. ఆప్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు పార్లమెంటరీ సెక్రటరీలుగా లాభదాయక పదవులలో కొనసాగుతున్నారని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల కమిషన్ శుక్రవారం రాష్ట్రపతికి సిఫార్సు చేసింది.

వివక్షాపూరితం...!

ఇసి నిర్ణయంపై ఢిల్లీ సిపిఎం

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

ఆమాద్మీ పార్టీకి చెందిన 20 మంది శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దురదృష్టకరమైన ఈ నిర్ణయం అత్యంత వివక్షాపూరితమైనదని, భారత ఎన్నికల చరిత్రలో కనీ, వినీ ఎరుగనిదని సిపిఎం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో విమర్శించింది.

హర్యానా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలలో ఇటువంటి అనేక కేసులు పెండింగ్‌లో వున్నప్పటికీ ఎన్నికల కమిషన్ వాటిపై దృష్టి పెట్టకుండా తాత్సారం చేయటంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించింది. ఇవన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలు కావ టమే ఇందుకు కారణమని అభిప్రాయపడింది. ఎన్ని కల కమిషన్ హడావుడిగా తీసుకున్న ఈ నిర్ణయం కేంద్రంలోని రాజకీయ బాస్‌లను మెప్పించే రాజకీయ జిమ్మిక్ తప్ప మరేమీ కాదని దుయ్య బట్టింది. ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన ఇసి నిర్ణయంపై అనేక అనుమానాలున్నా యని సిపిఎం రాష్ట్ర కమిటీ వెల్లడించింది. ప్రధాన ఎన్నికల కమిష నర్ రిటైరవటానికి ముందు రోజు ఈ నిర్ణయం తీసుకోవటం వెనుక అధికార పార్టీ వత్తిడి వుందని భావిస్తున్నట్లు తెలిపింది. వాస్తవానికి ఎన్నికల కమి షన్ పనితీరు దీర్ఘకాలంగా పలు అనుమానాలకు తావిస్తోందని, గుజరాత్ ఎన్నికల ప్రకటన తీరు కానీ, ఢిల్లీ ఎమ్మెల్యేల లాభదాయక పదవుల వివాదం కానీ ఏదైనా ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తున్నదన్న అభిప్రాయం బలపడుతోందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ఎటువంటి నేరం చేయక పోయినా వారిని అనర్హులుగా ప్రకటించటం ప్రజా స్వామ్యంపై దాడి చేయటమేనని, భారత ఎన్నికల చరిత్రలో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసినరోజుగా దీనిని భావించాల్సి వుంటుందని సిపిఎం వ్యాఖ్యానించింది. లాభదాయక పదవుల అంశాన్ని పునర్నిర్వచించాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపింది. రాజ్యాంగ వ్యవస్థలను రాజకీయజోక్యం నుండి రక్షించటానికి 'అందరికీ ఒకే చట్టం, ఒకే న్యాయం' అన్న సూత్రాన్ని అమలుచేయటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంస్థలు ఉద్యమించాలని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. అదే విధంగా ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజలెన్నుకున్న శాసన సభ్యులు ఎటువంటి వత్తిడికి లోనుకాకుండా తమ విధులను నిర్వర్తించుకునే వీలుకల్పించాలని డిమాండ్ చేసింది.

గుజరాత్‌లో పద్మావత్ విడుదలపై కొనసాగుతున్న ఆందోళనలు

పలు బస్సు సర్వీసులు రద్దు

అహ్మదాబాద్ : పద్మావత్ సినిమాను నిరసిస్తూ రాజ్‌పుట్ సంఘాలు నిర్వహిస్తున్న ఆందోళనల నేపథ్యంలో గుజరాత్‌లో పలు బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఉత్తర గుజరాత్‌లోని 6 జిల్లాల్లో 100కు పైగా మార్గాలలో బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు వారు తెలిపారు. నిరసన కారులు పలు ప్రాంతాలలో జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను దిగ్బంధిస్తుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యగా పలు బస్సులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో శనివారం నాలుగు చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. కర్ణిసేనకు చెందిన కార్యకర్తలు పలు బస్సులను ధ్వంసం చేశారు. పద్మావత్ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ కర్ణిసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు సినిమా విడుదలకు అనుమతిచ్చింది. అయినా నిరసన కారులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న మరో సంఘటనలో ఒక థియేటర్‌ను ధ్వంసం చేశారు.

పద్మావత్ సినిమాను కర్ణిసేనతో పాటు మరో 10 సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంఘాలు కూడా నిరసన ఆందోళనలు చేపట్టాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా జాతీయ రహదారులను దిగ్బంధించాయి. సినిమాను ప్రదర్శించాలనుకుంటున్న థియేటర్లను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేస్తున్నాయి. ఈ సంక్షోభాన్ని నివారించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు. దీనికి సంబంధించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాలను కూడా ప్రభుత్వం పరివీలిస్తున్నదన్నారు. కర్ణిసేన వంటి రాజపుట్ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తుండటంతో తాము సినిమాను ప్రదర్శించలేమంటూ రాష్ట్రానికి చెందిన పలు థియేటర్ల నిర్వాహకులు, యజమానులు ఇప్పటికే ప్రకటించారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన పద్మావత్ సినిమా ఈ నెల 25న విడుదల కానున్నది.

గుజరాత్ రసాయన కర్మాగారంలో పేలుడు

నలుగురు మృతి : తొమ్మిది మందికి గాయాలు

వడోదర : గుజరాత్‌లోని వడోదర సమీపంలో ఉన్న ఒక రసాయన కర్మాగారంలో ఆదివారం జరిగిన పేలుడులో నలుగురు కార్మికులు మృతి చెందగా 9 మంది గాయపడ్డారు. ఫర్టిలైజర్ కంపెనీ జిఎస్‌పి క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కర్మాగారం వద్ద తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.. నందేశరి వద్ద ఉన్న గుజరాత్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ జోన్‌లో ఈ కర్మాగారం ఉంది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు మృతి చెందినట్లు జిల్లా కలెక్టర్ పి. భారతి ధృవీకరించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. పేలుడుకు గల కారణం ఇంకా తెలియ రాలేదు. పేలుడు వల్ల సంభవించిన మంటలను అదుపులోకి తెచ్చేందుకు దాదాపు రెండు గంటలు పట్టిందని అగ్నిమాపక అధికారి ఓం జడేజా తెలిపారు. కర్మాగారంలో పేలుడు సంభవించిన తరువాత, పరిసర కర్మాగారాలకు కూడా మంటలు వ్యాపించాయని ఆయన చెప్పారు. అక్కడ మండగల రసాయన పదార్థాలు ఉండటమే దీనికి కారణమన్నారు.

ఉత్తర ప్రదేశ్ ఫొటోకాపి షాప్‌లో ఆర్మీ మ్యాప్‌లు

యజమానిని కస్టడీలోకి తీసుకున్న సైనిక నిఘా అధికారులు

బరేలి (ఉత్తరప్రదేశ్) : బరేలీలోని ఒక ఫొటోకాపి షాపులో సైన్యానికి చెందిన పలు మ్యాప్‌లను కనుగొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో షాపు యజమానిని సైనిక నిఘా ఏజెంట్లు అదుపులోకి తీసుకున్నారన్నారు. ఇద్దరు యువకులు శనివారం సైన్యానికి సంబంధించిన పలు మాప్‌లను ఒక కట్టగా ఫొటో కాపీ షాప్‌నకు తీసుకు వచ్చారని, వాటిని, వాటి ఫొటో కాపీలను తరువాత వచ్చి తీసుకు వెళ్తామని చెప్పి వెళ్లి పోయారని షాపు యజమాని తమకు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. షాపు యజమాని కృష్ణ అగర్వాల్‌ను సైనిక నిఘా ఏజెంట్లు ప్రశ్నిస్తున్నారన్నారు. దీనిపై బరేలి ఎస్ఎస్‌పి జోగేంద్ర కుమార్‌ను ప్రశ్నించగా అది సైనిక నిఘాకు సంబంధించిన అంశమని, దీనికి సంబంధించి వారు తమతో ఇప్పటి వరకు ఎటువంటి సమాచారాన్ని పంచుకోలేదని ఆయన చెప్పారు.

విదేశీ సంస్థ ప్రయోగించనున్న భారత దేశపు చివరి ఉపగ్రహం జిశాట్-11

చెన్నై : బహుశా ఒక విదేశీ అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయోగించే భారత దేశపు చివరి ఉపగ్రహం జిశాట్-11 కానున్నదని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ కె.శివన్ తెలిపారు. దాదాపు 5.7 టన్నుల బరువున్న జిశాట్-11 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని అరైన్ అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన అరైన్ రాకెట్ త్వరలోనే ప్రయోగించనున్నది. మనదేశపు అత్యంత భారీ రాకెట్ 640 టన్నుల జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్-ఎంకె 111(జిఎస్‌ఎల్‌వి ఎంకె 111) మోసుకెళ్ళే బరువు సామర్థ్యాన్ని మరో 6 టన్నులు పెంచడం, తక్కువ బరువు ఉన్న కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ఉత్పత్తి చేయడం అనే రెండు అంశాలపై తాము కృషి చేస్తున్నట్లు శివాన్ తెలిపారు.

త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ ఖగేన్‌దాస్ హఠాన్మరణం



కోల్‌కత్తా : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు. త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ ఖగేన్‌దాస్ ఆదివారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. కోల్‌కత్తాలో జరుగుతున్న కేంద్ర కమిటీ సమావేశానికి హాజరైన ఆయన శనివారం నాడు చురుకుగా చర్చల్లో పాల్గొన్నారు. ఆదివారం హఠాత్తుగా మృతి చెందడంతో కేంద్ర కమిటీ సమావేశంలో విషాద వాతావరణం నెలకొంది. ముజఫర్ అహ్మద్ భవవన్‌లో ఉంచిన ఆయన మృతదేహాన్ని కేంద్ర కమిటీ సభ్యులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ కార్మిక, కర్షక శ్రామికుల అభ్యున్నతికోసం తుదిశ్వాస వరకు ఖగేన్‌దాస్ కృషి చేశారని నివాళులర్పించారు.

ప్రవీణ్ తొగాడియాను పదవి నుండి తొలగిస్తాం: స్వామి చిన్మయానంద

అలహాబాద్ : విశ్వహిందూ పరిషత్ పరిషత్ (విహెచ్‌పి) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధికార బాధ్యతల నుండి ప్రవీణ్ తొగాడియా తొలగిస్తామని ఆ సంస్థ మార్గదర్శక మండలి సీనియర్ సభ్యుడు స్వామి చిన్మయానంద పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాజస్థాన్‌పై విమర్శలు చేసి, క్షమశిక్షణా రాహిత్యానికి పాల్పడినందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాగా, సంత్ సమ్మేళన్‌లో పాల్గొన్న కొంత మంది నేతలు ఆయనకు మద్దతుగా నిలిచారు. గత సోమవారం కొన్ని గంటలు కనిపించకుండా పోయిన ఆయన ఆసుపత్రిలో చేరారు. తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు కుట్ర జరుగుతుందని తనకు సమాచారం అందుతోందని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు శిక్షణ అవసరం : రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు జాతీయ భద్రతా సిబ్బందితో పాటు, కమాండోలు, సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులు కూడా శిక్షణ పొందాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీలోని గుర్‌గ్రామ్‌లోని జాతీయ భద్రతా దళాల గారిసన్ వద్ద జరుగుతున్న 8వ ఆల్ ఇండియా కమాండో కాంపిటేషన్ కార్యక్రమం ముగింపు సమావేశంలో మాట్లాడారు.

బస్సు చార్జీల పెంపుపై తమిళనాడులో నిరసనలు



చెన్నై : బస్సు చార్జీలు పెంచుతూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా ఈ నిరసనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం దిండిగల్ వద్ద గ్రామస్తులు చార్జీలు పెంపును నిరసిస్తూ రోడ్డు రోకో నిర్వహించారు. పెంచిన చార్జీలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దినసరి కూలీలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలోని తంజావూరు, తిరువన్నామలై జిల్లాలోనూ ఇలాంటి ప్రదర్శనలు జరిగాయి. చార్జీలు పెంచడాన్ని సిపిఎం, డిఎంకె, పిఎంకె.. తదితర రాజకీయ పార్టీలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చాయి. చార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం నుంచి సిపిఎం నిరసన ప్రదర్శనలు నిర్వహించనుంది. డిఎంకె, పిఎంకె ఈ నెల 25, 27న ప్రదర్శనలు నిర్వహించనున్నాయి. ఈ చార్జీల పెంపుపై రవాణా శాఖ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ మాట్లాడుతూ 'మేం ప్రజలకు క్షమాపణ చెబుతున్నాం. అనివార్య పరిస్థితుల్లో చార్జీలను పెంచాల్సి వచ్చింది' అని తెలిపారు. ఇంధన ధరలు, నిర్వహణ వ్యయం పెరగడంతో బస్సు చార్జీలను పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి ఈ నెల 20న ప్రకటించారు. అదే రోజు నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి.

ప్రత్యేకం

బాల్య వివాహాలు, వరకట్నానికి వ్యతిరేకంగా

బీహార్‌లో భారీ మానవహారం

పాట్నా : సామాజిక దురాచారాలు బాల్య వివాహాలు, వరకట్నానికి వ్యతిరేకంగా బీహార్‌లో వేలాది మంది ప్రజలు భారీ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి, బిజెపి నేత గిరిజా సింగ్, మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మంజీ, అధికార కూటమి నేషనల్ డెమోక్రటిక్ అలియన్స్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ మానవహారంలో పాల్గొన్నారు. బీహార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మానవహారం ప్రపంచంలోనే భారీ మానవహారమని అధికారులు చెబుతున్నారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు చెందిన బృందం ఈ మానవహారాన్ని నమోదు చేసింది. 'మధ్యాహ్నం 12:30 గంటల నుంచి ప్రారంభమైన ఈ మానవహారంలో చిన్నారులు, పెద్దలు, గృహిణులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ఇతరులతో సహా వేలాది మంది పాల్గొన్నారు' అని రాష్ట్ర ముఖ్యకార్యదర్శి అంజని కుమార్ సింగ్ మీడియాకు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయరహదారులు, గ్రామీణ రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ మానవహారాల్లో 4.3 కోట్లమంది (బీహార్ జనాభా 11 కోట్లు) పాల్గొని వుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. 40 డ్రోన్ కెమెరాలతో ఈ



మానవహారాన్ని చిత్రీకరించారు. బాల్య వివాహాలు, వరకట్నానికి వ్యతిరేకంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం దేశంలో ఇదే మొదటిసారని అధికారులు అంటున్నారు. ఈ దురాచారాలకు వ్యతిరేకంగా 2017 అక్టోబర్ 2న నితీష్ కుమార్ ప్రచారం ప్రారంభించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో బాల్యవివాహాల్లో 39.1 శాతం బీహార్‌లోనే జరుగుతున్నాయి. ఐదు సంవత్సరాల క్రితం ఇది 69 శాతంగా వుంది.

సంక్షిప్తం

ఢిల్లీ వృద్దులకు 5 లక్షల పరిహారం

న్యూఢిల్లీ : ఉత్తర ఢిల్లీలోని బవానా పారిశ్రామిక వాడలో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి కారణమైన మనోజ్ జైన్ అనే వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ ఘటనలో 17 మంది మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయా లయ్యాయి. ఇందులో 10 మహిళలు ఉన్నారు. ఈ ఘటనపై ఢిల్లీ ముఖ్య మంత్రి స్పందిస్తూ వెంటనే విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ బాణా సంచా తయారీకి లైసెన్స్‌ను ఎలా, ఎవరు ఇచ్చారు అనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు కేజ్రీవాల్ పేర్కొన్నారు. మనోజ్ ఈ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకొని నడుపుతున్నట్లు పోలీసులకు తెలిపాడు. మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున కేజ్రీవల్ పరిహారాన్ని ప్రకటించారు.

పాక్ కాల్పులు ఆగినట్లేనా ..?

జమ్ము : జమ్మూ కాశ్మీర్లోని సరిహద్దుల వెంబడి గ్రామాలను లక్ష్యంగా చేసుకొని గత మూడు రోజులుగా పాకిస్తాన్ కాల్పులకు పాల్పడుతూనే ఉంది. ఈ ఘటనలో ఆరుగురు పౌరులు మృతి చెందగా, 50 మంది గాయపడ్డారు. సరిహద్దులోని జిల్లాలైన రాజౌరి, పూంచ్ జిల్లాలతో పాటు జమ్మూ, కతువా, సాంబా జిల్లాల్లో శనివారం రాత్రి నుంచి పాకిస్తాన్ కాల్పులు జరిపినట్లు ఎటువంటి నివేదిక అందలేదని అధికారులు పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆర్నియ సెక్టార్‌లో కొన్ని రౌండ్లు కాల్పులు చేశారని,

ఆమె సమ్మతి లేనిదే తాకరాదు

న్యూఢిల్లీ : మహిళా సమ్మతి లేకుండా ఆమెను ఎవరూ తాకకూడదని ఢిల్లీ కోర్టు తీర్పునిచ్చింది. మహిళలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయని, ఇదేంతో దురదృష్టకరమని విచారం వ్యక్తం చేసింది. తొమ్మిది ఏళ్ల బాలికను లైంగికంగా వేధించినందుకు రాము అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించిన కేసును పరిశీలించింది. 2014లో ఉత్తర ఢిల్లీలోని ముఖర్జీ నగర్‌లోని రద్దీగా ఉన్న మార్కెట్లో అనుకోకుండా తాకినందుకు ఉత్తరప్రదేశ్ నివాసి అయిన రాముకు అదనపు సెషన్స్ జడ్జి సీమా మైని కఠినంగా జైలు శిక్ష విధించారు. ఒక మహిళ శరీరాన్ని ఆమె అనుమతి లేకుండా ఏ ఉద్దేశంతోనూ తాకరాదని కోర్టు పేర్కొంది.

దక్షిణ కొరియాకు చేరుకున్న ఉత్తర కొరియా అధికారులు

ప్యోంగ్యాంగ్ : వచ్చే నెలలో దక్షిణ కొరియాలో జరగనున్న శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొనే నిమిత్తమై సందేహాల నివృత్తి కోసం ఉత్తర కొరియా లాజిస్టిక్ అధికారులు ఆదివారం దక్షిణ కొరియాకు చేరుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉత్తర కొరియా ఈ ఒలింపిక్స్‌లో పాల్గొనడం లేదు. భారీ భద్రత నడుమ ఆదివారం వారు సియోల్‌కు చేరుకున్నారని అక్కడ మీడియా పేర్కొంది. తర్వాత ఒలింపిక్స్ జరిగే ప్రాంతానికి వెళ్లారని పేర్కొంది. ఈ ఒలింపిక్స్ ఫిబ్రవరి 9 నుండి 25 వరకు జరగనున్నాయి. ఏడుగురు సభ్యులతో కూడిన ఈ బృందం శనివారమే దక్షిణ కొరియా చేరుకొని ఇక్కడి వేదికలను తనిఖీ చేయాలనుకున్నప్పటికీ ఆ పర్యటనను వారు రద్దు చేశారు.



। లయన్ డాన్స్

చైనా చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం నూతన సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంగా చైనాలోని నింగ్సీహుయి స్వయం పాలితప్రాంతంలోని ఇంచువాన్‌లో లయన్ డాన్స్‌ను నిర్వహిస్తున్న ప్రజలు

సిరియాలోని ఆఫ్రిన్‌లో టర్కీ 'ఆపరేషన్ ఆలివ్‌బ్రాంచ్'

అంకారా: సిరియాలోని ఆఫ్రిన్ ప్రావిన్స్ నుండి కుర్దిష్ మిలీషియాను తరిమి కొట్టేందుకు 'ఆపరేషన్ ఆలివ్ బ్రాంచ్' పేరిట సైనిక చర్యను ప్రారంభించినట్లు టర్కీ సైన్యం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సైనిక చర్య స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ప్రారంభించినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. టర్కీకి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలు సిరియా భూభాగం లోపల కొన్ని కి.మీ ప్రాంతంలో బాంబుల వర్షం కురిపించిన దృశ్యాలను టీవీ ఛానళ్లు తమ వార్తా కథనాలలో ప్రసారం చేశాయి. సిరియా ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకే తాము ఈ సైనిక చర్య చేపట్టినట్లు టర్కీ ఈ ప్రకటనలో వివరించింది. ఆఫ్రిన్ ప్రాంతంలో తిష్టవేసిన మొత్తం ఉగ్రవాదులందరినీ తరిమికొట్టేంత వరకూ తమ ఈ ఆపరేషన్ కొనసాగుతుందని సైన్యం వివరించింది. సిరియా, టర్కీ సరిహద్దు ప్రాంతంలో వున్న ఈ ప్రావిన్స్‌లో కొనసాగుతున్న విమాన దాడుల్లో అనేక పరిశీలక ప్రాంతాలు (అబ్జర్వేషన్ పాయింట్స్), పెట్రోల్ డిపో దెబ్బతిన్నట్లు మీడియా తన వార్తా కథనాలలో తెలిపింది. సిరియాలో తాము సైనిక చర్య ప్రారంభించనున్నట్లు టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే.

ట్రంప్ పాలనపై నారీ 'భేరి'

లక్షలాది మంది నిరసన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలన ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన అమలు చేస్తున్న విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ లక్షలాది మంది మహిళలు దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో భారీయెత్తున ప్రదర్శనలు నిర్వహించారు. వాషింగ్టన్, న్యూయార్క్, లాస్‌ఏంజెల్స్, చికాగోతో సహా దాదాపు 250కి పైగా నగరాలలో ఈ ప్రదర్శనలు కొనసాగాయి. ఈ ప్రదర్శనల్లో ప్రసంగించిన వక్తలందరూ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మహిళలకు నరకాన్ని చూపుతున్నాయని విమర్శలు గుప్పించారు. లక్షలాది మంది మహిళలు తమ జీవిత భాగస్వాములతో కలిసి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న ట్రంప్‌పై నిరసన వ్యక్తం చేస్తూ కొనసాగిన ప్రదర్శనల్లో ఇది రెండోది కావటం విశేషం. వచ్చే నవంబర్‌లో జరుగనున్న కాంగ్రెస్ ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటు ద్వారా తగురీతిలో బుద్ధి చెప్పాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. అమెరికాలో మాత్రమే కాక ఇతర దేశాల్లోని పలు నగరాల్లో సైతం ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు కొనసాగాయి. లాస్‌ఏంజెల్స్ ర్యాలీలో ప్రసంగించిన నటి ఇవా లంగోరియా మాట్లాడుతూ ప్రజలు తమ శక్తివంతమైన ఓటుతో అధ్యక్షుడికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గత ఏడాది పాలనలో ట్రంప్ సర్కారు మహిళలకు ఒరగబెట్టిందేమీ లేదని ఆమె అన్నారు. గత ఏడాది అధికారం చేపట్టిన సమయంలో ట్రంప్ మహిళలపై చేసిన అసభ్య వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళనకారుల్లో అనేక మంది గులాబి రంగులో వున్న 'పుస్సీహాట్స్' టోపీలను ధరించి ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ట్రంప్ గత ఏడాది పాలనాకాలం మహిళల హక్కులను కాలరాసిందని, లైంగిక వేధింపులు, దాడులు పెరిగిపోయాయని సోషల్ మీడియాలో పలువురు నిరసన తెలియ చేశారు. శనివారం నాటి నిరసన ప్రదర్శనల్లో ప్రసంగించిన పలువురు వక్తలు సైతం మహిళలపై పెరిగిపోతున్న లైంగిక దాడులను ప్రస్తావిస్తూ మహిళలను అగౌరవించే సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాలని అమెరికన్లకు పిలుపునిచ్చారు.

లాస్‌ఏంజెల్స్‌లో భారీ ప్రదర్శన

ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా శనివారం నాడు దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో లాస్‌ఏంజెల్స్‌లో జరిగిన ప్రదర్శన అత్యంత భారీగా కొనసాగిందని, దాదాపు 6 లక్షల మంది మహిళలు దీనికి హాజరయ్యారని నగర మేయర్ ఎరిక్ గార్సెట్టీ చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన ప్రదర్శనలో ప్రసంగించిన డెమొక్రాటిక్ పార్టీ నేతలు గత ఏడాది ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికన్నా తక్కువ సంఖ్యలో హాజరయ్యారని అంచనా వేసారు. అధ్యక్షుడు ట్రంప్ తన పాలన తొలి వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ తాము ఆయన పనితీరుకు 'ఎఫ్' గ్రేడ్‌ను ఇస్తున్నామని ప్రతినిధుల సభలో మైనార్టీ పక్ష నేత నాన్సీ పెలోసీ వ్యాఖ్యానించారు. చికాగో నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనలో దాదాపు 2 నుండి 3 లక్షల మంది వరకూ పాల్గొన్నారని అధికారులు అంచనా వేశారు. గతంలో మహిళలు సాధించుకున్న శిశు జననాల నియంత్రణ, సమాన వేతన హక్కుల వంటి వాటిని ట్రంప్ విధానాలు కాలరాశాయని, అందువల్లే పలువురు మహిళలు తొలిసారిగా నిరసన తెలియచేస్తూ రోడ్డెక్కారని విశ్లేషకులు చెబుతున్నారు.

రుమేనియాలో అవినీతిపై భారీ నిరసన



బుఖారెస్ట్: దేశంలో ఉన్నత స్థాయిలో కొనసాగుతున్న అవినీతిపై ప్రజలు భారీయెత్తున నిరసన తెలియచేసారు. ముఖ్యంగా ప్రభుత్వం కొత్తగా రూపొందించిన అవినీతి నిరోధక చట్టం ఉన్నత స్థాయి అవినీతిపరులను రక్షించటానికి ఉపయోగిస్తోందంటూ దేశవ్యాప్తంగా వివిధ నగరాలలో భారీయెత్తున ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అధికార సోషల్ డెమొక్రాట్స్ నేతృత్వంలోని ప్రభుత్వం గత నెలలో ఆమోదించిన కొత్త అవినీతి నిరోధకచట్టంతో ఉన్నత స్థాయిలో అవినీతిపరులను ప్రాసిక్యూట్ చేసి శిక్షించటం కష్టసాధ్యమవుతుందని విమర్శకులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఆమోదించిన ఈ బిల్లును విమర్శిస్తున్న వారిలో ఒకరైన అధ్యక్షుడు దీనిపై ఇంకా సంతకం చేయాల్సి వుంది. రాజధాని బుఖారెస్ట్‌లో యూనివర్శిటీ స్క్వేర్‌నుండి పార్లమెంట్ భవనం వరకూ సాగిన నిరసన ప్రదర్శనలో దాదాపు 50 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారని నిర్వాహకులు చెబుతున్నారు. బుఖారెస్ట్‌తో పాటు క్లజ్, తిమిసోరా, కాన్‌స్టాంటా, బకావ్, సిబియు, లాసి తదితర నగరాలలో సైతం నిరసన ప్రదర్శనలు జరిగినట్లు తెలుస్తోంది.



కాబూల్ దాడిలో 18 మంది మృతి

ముష్కరులంతా హతం ప్రభుత్వ ప్రకటన

కాబూల్: శనివారం అర్ధరాత్రి సమయంలో కాబూల్ నగరంలోని కాంటినెంటల్ హోటల్‌పై దాడి చేసిన ముష్కరులను రాత్రంతా కొనసాగిన పోరులో సైన్యం మట్టుపెట్టింది. శనివారం అర్ధరాత్రి సమయంలో హోటల్‌లోకి ప్రవేశించిన ముగ్గురు మిలిటెంట్లు అక్కడి అతిథులను తమ బందీలుగా తీసుకున్నారు. సమాచారం తెలుసుకుని అక్కడికి చేరుకున్న సైన్యం, ఇతర భద్రతా దళాలు వారిపై ప్రారంభించిన పోరు రాత్రంతా కొనసాగింది. కొన్ని గంటల సేపు సాగిన ఈ పోరులో ఆదివారం ఉదయానికి చివరి మిలిటెంట్‌ను కూడా సైన్యం మట్టుపెట్టినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వం ప్రకటించింది. ముగ్గురు సాయుధులు శనివారం రాత్రి సైన్యం దాడిలోనే మరణించారని అధికారులుచెప్పారు. ఈ దాడిలో 18మంది మరణించారని, మరో ఆరుగురు గాయపడ్డారని హోం మంత్రిత్వశాఖ ప్రతినిధి నజీబ్ డానిష్ చెప్పారు. మృతి చెందిన వారిలో 14 మంది విదేశీయులు. దాడి సమాచారం అందిన వెంటనే హోటల్ యాజమాన్యం అందులో వున్న 41 మంది విదేశీయులతో సహా మొత్తం 153 మందిని ఖాళీ చేయించినట్లు తెలుస్తోంది. దాడి చేసిన 24 గంటల తరువాత సైతం ఆదివారం నాడు ఈ హోటల్ భవనం నుండి నల్లటి దట్టమైన పొగ వెలువడుతుండటం ప్రజలకు కన్పించింది. అమెరికా సైన్యానికి చెందిన అనేక సాయుధ శకటాలు, హెవీ మిషన్ గన్‌లతో ఆఫ్ఘన్ పోలీసులతో కలిసి ఈ భవనాన్ని ముట్టడించాయి. కాబూల్‌లో పర్యాటకులు బసచేసే హోటళ్లపై దాడి జరగవచ్చని అమెరికన్ రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసిన కొద్దిరోజులకే ఈ దాడి జరగటం గమనార్హం.

పౌరులను హత్య చేసిన సైనికులకు పదేళ్ల జైలు

మయన్మార్ సైనిక ట్రిబ్యునల్ తీర్పు

బ్యాంకాక్: మయన్మార్‌లోని కచ్చిన్ రాష్ట్రంలో ముగ్గురు పౌరులను హత్య చేశారన్న ఆరోపణపై ఆరుగురు సైనికులకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మయన్మార్‌కు చెందిన సైనిక ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది. గత సెప్టెంబర్‌లో సైనికులు కచ్చిన్ రాష్ట్రంపై దాడి చేసినపుడు ముగ్గురు పౌరుల మరణానికి కారకులైనట్లు విచారణలో తేలిందని, దీంతో ట్రిబ్యునల్ వారికి జైలు శిక్ష విధిస్తూ గత శుక్రవారం తీర్పు వెలువరించిందని కచ్చిన్ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సైనిక చర్యపై అంతర్గత దర్యాప్తు అనంతరం బాధ్యులైన సైనికులను ప్రాసిక్యూట్ చేసినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్గత విచారణలో తామే పౌరులను హత్య చేసినట్లు ఆరుగురు సైనికులు అంగీకరించారని కచ్చిన్ రాష్ట్ర పోలీసు అధికారి మిన్ జా వెల్లడించారు. సైనిక ట్రిబ్యునల్ వెలువరించిన తీర్పుపై మానవ హక్కుల సంఘాలు హర్షం ప్రకటించాయి.

మొదటి పేజీ తరువాయి

బిజెపి ఓటమే లక్ష్యం

అన్నారు. మొదటిది ఆర్థికపరమైన దాడులని, ఇచ్చిన అన్ని హామీలను బిజెపి తుంగలో తొక్కిందని చెప్పారు. రైతులు సంక్షోభంలో ఉన్నారని, రోజురోజుకూ నిరుద్యోగిత పెరుగుతోందని, గతంలో ఎప్పుడూ లేనంతగా ధనికులు, పేదల మధ్య అంతరం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండోది హిందూత్వ శక్తులు దేశ సమగ్రతకు భంగం కల్గించేలా మతతత్వ దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై జరుగుతున్నది మూడో దాడిగా తెలిపారు. వివిధ వ్యవస్థలపై బిజెపి ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని, మీడియా, సుప్రీంకోర్టు, పరిశోధనా సంస్థలతోపాటు సినిమాలపై కూడా దాడులు చేస్తోందని అన్నారు. నాలుగోది అమెరికా ప్రయోజనాలకు పూర్తిగా లొంగిపోవడమని చెప్పారు. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా మారడంతో అత్యధిక లాభాలు ఇచ్చేలా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అన్ని రంగాల్లో తలుపులు బార్లా తెరిచిందని చెప్పారు. ఇటీవలే రక్షణ, ఫైనాన్స్, రిటైల్ రంగాల్లోకి విదేశీ పెట్టుబడులు అనుమతించారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపికి వ్యతిరేకంగా అన్ని రకాల లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. బిజెపికి వ్యతిరేకంగా వీలైనంత ఎక్కువ శక్తిని కూడగట్టేలా తగిన ఎన్నికల ఎత్తుగడలను రూపొందించాలని ముసాయిదా తీర్మానం పేర్కొందని చెప్పారు. అయితే కాంగ్రెస్‌తో ఎటువంటి రాజకీయ ఫ్రంట్ గానీ, పొత్తు గానీ ఉండదని చెప్పారు. కొద్దిరోజుల్లో జరగనున్న మూడు రాష్ట్రాల ఎన్నికలపై ముఖ్యంగా త్రిపురపై కూడా చర్చించినట్లు ఏచూరి తెలిపారు. త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్‌ను ఓడించేందుకు గాను బిజెపి ఎంతకైనా దిగజారి వ్యవహరిస్తోందని, చివరకు తీవ్రవాద సంస్థలతో సైతం చేతులు కలుపుతోందని చెప్పారు. ఒకపక్క వారిదైన రీతిలో దేశభక్తిని ప్రచారం చేస్తూ జాతీయవాదం గురించి చెప్తున్న బిజెపి మరోవైపు త్రిపురను భారత దేశం నుంచి విడదీయాలని డిమాండ్ చేసిన ఐపిఎఫ్‌టితో కలిసి నడుస్తోందని, ఇది బిజెపి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని అన్నారు. త్రిపురలో ఉద్రిక్తతలు సృష్టించాలని బిజెపి ప్రయత్నించిందని, కానీ ప్రజలు తిప్పికొట్టారని చెప్పారు. త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్ బిజెపిని ఓడించే సవాల్‌ను తీసుకుందని సీతారాం ఏచూరి అన్నారు.

మొరిగే కుక్కలకు భయపడం

కాన్వా య్‌ని దళితులు అడ్డుకున్నారు. రాజ్యాం గాన్ని సవరిం చాలంటూ అంతకు ముందు ఆయన చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ నినాదాలు చేశారు. ఆ తరువాత ఆయన జాబ్ మేళాలో మాట్లాడుతూ ప్రజలకు సహాయపడలనే కృతనిశ్చయంతో ప్రభు త్వం ఉన్నదని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆశించిన రీతిలో దేశంలో మార్పులు తీసుకరావా లనుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా నిరసనలు తెలిపే వీధి కుక్కల మొరుగుళ్ళకు తాము భయపడమని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దళిత సంఘాల్లో ఆగ్రహం తెప్పించాయి. దళితులు ప్రదర్శనలు నిర్వహించి హెగ్డేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిలో కొంతమంది మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

అవి దళితులనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు కావు

తాను దళితులను ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని, ఈ విషయంలో కాంగ్రెస్ తనను లక్ష్యంగా చేసుకుని తన వ్యాఖ్యలను వక్రీకరించిందని ఆయన చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలు దళితులకు వ్యతిరేకంగా చేసినట్లు వక్రీకరించబడ్డాయని ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మేధావులను గురించి తాను ఆ వ్యాఖ్యలు చేశానని, కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా తన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తోందని మంత్రి అన్నారు. .

ఆయనను పదవి నుంచి తొలగించండి : ప్రకాష్ రాజ్

దళితులను కుక్కలతో పోలుస్తూ మరో వివాదానికి దారితీసిన మంత్రి అనంతకుమార్ హెగ్డేను పదవి నుంచి తొలగించాలని ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ డిమాండ్ చేశారు. బిజెపి అధిష్టానం ఆయన వ్యాఖ్యలను ఆమోదిస్తుందా? లేదా ఆయనను పదవి నుంచి తొలగిస్తుందా? అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు. అధికారంలో ఉన్న బిజెపి త్వరలోనే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ నెల రోజుల క్రితం కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి అనంత కుమార్ పలువురి ఆగ్రహానికి గురయ్యారు.

షెడ్యూల్ ప్రకారమే టెట్

సమర్పించారు. పేపర్-1(ఎస్జీటి)కు 1,71,403 మంది ఫీజు చెల్లించగా, 1,68,754 మంది దరఖాస్తులు సమర్పించారు. పేపర్-2(ఎస్ఎ)కు 2,12,337 మంది ఫీజు చెల్లించగా, 2,07,567 మంది దరఖాస్తుల్ని సమర్పించారు. భాషా పండితులు(పేపర్-3)కు 40,288 మంది ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించారు. పేపర్ -1, 2కు 11,003 మంది ఫీజు చెల్లించగా, 10,986 మంది దరఖాస్తుల్ని సమర్పించారు. పేపర్-1, 3కు 1,280 మంది ఫీజు చెల్లించి, దరఖాస్తుల్ని సమర్పించారు.

కంపెనీ సాగుకు ఉరకలు

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

సమన్వయకర్తలు

పంటల సాగు విస్తీర్ణం, అంతర్జాతీయంగా, జాతీయంగా వ్యవసాయోత్పత్తుల ధరల్లో చోటుచేసుకునే మార్పులు, గిరాకీ తదితర అంశాలపై ఇటు రైతులను అటు కార్పొరేట్ సంస్థలను ప్రతిపాదిత ఐటి సంస్థలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తాయని సర్కారు పేర్కొంటోంది. అంతేకాకుండా సేద్యానికి సంబంధించిన వాతావరణ పరిస్థితులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడకంపై రైతులకు సలహాలు, విస్తరణ సేవలను రైతులకు అందుబాటులోకి తెస్తాయని చెపుతోంది.

నాణ్యమైన వ్యవసాయోత్పత్తుల సాధనపై రైతులకు శిక్షణ కూడా ఇస్తాయట. పంట కోతల అనంతరం అవి చెడిపోకుండా నిల్వ చేసే పద్ధతులు, అందుకు మౌలిక సదుపాయాలు, పంటల సేకరణ వీటన్నింటినీ సదరు ఐటి సంస్థలు రైతులు, కార్పొరేట్ సంస్థల మధ్య ఆన్‌లైన్‌లో అనుసంధానం కావిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. ఒక్క మాటలో చెప్పాలంటే రైతులకు, కార్పొరేట్లకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తాయట.

విస్తరణ సేవల మాటున...

ప్రభుత్వరంగంలో విస్తరణ సేవలు నానాటికీ తీసికట్టు అన్నట్లున్నాయి. విస్తర ణాధికారుల పోస్టులు వేలల్లో ఖాళీగా ఉన్నాయి. చంద్రబాబు సర్కారు ప్రవేశపెట్టిన మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల వ్యవస్థలో రైతు సంక్షేమం కంటే రాజకీయ జోక్యం అధికంగా ఉంది. చాలా మండలాలకు శాశ్వత ప్రాతిపదిక వ్యవసాయా ధికారుల్లేరు. అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి), డిప్యూటి డైరెక్టర్ (డిడి) పోస్టులు సైతం ఖాళీ. ఒక్క వ్యవసాయశాఖలోనే కాదు ఆ శాఖకు అనుబంధంగా ఉండే మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, పౌరసర ఫరాలు, హార్టికల్చర్, ఫిషరీస్, సహా డిపార్టు మెంట్లలో రెగ్యులర్ నియా మకాల్లేవు. దీంతో రైతులు ప్రైవేటు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణ ాలు, ఆయా కంపెనీల ఏజెంట్ల సూచనలతో వ్యవసా యం చేసి దోపిడీకి గురవుతున్నారు. తీరని నష్టాల పాలవుతు న్నారు. ప్రభుత్వరంగంలో రైతుల కు సలహాలి వ్వాల్సింది పోయి ప్రైవేటు ఐటి సంస్థలను రంగంలోకి దించి వాటి ద్వారా విస్తరణ సేవలు, పంటల మార్కెటింగ్, ఉత్పాదకాల వాడకం తదితరాలను ఆన్‌లైన్‌లో అందు బాటులోకి తీసుకురా వడంకార్పొరేట్, కంపెనీ సాగును ప్రవేశపెట్ట డానికేనన్న ఆరోపణ లొస్తున్నాయి. ఈ వ్యవహారానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) అని పేరు పెట్టారు.

ఎంపికైన ఐటి సంస్థలు

ఐటి సంస్థ	చేసే పని	కేటాయించిన జిల్లాలు
ఇన్ఫినియం సొల్యూషన్స్	ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా పంట విస్తీర్ణం, ఉత్పాదకతలపై ముందస్తు సూచనలు	గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి, కర్నూలు
శాట్ ష్యూర్ అనలటిక్స్	ఉపగ్రహ ఆధారిత పర్యవేక్షణ సేవలు, మార్కెట్ అనుసంధానం	శ్రీకాకుళం
కిసాన్ నెట్‌వర్క్	క్షేత్ర స్థాయిలో రైతుల నుంచి ఉత్పత్తుల సేకరణ, తాత్కాలిక నిల్వ కేంద్రాలు	కర్నూలు, కడప, చిత్తూరు, అనంత
క్రిషిస్టార్	హార్టికల్చర్ పంటలు సాగు చేస్తున్న రైతులతో అనుసంధానం	చిత్తూరు
బిగ్‌హాట్	రైతులు బ్రాండెడ్ వ్యవసాయ ఉత్పాదకాల సేకరణకు డిజిటల్ ప్లాట్‌ఫాం	ఉభయగోదావరి
టిసిఎస్	రైతులకు సాగును లాభసాటి చేసేందుకు ఐసిటి ఆధారిత సేవలు	ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు
ఎఫ్ఎడి, ఎఫ్ఒఎస్ఎస్	వర్షాధార ప్రాంతాల్లో వ్యవసాయ అభివృద్ధి, ఉత్పాదకత పటిష్టం	రాయలసీమ, ప్రకాశం
బ్లూఫ్రాగ్	సమర్ధవంతంగా వ్యవసాయ యాంత్రీకరణ, పరికరాల వినియోగం	అన్ని జిల్లాలు

సిబిఐ అదుపులో ఎంఎల్‌సి వాకాటి

ప్రజాశక్తి - మనుబోలు(నెల్లూరు)

టిడిపి బహిష్కృత ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డిని సిబిఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరులో విచారణ చేపట్టారు. తక్కువ ఆస్తులను ఎక్కువగా చూపించి బ్యాంకులను మోసం చేసినట్లుగా వాకాటిపై గతంలో అభియోగాలను సిబిఐ మోపింది. వ్యాపార లావాదేవీల కోసం అంటూ ఐఎఫ్ఐసిఐ నుంచి రూ.20కోట్లు, వివిధ బ్యాంకుల నుంచి రుణాల కోసం 205 కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. వాకాటి ఆధ్వర్యంలో నడిచే సిఎస్ఆర్ గ్రూపు పెద్ద ఎత్తున బ్యాంకులను మోసాలు చేసి రుణాల ఎగవేత లాంటి ఆర్థిక నేరాలపై గతంలో ఫిర్యాదు చేసి ఉన్నారు. అప్పట్లోనే వాకాటి ఇళ్లు, ఆయన సంస్థల్లో సిబిఐ బృందాలు సోదాలు నిర్వహించింది. వాకాటిపై ఆర్థిక నేరాల ఆరోపణలతో ఏడాది క్రితమే టిడిపి సస్పెండ్ చేసిన విషయం విదితమే. దీంతో అర్నెల్ల నుంచి ఆయన టిడిపి కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల ఫ్లెమింగో పెస్టివల్ నుంచి టిడిపి కార్యక్రమాలకు హాజరయ్యారు. దాంతో ఎంఎల్‌సిపై సస్పెన్షన్ వేటు ఎత్తివేశారంటూ ఆయన అనుచరులే ప్రచారం చేస్తున్నారు. తాజాగా ఇప్పుడు జరిగిన సంఘటనతో వాకాటికి తమ పార్టీతో సంబంధం లేదని టిడిపి వర్గాలు అంటున్నాయి.

చివరి వరకూ చూద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయకపోతే ఇబ్బందులొస్తాయని నాయకుల్ని హెచ్చరించారు. తానే అక్కడకు వచ్చి నిరాహార దీక్ష చేస్తానని, అప్పుడైనా వారి మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. గతంలో గాంధీజీ ఇదే పద్ధతిని అనుసరించారన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో మనల్ని గెలిపిస్తే పనిచేయకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఆ మూడు జిల్లాల ఎమ్మెల్యేలు పని తీరు మార్చుకోవాలన్నారు. బురద అవుతుందని సిమెంట్ రోడ్డు వేస్తే మోకాళ్ల నొప్పులు వస్తూ ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. ఆ విషయాన్ని అందరు అర్థం చేసుకోవాలన్నారు. తన సొంత ఊరు వెళ్తే అన్నీ రోడ్లూ సిమెంట్ రోడ్లుగా మారాయన్నారు. ఎక్కడా ఒక్క మట్టి రోడ్డు కూడా కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. మూడున్నరేళ్ల తర్వాత ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం పెట్టామన్నారు.

నవయుగకే కాంట్రాక్టు

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులు చేపట్టేందుకు నవయుగ సంస్థ ముందుకు వచ్చిందని, ఆ సంస్థకే కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆమోదిస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు. పాతరేట్లకే పనులు చేపట్టేందుకు నవయుగ సంస్థ ముందుకొచ్చిందన్నారు. నవయుగ ప్రతిపాదనను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయని సిఎం తెలిపారు. రెండు రోజుల్లో ఎస్క్రో అకౌంట్ తెరుస్తామని, ఎట్టి పరిస్థితుల్లో 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని చంద్రబాబు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పోలవరం విషయంలో పారదర్శకతతో ఉన్నామని, విమర్శలకు అవకాశం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

175 సీట్లు గెలవాల్సిందే

వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలవాల్సిందేనని, లేకుంటే మనలో లోపం ఉన్నట్టేనని చంద్రబాబు అన్నారు.ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దళిత తేజం కార్యక్రమం చేపట్టాలని నేతలు, కార్యకర్తలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు టిడిపి చేసినంత లబ్ది ఎవరూ చేయలేదన్నారు. ప్రతిపక్షాలు తుని ఘటన, అమరావతి, పట్టిసీమ, పోలవరం విషయాలపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో రాజకీయ పునరేకీకరణ జరగాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు.భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నాయకులు ప్రణాళికలు రచించుకోవాలన్నారు. రాష్ట్రంలో టిడిపిని ఓడించే శక్తి ఎవరికీ లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. విభజన కష్టాలు ఎలా ఇబ్బంది పెడుతున్నాయో ప్రధాని నరేంద్రమోడీకి వివరించాలన్నారు. అలాగే రాష్ట్రం గ్రోత్ రేట్లో ముందుందని, తలసరి ఆదాయంలో మాత్రం చాలా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. టిడిపి వర్క్‌షాపులో అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ సిఎం చంద్రబాబును ఉద్దేశించి ఆవేశపూరితంగా ప్రసంగించారు. ఢిల్లీకి 42 సార్లు వెళ్లొచ్చారని, విభజన చట్టంలోని హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ అన్నారని, ఇంతవరకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్ కూడా అమలు కాలేదని అవంతి పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు తెలంగాణ ప్రజల్లా ఆందోళనలు చేయరని, సమయం చూసి నిర్ణయం తీసుకుంటారన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనైనా హామీలు అమలుకు నోచుకోవాలన్నారు.

శాస్త్ర సమాజానికే అవమానం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఘటించాలని ఆయన సూచించారు. ప్రాథమిక స్థాయిలో లభిస్తున్న ఆధారాలన్నీ లక్షల సంవత్సరాల క్రితం నివశించిన చింపాంజీల నుండి ప్రస్తుత మానవాళి ఆవిర్భవించినట్లు తెలుస్తోందన్నారు. అందువల్ల మానవాళి ఆవిర్భావానికి సంబంధించిన అంశాల ను శాసనాలు, పురాణాలలో పొందుపర్చే అవకాశ మే లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు శాస్త్ర విజ్ఞానానికి, శాస్త్ర సమాజానికి తీరని అవమానమని ప్రముఖ జీవశాస్త్రవేత్త కిరణ్‌మజుందార్‌షా తీవ్రంగా విమర్శించారు. బాధ్యతాయుతమైన మంత్రిపదవిలో వుంటూ ఇటువంటి వ్యాఖ్యలుచేయటం ఆ పదవికే సిగ్గుచేటైన విషయమని ఆయన దుయ్యబట్టారు. సత్యపాల్ సింగ్ వ్యాఖ్యలు 'నాన్సెన్స్' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ కొట్టిపారేశారు.

సమర్థించుకున్న మంత్రి

ఇదిలా వుండగా డార్విన్ సిద్ధాంతంపై తాను చేసిన వ్యాఖ్యలను మంత్రి సత్యపాల్‌సింగ్ గట్టిగా సమర్థించుకున్నారు.

ఆయన ఆదివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 'డార్విన్ మానవ పరిణామ సిద్ధాంతాన్ని ఇప్పుడుప్రపంచ వ్యాప్తంగా సవాలు చేస్తున్నార'న్నారు. డార్విన్ సిద్ధాంతం ఒక అభూత కల్పన అని, తాను ఎటువంటి ఆధారాలూ లేకుండా వ్యాఖ్యలు చేయనని ఆయన స్పష్టం చేశారు. తాను ఆర్ట్స్ నేపథ్యం నుండి రాలేదని, తాను ఢిల్లీ యూనివర్శిటీలో కెమిస్ట్రీ పిహెచ్‌డి చేశానని వివరించారు.

భారత్ అంటే వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

తొలిసారి. 1997లో హెచ్‌డి దేవగౌడ ఈ సమావేశాలకు హాజరయ్యారు,. ఈ సమావేశంలో స్వాగత కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తోంది. మోడీ దావోస్‌లో కేవలం 24 గంటలు మాత్రమే పర్యటించనున్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరానికి చెందిన 120 మంది అంతర్జాతీయ వాణిజ్య ప్రముఖులతో ఆయన మంగళవారం సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలైన్ బ్రెస్ట్‌తో మోడీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ పర్యటనలో మోడీ వెంట ఆరుగురు కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సురేష్ ప్రభు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంజె అక్బర్, జితేంద్ర సింగ్ తదితరులు పాల్గొంటారు.

ముగింపు సమావేశానికి ట్రంప్

ప్రపంచ దేశాల నేతలతో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఆయన సమావేశాల ముగింపు సందర్భంగా ప్రసంగించనున్నారు . పాక్ ప్రధాన మంత్రి షహీద్ ఖకాన్ అబ్బాసి కూడా ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. అయితే .ఆయనకు, మోడీకి మధ్య ఎటువంటి సమావేశం ఉండదని అధికారులు తెలిపారు. జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఇటలీ ప్రధాని పావ్‌లో జెన్‌టిలోని, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్ క్లాడ్ జంకర్, ఫ్రాన్సు అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడు తదితరులు హాజరుకానున్నారు.

25 ద్వైపాక్షిక సమావేశాలు జరపనున్న బాబు

దావోస్ చర్చల్లో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు . ఆదివారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం తెల్లవారుజామున దావోస్‌కు వెళ్లనున్నారు. 25 కీలక ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొంటారు. వ్యవసాయం, టెక్నాలజీ వినియోగం, ఆహార భద్రత, గ్లోబల్ ఫండ్, ఐటి, తయారీ రంగం, మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై సమావేశాల్లో చర్చిస్తారు.. ఈనెల 25న చంద్రబాబు తిరిగి అమరావతి చేరుకుంటారు.

పెద్దనాన్న, బాబాయ్ వేసిన పునాదులను పాడుచేయం

'తొలిప్రేమ' ఆడియో ఆవిష్కరణలో వరుణ్ తేజ్



సీనియర్ నరేశ్, థమన్, బీవీఎస్ ప్రసాద్, రాశీ ఖన్నా, వెంకీ అట్లూరి, వరుణ్ తేజ్, అల్లు అరవింద్, దిల్ రాజు తదితరులు

"నాకు హీరోయిన్ల వెతకడం అంటే చాలా కష్టం. నా హైట్‌కు సరిపోరు. కానీ తొలిసారి నా హైట్‌కు సరిపోయేలా రాశీఖన్నా దొరికింది. వర్ష అనే క్యారెక్టర్‌కు రాశి తన నటనతో న్యాయం చేసింది. మా పెద్దనాన్న, బాబాయ్ వేసిన ఈ పునాదులను పాడు చేయకుండా మంచి సినిమాలు చేస్తాం' అని వరుణ్ తేజ్ అన్నారు.

వరుణ్ తేజ్, రాశీ ఖన్నా హీరో హీరోయన్లుగా రూపొందుతోన్న సినిమా 'తొలిప్రేమ'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకుడు. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నారు. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. బిగ్ సీడీని, ఆడియో సీడీలను అల్లు అరవింద్ ఆవిష్కరించి తొలి సీడీని దిల్‌రాజు అందించారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ "ఈ సినిమా చేసే క్రమంలో ఆరు నెలల వరకు ఏ టైటిల్ పెడదామని ఆలోచించాం. దర్శకుడు వెంకీ ముందుగా 'తొలిప్రేమ' అనే టైటిల్ పెడదామని అనడంతో.. నాకు ఇష్టమున్నా కూడా కాస్త భయపడ్డాను. ఆ టైటిల్ పెట్టుకుని ఏమైనా తేడా వస్తే... మనకు పగిలిపోద్ది అని అన్నాను. ఎందుకంటే అది బాబాయ్‌కి బాగా కలిసొచ్చిన, నచ్చిన చిత్రం. అప్పటి 'తొలిప్రేమ'ను ప్రేక్షకులు ఎంత ఆదరించారో తెలుసు. కాబట్టి ఆ సినిమా టైటిల్ పెట్టినందుకు న్యాయం చేసేలా మా సినిమా ఉంటుందని నమ్మకంగా ఉన్నాం. సినిమా చూశాం. రేపు ప్రేక్షకులు , అభిమానులు ఎవ్వరూ కూడా నిరుత్సాహపడరు. 'లోఫర్', 'ఫిదా' ముందు ఈ కథను విన్నాను. కథ నచ్చంది. నా మనసుకు దగ్గరైన కథ. తనను కొన్ని రోజులు వెయిట్ చేయమని అన్నాను. తను నా కోసం వెయిట్ చేశాడు. మా నిర్మాతలు బాబీ, భోగవల్లి ప్రసాద్‌కి థాంక్స్. మా బాబాయ్, బన్ని అన్నతో ఆయన సినిమాలు చేశారు. నాకు కూడా మంచి సినిమా ఇచ్చినందుకు ఆయనకు థాంక్స్. ప్రియదర్శి, హైపర్ ఆది సహా నా పర్సనల్ ఫ్రెండ్స్ కూడా ఈ సినిమాలో నటించారు. మంచి ప్రేమకథకు మంచి సంగీతం, మంచి కెమెరా వర్క్ ఉండాలి' అని చెప్పారు.

చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ 'నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నన్ను నమ్మిన వ్యక్తి, ఇండస్ట్రీని నన్ను నమ్మేలా చేసిన వ్యక్తి దిల్‌రాజు. నేను ఎక్కడో నమ్మకం కోల్పోతున్న తరుణంలో ఆరు అడుగల నాలుగు అంగులాల ధైర్యాన్నిచ్చాడు వరుణ్ తేజ్. తర్వాత నా నమ్మకానికి ఊపిరి పోసిన వ్యక్తి బాపినీడు. తమన్‌ని, శ్రీమణిని మంచి సాంగ్స్ కోసం ఇబ్బంది పెట్టాను. ఇక కెమెరా మెన్ జార్జ్ నేను కన్న కలను తెరపై అందంగా చూపించిన వ్యక్తి' అన్నారు.

అరవింద్ మాట్లాడుతూ 'పవన్‌తో 'అత్తారింటికి దారేది' చేసిన ప్రసాద్ ఇప్పుడు ఆయన సినిమా టైటిల్‌తోనే వరుణ్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది. అప్పుడు పవన్‌కల్యాణ్‌కి తొలిప్రేమ సమయంలో ఎంత మంచి పేరొచ్చిందో ఈ తొలిప్రేమ సినిమాలో వరుణ్ తేజ్‌కు అంతే మంచి పేరు వస్తుందని అనుకుంటున్నాను. వరుణ్ రెండో సినిమా నుండి తనకు నచ్చిన సినిమా చేయాలని నిర్ణయించుకుని సినిమాలు చేస్తూ వస్తున్నాడు



అనుష్క టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాని, అల్లు అరవింద్, మారుతి తదితరులు హాజరయ్యారు. 'భాగమతి'కి అశోక్ దర్శకత్వం వహించారు.

ట్యాంగో కోసం పాట్లు



తమన్నా

కొత్తగా, విభిన్నంగా ఉంటేనే రంగుల ప్రపంచంలో రాణించగలం. ఆ విషయం తమన్నాకు బాగా తెలుసు. అందరిలాగే నటించగల్గడమే కాదు..ఇంకా ఏదైనా కొత్తగా చేయాలని భావించింది. తనను తాను నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో కూడా ఇదొక భాగమై ఉండొచ్చు. ఈ మిల్కీబ్యూటీ మంచి డాన్సర్. ఆ విషయం గురించి చెప్పనక్కర్లేదు. ఆమె తెలుగులో చేసిన సినిమాలు చూస్తే అర్థమవుతుంది. తాజాగా తమన్నా కల్యాణ్ రామ్ హీరోగా 'నా..నువ్వే' చిత్రంలో నటిస్తుంది. ఇందులో ఈమె రేడియో జాకీగా కనిపించనుంది. ఈ సినిమా కోసం ప్రత్యేంకగా ట్యాంగో డాన్స్ చేయబోతుంది. హాలీవుడ్ బాలీవుడ్‌కు బాగా పరిచయమున్న ఈ డాన్స్ చేయడం అంత సులువేం కాదని చెబుతుంది. ట్యాంగో డాన్స్‌తో ఉన్న గీతమే ఈ చిత్రానికి హైలైట్ కూడా అట. అందుకోసం ప్రత్యేకంగా తర్ఫీదు పొందుతోంది. ఈ ప్రాక్టీస్ ఈ మధ్య గాయపడిందట తమన్నా. అయినా మాస్టర్ బృందం అధ్వర్యంలో ట్యాంగో డాన్స్ పర్‌ఫెక్ట్ వచ్చేలా నేర్చుకుందట. జయేంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో ఈమె తన డాన్స్‌తో ఎలా మెప్పించబోతుందో చూడాలి.

'దివ్య మణి' గీతాలు



ప్రముఖ యోగా గురు, మార్షల్ ఆర్ట్స్ సురేష్ కమల్ హీరోగా, వైశాలి, కిమయా హీరోయిన్లుగా'దివ్య మణి' చిత్రం రూపొందుతోంది. మోహ మాయా ఎంటర్‌టైన్మెంట్స్, రెడ్ నోడ్ మీడియా పతాకంపై గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'దివ్య మణి'. గిరిధర్ గోపాల్ స్టీవ్ శ్రీధర్ సంగీతాన్ని అందించిన ఈ పాటలను ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. డా.యామిని కృష్ణ మూర్తి బిగ్‌సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కమల్ మాట్లాడుతూ 'నటుడుగా ఇది నా తొలి చిత్రం. యోగా నేర్పడం కోసం ప్రపంచమంతా తిరిగినా, నాకు తెలుగు నేలంటే చాలా ఇష్టం. గిరిధర్ గారు మంచి కథ చెప్పారు. యాక్షన్ అంతా నేను ఓరిజినల్‌గా చేశాను' అని చెప్పారు.

గిరిధర్ గోపాల్ మాట్లాడుతూ మనిషిని తనని తాను జాగృతి పరచుకోవడానికి సృజనాత్మకత ఎంతో అవసరన్నారు.

చైనాలో సూపర్

రెండు రోజుల్లో వంద కోట్లుపైనే వసూళ్లు చేసిన 'సీక్రెట్ సూపర్‌స్టార్'



మిస్టర్ పర్‌ఫెక్ట్ అమిర్ ఖాన్ చేసిన 'సీక్రెట్ సూపర్ స్టార్' ఇక్కడే కాదు చైనాలోనూ దుమ్మురేపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా అమిర్ తన సత్తాను చాటుకుంటున్నాడు. ఈ సినిమాను చైనాలో విడుదలైన రెండు రోజుల్లోనే 100కోట్ల మార్కును డాటేసింది. మొదటి రోజు రూ.45 కోట్లు వసూలు చేసింది. రెండో దానికి మించి కాసులు కురిపించింది. అంతేకాదు భారతీయ చిత్రాలేవీ ఇంత ఎక్కువ స్థాయిలో చైనాలో కలెక్షన్లు సాధించినవి లేకపోవడం విశేషం. గతంలో అమిర్ చేసిన 'పీకే', 'దంగల్' సినిమాలు ఒక దాని రికార్డులు మరొకటి తిరగ రాశాయి. ఇప్పుడు చైనాలో ఆ రికార్డులను 'సీక్రెట్ సూపర్ స్టార్' తిరిగ రాసింది. ఈ సినిమాలో జైరా వాసిమ్ కీలక పాత్రలో నటించింది. అమిర్ ఖాన్ దీన్ని నిర్మించారు. ఈ చిత్రం చైనాలో విడులైన మొదటి రోజు 6.86 మిలియన్ డాలర్లు, రెండో రోజు 10.45 మిలియన్ డాలర్లు కలెక్షన్లు వచ్చాయి. దీంతో 17.13 మిలియన్ డాలర్లు(110.52 కోట్లు) కలెక్ట్ చేసింది. మూడో రోజు కూడా అదే ఒరవడి కొనసాగుతోందని సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ ట్విట్టర్‌లో పేర్కొన్నాడు. 'దంగల్' దేశవ్యాప్తంగా 1459 కోట్లు, ప్రపంచ వ్యాప్తంగా అయితే 2000 కోట్లు కలెక్ట్ చేసింది.

నాని ఎన్టీఆర్‌గా చేస్తారా?

ఇటీవల బాలకృష్ణ ఎన్టీఆర్ బయోపిక్ తీస్తాను అని ఆ పాత్రలో తానే నటిస్తానని చెబుతున్నాడు. ఇదేమీ కొత్త న్యూస్ కాదు. కానీ ఎన్టీఆర్‌గా నాని చేస్తున్నాడట. కానీ బాలయ్య చేస్తున్న ఎన్టీఆర్ బయోపిక్‌లో కాదు. కీర్తి సరేశ్ టైటిల్ రోల్ పోషిస్తున్న 'మహానటి'లోనట. సావిత్రి జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్ర బృందం ఎన్టీఆర్ పాత్ర కోసం నానిని సంప్రదించిందట. ఈ పాత్ర కోసం ముందుగా జూనియర్ ఎన్టీఆర్ అయితే సరిపోతారని అతనని సంప్రదించారు. అది ఏమైందో ఏమో కానీ...ఇప్పుడు ఇదే పాత్ర కోసం నానిని కలిశారని తెలిసింది. ఈ చిత్రం దర్శకుడు నాగ అశ్విన్, నాని స్నేహితులు. వీరిద్దరూ కలసి 'ఎవడే సుబ్రమణ్యం' చేశారు. ఈ పాత్రలో నాని నటిస్తారా? లేదా? అన్నది ఇంకా స్పష్టత రాలేదట. సావిత్రితో ఎన్టీఆర్ 'దేవత', 'గుండమ్మకథ' ...వంటి చిత్రాల్లో చేశారు.



రణవీర్ సింగ్

ఫిల్మ్‌ఫేర్ సందడి

శారుఖ్ ఖాన్ డాన్సలు...రణవీర్ సింగ్ కొత్త అవతారం...బాలీవుడ్ తారల మెరుపులతో ఫిల్మ్‌ఫేర్ సందడిగా మారింది. హిందీ చిత్రసీమకే పెద్ద అవార్డులైన ఫిల్మ్‌ఫేర్ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ముంబాయిలో ఓ వేడుకలా నిర్వహించారు. బాలీవుడ్ తారల తళుకులతో వేదిక కళకళలాడింది. 2017- ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఉత్తమ నటిగా విద్యాబాలన్, ఉత్తమ నటుడిగా ఇర్ఫాన్ ఖాన్ నిలిచారు. 36వ ఫిల్మ్‌ఫేర్‌లో షారుఖ్ ఖాన్, తన స్నేహితుడు డైరెక్టర్ కరణ్ జోహార్‌తో కలసి వేదికపై సందడి చేశారు. ఉత్తమ చిత్రంగా 'హిందీ మీడియం' నిలిచింది. ఉత్తమ విమర్శ చిత్రంగా 'న్యూటన్' నిలిచింది. ఉత్తమ డైరెక్టర్‌గా అశ్విన్ అయ్యార్ తివారీ(బేరేలీ కి బర్ఫీ), ఉత్తమ నటిగా విద్యాబాలన్ (తుమ్‌హారీ సులు), ఉత్తమ నటుడిగా ఇర్ఫాన్ ఖాన్ (హిందీ మీడియం), ఉత్తమ సహయ నటుడు అవార్డును రాజ్‌కువర్ రావు (బారేలీ కి బర్ఫీ) దక్కించుకున్నారు. సహాయనటిగా మెహెర్ విజ్(సీక్రెట్ సూపర్‌స్టార్), ఉత్తమ క్రిటిక్ రాజ్‌కుమార్ (ట్రాప్‌డ్)కు వరించింది. జైరా వాస్మి ఉత్తమ క్రిటిక్ ఫీమేల్‌గా పురస్కారాన్ని అందుకుంది. ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్‌గా 'జగ్గా జాసూస్' నిలిచింది. ఉత్తమ గాయకుడిగా అర్జిత్ సింగ్ ..రోకే నా రుకే నైన...(బద్రినాథ్ కి దుల్హానియా). ఉత్తమ గాయనిగా మేఘనా మిశ్రా నాచ్ది ఫిరా...(సీక్రెట్ సూపర్‌స్టార్) గెలుచుకున్నారు.



సిద్ధార్థ్ కపూర్, విద్యాబాలన్





షారుక్ ఖాన్, సోనాక్షి సిన్హా బృందం డాన్సలు



పూజా హెగ్డే, సల్మాన్ ఖాన్



రాజ్‌కుమార్‌రావు, రణబీర్ కపూర్



సోనమ్, అక్షయ్



అలియా భట్



కాజోల్, జయాబచ్చన్, అక్షర హాసన్



వాయిదాల్లో కొంటున్నారా?

దేశీయ ఆర్థికరంగంలో విదేశీకార్పొరేట్ వాణిజ్యం ప్రవేశించిన తర్వాత ఖరీదైన వస్తు వినియోగం అనేది మరింత విస్తరించింది. సామాన్యులు ఖరీదైన గృహోపకరణాలు, వస్తువులూ కొనేందుకు వీలుగా పలు ఆకర్షణీయమైన పథకాలతో బ్యాంకులు ముందుకొస్తున్నాయి. ఆ క్రమంలో.. తమకు తెలిసో, తెలియకో సామాన్యులు సైతం వాయిదా పద్ధతుల ఆసరాగా క్రయవిక్రయాలు జరపడం అనేది సర్వసాధారణంగా మారింది. వాయిదా పద్ధతి అంటే.. మనం కొనే వస్తువుకి బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడం. వడ్డీతో కలిపి.. నిర్ణీత కాలంలో ఆ అప్పు తీర్చడం. అయితే ఇలాంటి రుణాలు తీసుకునేముందు ఆచీతూచి అడుగువేయాలి. ఆ.. విషయాలను ఈ వారం 'రూపాయి'లో తెలుసుకుందాం!

టీవి, కంప్యూటర్, వాషింగ్‌మిషన్, గ్రైండర్, చివరికి సెల్‌ఫోన్ ఇలా ఇంట్లోకి అవసరమయ్యే ప్రతివస్తువూ ఇప్పుడు మార్కెట్లో వాయిదా పద్ధతుల ద్వారా కొనుగోలు చేసేందుకు అందుబాటులో ఉంటున్నాయి. వ్యాపారవర్గాలూ ఖాతాదారుల్ని ఆకర్షించే క్రమంలో ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో ఖరీదైన వస్తువులు అందించేందుకు రకరకాల ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. అయితే ఇలా ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతుల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు అసలు ధర కంటే ఎక్కువ ధరను చెల్లించాలి అన్న విషయం మరచిపోకూడదు.

అసలు-వడ్డీ ఎంత?

నెలవారీగా చెల్లించే మొత్తంలో అసలుతో పాటు వడ్డీ ఎంత? అలాగే కాలపరిమితి మొత్తంగా చూస్తే వడ్డీ రూపంలో ఎంత అధికంగా చెల్లిస్తున్నామనే సంగతి కచ్చితంగా తెలుసుకోవాలి. అసలు ధరతో చెల్లించే మొత్తాన్ని బేరీజు వేసుకోవాలి. వడ్డీ రూపంలో భారీగా చెల్లించాల్సి వస్తుందనిపిస్తే మాత్రం ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతికి వెళ్ళకుండా ఉంటేనే శ్రేయస్కరం.

చెక్‌లు బౌన్స్ కావొద్దు ..

ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతుల్లో ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు వాయిదా చెల్లించే తేదీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉదాహరణకు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగస్తులు తమ జీతాలు దాదాపుగా ప్రతినెలా మొదటితేదీన అందుకుంటారు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదా చెల్లింపుల్ని నెలలో ఒకటి నుంచి ఐదో తేదీలోపుగా ఉండేలా చూసుకుంటే మంచిది. అలాకాకుండా నెల మధ్యలోనే చివరిలోనో వాయిదా చెల్లింపుల తేదీ పెట్టుకుంటే ఆర్థిక సమస్యలతో వాయిదాలు తప్పే ప్రమాదం ఉంది. దీనివల్ల బ్యాంకులో చెక్‌లు బౌన్స్ అయ్యే ప్రమాదం ఉంది. చెక్‌లు బౌన్స్ అయితే అటు బ్యాంకులోనూ ఇటు వస్తువులకు ఫైనాన్స్ చేసిన కంపెనీలోనూ పర్సనల్‌గా బాడ్‌ట్రాక్ నమోదయ్యే అవకాశం ఉంది. క్రెడిట్ స్కోరూ ప్రమాదంలో పడొచ్చు. భవిష్యత్తులో సిబిల్ ఇబ్బందులూ తలెత్తవచ్చు.





వాహన రుణమైతే?!

ఈ రోజుల్లో వాహనాల కొనుగోళ్ళన్నీ వాయిదా పద్ధతుల్లోనే జరుగుతున్నాయి. నామమాత్రం సొమ్ము చెల్లిస్తే చాలు ఖరీదైన ద్విచక్ర వాహనం, కార్లను కొనుగోలు చేసేందుకు సులభమార్గాలు ఉన్నాయి. అయితే అలా కొనుగోలు చేసిన వాహనాలపై అధికవడ్డీ అనేది చెల్లించకతప్పదు. రెండు, మూడు, ఐదేళ్ళ కాలపరిమితిలో తిరిగి చెల్లించే వాయిదా సొమ్ము మొత్తాన్ని లెక్కకడితే అదనంగా చెల్లించాల్సింది, చెల్లించింది భారీ మొత్తంలోనే ఉంటుంది. అవన్నీ పరిశీలించి, లెక్కలు కట్టిన తర్వాతే వాహనాలు కొనుగోలు చేయడం మంచిది. నెలవారీ కంతులు చెల్లించడానికి అందుకు తగ్గ ఆర్థిక వెసులుబాటు ఉందా? లేదా? అనే విషయం ముందుగా ఆలోచించాలి. అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడే వాయిదా పద్ధతిలో వాహన కొనుగోలు చేయడం మంచిది.

ఫైనాన్స్ (రుణం) ద్వారా కొనుగోలు చేసిన వాహనంపై.. ఆ రుణం మొత్తం చెల్లించేవరకూ ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీయే యజమాని అవుతాడు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదాసొమ్ము సకాలంలో చెల్లించకపోతే 'చెక్ బౌన్స్'తో బ్యాంకు ట్రాక్ ప్రమాదంలో పడక తప్పదు. అలాగే రెండు మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్ పెండింగ్‌లో పడితే.. ఆయా ఫైనాన్స్ కంపెనీలు వాహనాన్ని సీజ్ చేసే హక్కు కలిగి ఉంటారు. దీంతో అప్పటిదాకా చెల్లించిన సొమ్ము నష్టపోవడంతోపాటు చట్టపరంగానూ చిక్కులు కొనితెచ్చుకునే పరిస్థితుల్నీ ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే వాయిదాపద్ధతిలో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు 'రిస్క్' అంశాల్నీ దృష్టిలోపెట్టుకోవాలి.

- వి. చైతన్య

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -
jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్

సంప్రదాయ పొదుపు పథకాలు అంటే మొదటగా గుర్తొచ్చేవి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు. పెద్దగా వడ్డీ లెక్కలు తెలియకపోయినా పొదుపు చేయాలనే ఆలోచన ఉన్నవారికి ఇవి బాగా పరిచయమైనవే. ఇంచుమించు ఈ పథకాలను పోలిన మరో పొదుపు పథకమే 'సిప్'. ఇటీవల కాలంలో సిప్ పథకాల్లో పెట్టుబడుల పెట్టేవారి సంఖ్య అన్ని వర్గాల్లోనూ పెరుగుతుంది. రికరింగ్, ఫిక్స్‌డ్ పథకాలకు సమాంతరంగా 'సిప్' పథకాలూ అంతే ఆదరణ పొందుతున్నాయి. అయితే సిప్‌లలో పెట్టుబడి పెట్టడం, అంతకుతగ్గ లాభాలు పొందడం అంత తేలికైన విషయం కాదు. వాటిపై సరైన అవగాహన ఉండాలి. అప్పుడే సిప్‌లతో లాభసాటి అంటున్నారు ఆర్థికనిపుణులు. అసలు 'సిప్' పథకాలంటే ఏమిటి? వాటిని ఎలా ప్రారంభించాలి?



వీటికి ఉన్న తేడా ఏంటంటే.. సిప్‌లలో మనం నెల నెలా కట్టే డబ్బుకి సరిపడా.. ఫండ్ సంస్థలు యూనిట్లు కేటాయిస్తాయి. ఆయా ఫండ్స్ నికర అసెట్ విలువ (ఎన్ఏవీ-నెట్ ఎస్సెట్ వాల్యూ)ను బట్టి మనకు లభించే యూనిట్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఆయా షేర్లు, బంగారం రేట్లలో హెచ్చుతగ్గులను బట్టి ఫండ్ నెట్ ఎస్సెట్ వాల్యూ సిప్ విధానంలో ఎన్ఏవీ తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ యూనిట్లు, అలాగే ఎన్ఏవీ ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ యూనిట్లు చేతికి వస్తాయి. అయితే, సిప్‌లలో నిర్దిష్టంగా ఇంత రాబడి వస్తుందని ఉండదు. కొన్ని సందర్భాల్లో లాభాలు తగ్గనూ వచ్చు.

కాలపరిమితి

జాతీయ బ్యాంకులతోపాటు కొన్ని మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో సిప్ పథకాలు ప్రారంభించవచ్చు. రోజువారీ చెల్లింపులు మొదలుకొని, వీక్లీ, నెలవారీ, మూడునెలలు, ఏడాది, మూడేళ్ళు, ఐదేళ్ళు కాలపరిమితిన చెల్లింపులు ఉంటాయి. సిప్‌లో ప్రాచుర్యంలో ఉన్న పొదుపు పథకాల్లో మాత్రమే ఎక్కువమంది పెట్టుబడి పెడుతుంటారు. కొత్తగా వచ్చే పథకాలు, షేర్ ఆధారిత డిపాజిట్స్ వంటి వాటిల్లోకి తొంగి చూడాలంటే కొంతమంది భయపడతారు. కానీ, సంప్రదాయ పథకాల్లో వచ్చే వడ్డీ కంటే కాస్తంత మెరుగ్గా, పెట్టిన పెట్టుబడికి వచ్చేరాబడులూ వేగవంతం కావాలనే ఆలోచన చేసేవారికి కాస్తంత అనుకూలమైనవి సిప్ పథకాలని చెప్పొచ్చు. అయితే అందుకు తగ్గ అవగాహన కావాలి. ఒకవేళ నష్టం వచ్చినా భరించగలిగే శక్తి ఉండాలి.

సిప్ అంటే?

సిప్ అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. వీటిని ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందిస్తాయి. సిప్ పథకాలన్నీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా అసోసియేషన్ (యాంఫి) నియంత్రణలో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే సిప్ పథకమంటే కొంత రిస్క్ ఉంటుంది. అలాగని పెట్టే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఏమీ ఉండదు. సంప్రదాయ వనరుల్లో కాకుండా కాస్తంత లాభాలు తెచ్చిపెట్టే షేర్లు, బంగారం వంటి పెట్టుబడి సాధనాల్లో ఈ సిప్‌ల ద్వారా ఫండ్ సంస్థలు ఇన్వెస్ట్ చేస్తాయి.

పొదుపు చేయడం ఎలా?!

సిప్‌లలో కూడా నెలకి కొంత చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు. ఆర్‌డీకి, పెట్టుబడి పెట్టిన డబ్బును ప్రధానంగా ఆయా కంపెనీలు షేర్ మార్కెట్, బంగారం కొనుగోలు వంటి ఇతర లాభసాటి రంగాల్లో యూనిట్లుగా పెట్టుబడి పెట్టడం.. ఈ కారణంగా వాటిపై వచ్చే రాబడి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్స్ కంటే మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. ఫిక్స్‌డ్, రికరింగ్ సేవింగ్స్ కంటే ఎక్కువ అంటే సాలీనా 9 శాతం కంటే 12 నుంచి 15 శాతం వరకూ గ్యారంటీగా లాభాలు రావొచ్చు. ఒక్కొక్కసారి ఇంతకంటే ఊహించని లాభాలు పెరగొచ్చు. అలాగే షేర్‌మార్కెట్, బంగారం, డాలర్ ధరలు పడిపోతే కనీస రాబడి ఉండకపోవచ్చు. అందుకు సిద్ధపడాలి. యూనిట్లు మెరుగ్గా ఉన్నప్పుడు లాభసాటిగా అమ్ముకోవచ్చు. ★



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...

పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



దారి చూపండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని అబ్బాయికి కిందనున్న నిధి దగ్గరకు చేరేందుకు దారి చూపండి!

పొడుపు కథ


ఇది మన జాతీయ గీతం,
దేశభక్తికి ప్రతిరూపం,
భిన్న సంస్కృతుల
ప్రతిబింబం,
రవీంద్రనాథుని లిఖితం..?

జోక్ :

మాస్టారు : రాముా, రోజూ స్కూలుకు లేటుగా వస్తున్నావెందుకు?

రాము : 'స్కూలు ఉంది నెమ్మదిగా వెళ్ళండి!' అని బోర్డు రాశారు కదా.. అందుకే నిదానంగా వస్తున్నాను సార్..!

స్వచ్ఛత కోసం మళ్లీ సైకిలెక్కాడు



విజయవాడ కృష్ణలంకకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి జయచంద్రప్రసాద్. గతంలో హెల్మెట్లు ధరించాలని విజయవాడలో 40 రోజుల పాటు 200 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రచారం చేసి.. అందరి మన్ననలను అందుకున్న విషయం తెలిసిందే. సమయం దొరికితే సమాజానికి తనవంతుగా ఏదైనా చెయ్యాలనే తపన ఉన్న ఈ పిల్లాడు సమాజశ్రేయస్సు కోసం తనదైన శైలిలో మళ్ళీ రోడ్లపైకొచ్చి సైకిల్ తొక్కుతున్నాడు. అలా తొక్కడానికీ ప్రత్యేక కారణమూ ఉంది.

ఈ సంక్రాంతి సెలవుల్లో సరదాగా ఆడుతూ పాడుతూ గడుపుతున్న జయచంద్రప్రసాద్‌కు.. కృష్ణాజిల్లా కలెక్టరు లక్ష్మీకాంతం 'చెంబుకు సమాధి



కట్టిండి!' అంటూ చెంబుకు శవయాత్రను నిర్వహించిన కార్యక్రమం ఎంతగానో ఆకర్షించింది. వెంటనే తన సైకిల్‌కు పని చెప్పాడు. ఆటపాటలు పక్కనపెట్టి, ఇంట్లోవాళ్ళను ఒప్పించి.. తన చిట్టిబుర్రపై హెల్మెట్ ధరించి, 'పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి! మరుగుదొడ్లు వినియోగించాలి' అన్న నినాదాలతో హుషారుగా రోడ్లపై చక్కర్లుకొడుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. తను సంకల్పం నెరవేరడం కోసం జనవరి 12 నుంచి 21 వరకు అంటే పదిరోజులపాటు ఉదయం, సాయంత్రం అవగాహన ప్రచారం చేసేందుకు ప్రణాళిక వేసుకున్నాడు జయచంద్ర. 'స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' అనే ప్లకార్డును సైకిల్‌కు తగిలించుకుని, విజయవాడలోని పలు వీధుల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల వినియోగంపై కరపత్రాలూ పంచిపెడుతున్నాడు. "హెల్మెట్ ప్రచారం, స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లపై చేసిన అవగాహన ప్రచారాల వల్ల నాకెంతో హ్యాపీగా ఉంది. ఇలా చిన్నపిల్లాడినైన నేను హెల్మెట్ పెట్టుకుని, సైకిల్ తొక్కుతుంటే.. ఆసక్తిగా చూస్తారు.. ప్రజల్లో వీటిపై అవగాహన వస్తుంది. నన్ను చూసి చాలామంది.. నా సైకిల్ ఆపి మరీ 'శభాష్.. గుడ్‌బోయ్!!' అంటూ మెచ్చుకుంటున్నారు" అని సంతోషంగా చెబుతున్న మాష్టర్ జయచంద్ర భవిష్యత్తులో మరిన్ని ప్రజాప్రయోజనకరమైన సైకిల్ యాత్రలు చేపట్టాలని కోరుకుందాం!! ★



త్రోబాల్ రాష్ట్ర విజేతలు కడప, విశాఖ


బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన కడప జట్టు

ప్రజాశక్తి - గాజువాక, విశాఖ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 63వ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర విభాగంలో కడప, చిత్తూరు, కర్నూలు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం, కడప, కృష్ణా జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా 232 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ క్రీడలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

మూడో టెస్ట్‌కు రహానే, కార్తీక్?


రహానే

తుదిజట్టులో చోటు లాంఛనమే..

మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింకా రహానే, వికెట్ కీపర్ దినేష్ కార్తీక్‌లకు మూడో టెస్ట్‌లో చోటు లభించనుంది. రెండో టెస్ట్ మ్యాచ్‌లో మూడు మార్పులతో దిగినా... ఆ టెస్ట్ మ్యాచ్‌కూడా ఓటమిపాలైంది. బ్యాటింగ్ ఆర్డర్‌ను పటిష్టపరిచే ప్రక్రియలో భాగంగా వీరిద్దరికీ తుదిజట్టులో చోటు లభించడం ఖాయంగా కనిపిస్తోంది.

(ప్రజాశక్తి - స్పోర్ట్స్‌డెస్క్)

ఇప్పటికే దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌ను 2-0తో కోల్పోయిన టీమిండియా 24 నుండి ప్రారంభం కానున్న మూడో టెస్ట్ కోసం జట్టులో మరికొన్ని మార్పులు చేసే అవకాశముంది. ఆ మార్పుల్లో భాగంగా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింకా రహానే, వికెట్ కీపర్ దినేష్ కార్తీక్‌లకు తుదిజట్టులో చోటు లభించడం ఖాయంగా కనిపిస్తోంది. గాయపడిన వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా స్థానంలో రెండో టెస్ట్‌కు పార్థీవ్ పటేల్‌ను తీసుకున్నారు. సెంచూరియన్ టెస్ట్‌లో పార్థీవ్ ఆశించిన స్థాయిలో బ్యాటింగ్‌లో రాణించకపోవడంతోపాటు... కీలకమైన క్యాచ్‌లను జారవిడిచాడు. దీంతో మూడో టెస్ట్‌లో పార్థీవ్ కొనసాగించే అవకాశాలు దాదాపు మూసుకుపోయాయనే చెప్పవచ్చు.

కేప్‌టౌన్ టెస్ట్ ఓటమి అనంతరం టీమిండియా మూడు మార్పులతో సెంచూరియన్ టెస్ట్‌కు సిద్ధమైంది. ఆ టెస్ట్‌కు మూడు మార్పులు చేసి పార్థీవ్, ఇషాంత్, రాహుల్‌లకు స్థానం కల్పించారు. అయినా ఫలితం ఏమాత్రం మారలేదు. బౌలింగ్‌లో రాణిస్తున్న టీమిండియా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమౌతోంది. తొలి రెండు టెస్ట్ మ్యాచ్‌ల ఓటమికి బ్యాట్స్‌మెన్ వైఫల్యమే కారణం అనడంలో ఏమాత్రం సందేహం లేదు. బ్యాటింగ్ పటిష్టతలో భాగంగానే రహానే, దినేష్ కార్తీక్‌లకు తుదిజట్టులో చోటు లాంచనమే అనక తప్పదు.

శనివారం దక్షిణాఫ్రికాకు బయలుదేరిన శార్దూల్ ఠాకూర్, నవదీప్ సైనీ ఆదివారం టీమిండియాతో కలిసి బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. సైనీ ఇటీవల జరిగిన రంజీట్రోఫీలో విదర్భ తరపున పాల్గొని రంజీ టోర్నీ ఉత్తమ బౌలర్‌గా నిలిచాడు.

టెస్ట్‌లు	చేసిన పరుగులు	యావరేజ్	సెంచ/అర్ధ	అత్యధికం
		రహానే		
43	2,826	44.15	9/12	188
		దినేష్ కార్తీక్		
23	1,000	27.78	1/7	129

వీరిని టీమిండియా వన్డేల నిమిత్తం ఉపయోగించుకోనుందో... చివరిటెస్ట్‌లో స్థానం కల్పిస్తారో వేచిచూడాల్సి ఉంది.

జోహాన్స్‌బర్గ్ పిచ్‌పై ఛటేశ్వర పుజరా, విరాట్ కోహ్లీ, ఇషాంత్ శర్మ, మహ్మద్ షమిలకు మంచి రికార్డ్ ఉంది. 2013 పర్యటనలో ఇదే మైదానంపై కోహ్లీ 119, పుజరా 153 పరుగులు సాధించారు. బౌలింగ్‌లో ఇషాంత్ శర్మ 4/79, మహ్మద్ షమి 3/107 వికెట్లు సాధించి ఉన్నారు. పుజరాను కూడా తుదిజట్టులో కొన సాగించే అవకాశా లున్నాయి. ఏది ఏమైనా జనవరి 24 నుండి దక్షిణాఫ్రికాతో జరిగే మూడవ, చివరిదైన టెస్ట్‌లోనైనా ఓటమి చెందక... వైట్‌వాష్ కాకుండా బయట పడాలని ఆశిద్దాం...


దినేష్ కార్తీక్

ముగిసిన ఎఎస్‌ఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌సి రాము సూర్యారావు

ప్రజాశక్తి-పాలకోడేరు

రాష్ట్రంలో మండలానికి ఒక మినీస్టేడియాన్ని నిర్మిస్తామని చెప్పిన సిఎం చంద్రబాబు ఆ హామీని అమలు చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి రాము సూర్యారావు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన అల్లూరి సీతారామరాజు స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కెవిపిఎస్, డివైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ పోటీల్లో 36 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో శృంగవృక్షం వినాయక లెవెంత్ టీమ్, శృంగవృక్షం శ్రీను టీమ్‌లు నువ్వానేనా అన్నరీతిలో హోరాహోరిగా తలపడ్డాయి. శృంగవృక్షం వినాయక లెవెంత్ జట్టు విజేతగా నిలిచింది. విజేతకు రూ.పదివేలు, రన్నర్‌కు రూ.ఐదు వేలు, తృతీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.వెయ్యి, పాల్గొన్న క్రీడాకారులకు షీల్డ్‌లను అందించారు.

కోల్‌మన్ ప్రపంచ రికార్డు



లాస్ ఏంజిల్స్: అమెరికా స్టార్ అథ్లెట్ క్రిస్టియన్ కోల్‌మన్ 60 మీటర్ల పరుగు పందెంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. శనివారం అర్ధరాత్రి లో లెవల్ క్లెమ్‌సన్ ఇన్విటేషనల్ ట్రాక్ మీట్‌లో కోల్‌మన్ 6.37 సెకండ్లలో 60 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. గతంలో మాడ్రిడ్ (1998), అట్లాంటా (2001)లో సహచర అమెరికన్ మౌరిస్ గ్రీని (6.39 సెకండ్లు) నెలకొల్పిన రికార్డును ఈ సందర్భంగా బద్దలు కొట్టాడు. అయితే ఈ రికార్డును అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఎఎఎఫ్) నిర్ధారించాల్సి ఉంది.

సిరీస్ ఇంగ్లండ్ కైవసం

ఆస్ట్రేలియాపై మూడో వన్డేలోనూ గెలుపు

సిడ్నీ : ఇంగ్లండ్ మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడిన ఇంగ్లండ్ 16 పరుగుల తేడాతో విజయాన్ని సాధించి ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు వన్డేలు మిగిలి ఉండగానే గెలుచుకుంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 6 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బట్లర్ 100, వోక్స్ 53 పరుగులు అజేయంగా సాధించారు. అనంతరం లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. ఫించ్, మిచెల్ మార్ష్, స్టోనిచ్‌లు అర్ధసెంచరీలతో రాణించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బట్లర్‌కు లభించింది.

మోర్గాన్ రికార్డు!

ఇంగ్లండ్ సారథి ఇయాన్ మోర్గాన్ సరికొత్త రికార్డు సృష్టించాడు. ఆసీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా అవతరించాడు. ఆసీస్ మాజీ సారథి రికీ పాంటింగ్ 1,598 పరుగుల రికార్డును మోర్గాన్ బద్దలు కొట్టాడు. ఆసీస్ స్పిన్నర్ ఆడమ్ జంపా బౌలింగ్‌లో రివర్స్ స్వీప్‌లో రెండు పరుగులు సాధించి వ్యక్తిగతంగా 1,600 పైచిలుకు పరుగుల రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మోర్గాన్(41) హాఫ్ సెంచరీకి చేరువలో పెవిలియన్ చేరాడు.

కెజిబివి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-జిల్లాపరిషత్ (విశాఖ)

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రి గంటా శ్రీనివాసరావు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన కెజిబివి క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా, మంత్రి గంటా వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కెజిబివి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 2008 నుంచి కేంద్రం ప్రభుత్వం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా బాలికలను శారీరకంగా, మానసికంగా సంసిద్ధులను చేయడానికి కెజిబివి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎయు రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, కెజిబివి కార్యదర్శి నాగేశ్వరరావు, ఉప కార్యదర్శి పార్వతీదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, సర్వశిక్షాఅభియాన్ పిఒ టి.శివరామప్రసాద్,13 జిల్లాల అధికారులు, పిఇటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ఇవీ పోటీలు

మూడు రోజుల పాటు జరగనున్న క్రీడల్లో 9 విభాగాల్లో క్రీడాకారులు పోటీపడనున్నారు. కబడ్డీ, ఖోఖో, బాలీబాల్, బాల్‌బాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, షటిల్ బాడ్మింటన్, టెన్నీకాయిట్, రోప్ స్కిప్పింగ్, తైక్వాండో, పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావిలిన్ త్రో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.

చెమటోడ్చిన టాప్ సీడ్లు

- మిక్సిడ్ డబుల్స్‌లో బొప్పన్న జోడీ ముందుకు..

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఒకవైపు ఎండ తీవ్రత హోరెత్తుతుంటే... మరోవైపు టాప్ సీడ్ క్రీడాకారులు గెలవడానికి చెమటోడ్చాల్సి వస్తోంది. ఆదివారం 6వ సీడ్ క్రీడాకారుడైన సిలిక్(క్రొయేషియా) 6-7(2-7), 6-3, 7-6(7-0), 7-6(7-3) సెట్ల తేడాతో 10వ సీడ్ స్పెయిన్‌కు చెందిన బూస్టాపై కష్టపడి గెలిచాడు. 3వ సీడ్ డిమిట్రోవ్(బల్గేరియా) 7-6(7-3), 7-6(7-4), 4-6, 7-6(7-4) సెట్లతో కర్గియోస్(ఆస్ట్రేలియా) పై... వరల్డ్ నెంబర్ వన్ రఫెల్ నాదల్(స్పెయిన్) 6-3, 6-7(4-7), 6-3, 6-3తో స్వాట్జ్‌మన్(అర్జెంటీనా)పై విజయాలను సాధించి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.

మహిళల విభాగంలో డెన్మార్క్‌కు చెందిన 2వ సీడ్ వాజ్నోంకీ 6-3, 6-0 సెట్ల తేడాతో రైబరికోవా(స్లొవేకియా)ను ఓడించింది. ఉక్రెయిన్‌కు చెందిన ఎలీనా స్విటోలినా 6-3, 6-0తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్వాలిఫయర్‌పై గెలిచి ముందుకు దూసుకుపోయారు. 5వ సీడ్ భారత్‌కు చెందిన రోహన్ బొప్పన్న, హంగరీకి చెందిన బాబోస్ మిక్సిడ్ డబుల్స్ జోడీ ఆస్ట్రేలియాకు చెందిన విట్టింగ్‌టన్, పెరేజ్‌ల జోడీపై 6-2, 6-4 సెట్ల తేడాతో మొదటిరౌండ్‌లో గెలిచి ముందుకెళ్లారు.


బాబోస్, రోహన్ బొప్పన్న

బెల్జియం చేతిలో ఓటమి

నాలుగు దేశాల ఇన్విటేషన్ హాకీ ఫైనల్

తరంగ(న్యూజిలాండ్) : నాలుగుదేశాల ఇన్విటేషన్ హాకీ (మొదటిదశ) ఫైనల్లో భారత హాకీ జట్టు ఓటమిచెందింది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో బెల్జియం చేతిలో 2-1 గోల్స్ తేడాతో పరాజయంపాలైంది. బెల్జియం ఆటగాళ్లు టామ్ బూన్ (4 ని.), సెబాస్టియన్ డాకిర్ (36) గోల్స్ చేయగా... భారత్ తరపున మన్‌దీప్ సింగ్ (19) ఒక్కడే గోల్ చేశాడు. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్న ప్రత్యర్థి జట్టు గోల్ చేసింది. ఆ తర్వాత రెండు జట్లు బంతిని అధీనంలో ఉంచుకునేందుకు పోటీపడ్డాయి. రెండో క్వార్టర్‌లో టీమిండియా ప్రత్యర్థి గోల్‌పోస్ట్ ముందు వలయాలు ఏర్పరిచి పదేపదే దాడులు చేసింది. ఈ క్రమంలోనే రూపిందర్‌పాల్ ఇచ్చిన పాస్‌ను మన్‌ప్రీత్ సింగ్ చక్కగా స్లైస్ చేసి 1-1తో స్కోర్ సమం చేశాడు. రెండో దశలో భాగంగా జనవరి 26న ఆతిథ్య జట్టు న్యూజిలాండ్‌తో భారత్ తొలి మ్యాచ్‌లో తలపడనుంది.

ఆనంద్ ఓటమి



విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌కు ఏడో రౌండ్‌లో ఓటమి ఎదురైంది. రష్యా గ్రాండ్‌మాస్టర్ వ్లాదిమిర్ క్రామ్నిక్‌తో ఏడో రౌండ్ గేమ్‌లో తలపడిన ఆనంద్ పరాజయం చవిచూశాడు. క్రామ్నిక్ 36 ఎత్తుల్లో ఆనంద్‌ను ఓడించాడు. ఏడోరౌండ్ ముగిసే సమయానికి ఆనంద్ 4 పాయింట్లతో ఏడో స్థానంలో... క్రామ్నిక్ 4.5 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు.


సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు దుర్గమ్మ చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో సినీనటుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -ఇంద్రకీలాద్రి (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను సినీనటుడు రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి దర్శనార్థం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను అమ్మవారి ఆలయంలో పెరిగాననీ, దుర్గమ్మ ఆలయమే తనకు జన్మస్థలం, పూర్వ ఉద్యోగిని కూడా అని ఆయన గుర్తు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నట్టు పేర్కొన్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులున్నారు.

బాబు నల్లధనం దావోస్‌లో భద్రం

- హెరిటేజ్ కోసం విజయ డెయిరీ మూత
- కమీషన్ల కోసం 'సహకార సుగర్స్'కు తాళాలు
- ప్రజాసంకల్ప యాత్రలో జగన్ తీవ్ర విమర్శలు



అభివాదం చేస్తున్న జగన్, ప్రజాసంకల్పయాత్రకు తరలివచ్చిన అభిమానులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు దోచుకుంటున్న అవినీతి సొమ్మును దావోస్‌లో దాచుకుంటున్నాడని ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బాబు స్వలాభాల కోసం చిత్తూరులోని విజయ పాల డెయిరీని, గాజులమండ్యం, చిత్తూరు చక్కెర కర్మాగారాలను మూసి వేయించారని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఆదివారం శ్రీకాళహస్తికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పెళ్ళిమండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ప్రజలు నరకాన్ని చూస్తున్నారని వాపోయారు. ఏ ఒక్కరూ కూడా చంద్రబాబు పాలనపై సంతృప్తితో ఉన్నట్లు చెప్పడం లేదని, సొంత జిల్లా చిత్తూరుకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఆయన స్వలాభాలకు పాడిరైతుల పొట్టనింపుతున్న చిత్తూరు విజయ డెయిరీని మూసి వేయించారనీ, తద్వారా ఆయన సొంత డెయిరీ హెరిటేజ్‌ను లాభాల బాట పట్టించి కోట్లు కూడగట్టాడని ఆరోపించారు. శ్రీకాళహస్తికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నవరం భెల్ ఫ్యాక్టరీని దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి రూ.6వేల కోట్ల వ్యయంతో ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయన మరణానంతరం పరిశ్రమల పనులు పూర్తిగా అటకెక్కాయని అన్నారు. మన్నవరం పూర్తయితే ప్రత్యక్షంగా ఆరువేల మందికి, పరోక్షంగా పదివేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేవని చెప్పారు. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోటీ పడి పరిశ్రమను ఇక్కడకు తెస్తే ఆయనకు ఎక్కడ పేరొస్తుందోనని చంద్రబాబు మోకాలడ్డుతున్నాడని ధ్వజమెత్తారు. రూ.ఆరు వేల కోట్ల నిధులు ఇప్పుడు రూ.400 కోట్లకు వచ్చాయనీ, అక్కడ పనిచేస్తున్న స్థానికుల్లో 20 మంది గేట్ వద్ద వాచ్‌మెన్లుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ, పెట్రోలు ఛార్జీలు పెరిగిపోవడంతో ప్రజలు ప్రయాణం చేయాలంటే గుండెలు బాదుకుంటున్నారని వాపోయారు. చంద్రబాబు ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థను నిర్వీర్యం చేసి హెరిటేట్ పార్టనర్ అయిన రిలయన్స్‌కు ఆ బాధ్యతలు అప్పగించే పనిలో పడ్డారని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వస్తే నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపిలు వరప్రసాద్, విజయ్‌సాయిరెడ్డి, ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అంజూరు శ్రీనివాసులు, మిద్దెల హరి, కొట్టెడి మధుశేఖర్, ఉన్నం వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68